Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 17 | సంచిక: 55 | కరీంనగర్ | ఆదివారం 19 జులై 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ

**- 'విక్రమ్-1' విజయవంతంపై రేవంత్ హర్షం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూలై 18 :భారత్ తొలి ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతంపై తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. 'హైదరాబాద్ రైజింగ్.. తెలంగాణ రైజింగ్' అంటూ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1' విజయవంతమైన ప్రయోగమన్నారు. శ్రీహరికోట నుంచి విక్రమ్-1 నింగిలోకి దూసుకెళ్లిందని, హైదరాబాద్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్

11 లో

## స్కైరూట్ మన టీ హబ్‌లోనే పుట్టింది

**- విక్రమ్ విజయవంతంపై కెటిఆర్ అభినందనలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూలై 18 : టి హబ్ వేదికగా ఏర్పడ్డ స్కైరూట్ సంస్థ శ్రీహరికోటలో చేపట్టిన విక్రమ్-1 రాకెట్ ప్రయోగ విజయ వంతం కావడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్ సరూర్ నగర్‌లో తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ మాట్లా డుతూ.. టీ హబ్‌లో పురుడు పోసుకున్న కంపెనీ పేరు స్కైరూట్. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏండ్లు అయింది. ఇవాళ భారతదేశ చరిత్రలో ఒక ప్రైవేట్

11 లో








### లక్షల ఉద్యోగాల

# హామీ ఏమయ్యింది

- జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ
- కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా
- ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి
- తెలంగాణలో లూటీ జరుగుతోంది
- మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోంది
- చాయ్ పే చర్చాను మరచిన రాహుల్
- బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూలై 18 : ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా అని ప్రశ్నించారు. యువత తలరాత మారుస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని.. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా

11 లో

### దొరల గడీల ముందు

# మోకరిల్లని కవి అందెశ్రీ

- అందెశ్రీని, గద్దర్‌ను అవమానించిన కెసిఆర్
- వేల ఎకరాల్లో ఫామ్‌హౌజ్‌లతో కులకుతున్న నేతలు
- నేనున్నంత వరకు బిఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల
- నిరుద్యోగులను మోసం చేసిన ఘనులు బిఆర్ఎస్ నేతలు
- అందెశ్రీ స్మృతివనం శంకుస్థాపనలో సిఎం రేవంత్ విమర్శలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


హైదరాబాద్, జూలై 18 : దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి అందెశ్రీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవిగా, గాయకుడిగా తెలంగాణ సమాజానికి సుపరిచితులైన ఆయన.. తనకు ఆత్మబంధువని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో 'అందెశ్రీ స్మృతివనం' నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందెశ్రీని ఆనాటి ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజా గాయకుడు గద్దర్‌ను కూడా ప్రగతిభవన్ గేటు ఎదుట ఎర్రటి ఎండలో నిలబెట్టారని విమర్శించారు. వారిద్దరన్నీ అవమానించిన ప్పుడే దొరలను సాగనంపాలని జనం నిర్ణయించుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీతో తనకున్న

11 లో

## 'విక్రమ్-1' విజయవంతంపై ప్రధాని మోడీ హర్షం

**- స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి ఫోన్‌లో అభినందనలు**

**- ఇంజనీర్ల కృషిని ప్రశంసిస్తూ..తనను కలవాలని సందేశం**



(ప్రజాలక్ష్యం బ్యూరో)

న్యూఢిల్లీ, జూలై 18 : భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయ వంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతమైన వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు మోదీ. ఈ ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్టు చెప్పిన ఆయన.. ఈ ఘనత దేశానికి గొప్ప విజయమని అభివర్ణించారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇదో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. 'ప్రయోగాన్ని

11 లో

## నేను ఎప్పుడూ పదవులు అడుకోను

**- నా నిర్ణయాలన్నీ సంచలనంగానే ఉంటాయి**

**- ఎమ్మెల్యే రాజగోపాలరెడ్డి సంచలన వ్యాఖ్యలు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూలై 18 : నేను ఎప్పుడూ పదవులు అడుక్కోను.. నేనొక ఫైటర్‌ను. నేను ఏ నిర్ణయం తీసుకున్నా అది ఒక రెవల్యూషన్ లాగే ఉంటుందని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే.. తనను ఓడించడానికి వంద మంది ఎమ్మెల్యేలు మునుగోడుకు వచ్చారని, అలాగే ఎమ్మెల్సీ పోటీలో తాను నిలబడితే ఆనాడు కేసీఆర్‌కు నిద్ర కూడా పట్టలేదని తన

11 లో

## భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం

**- స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం**

**- తొలుత ఇంధన ప్రక్రియలో సాంకేతిక లోపం**

**- అరగంటలోపే సరిదిద్ది ప్రయోగాన్ని పూర్తి చేసిన షార్**

**- ప్రైవేట్ రంగంలో తొలి రాకెట్ కావడంతో సర్వత్రా హర్షం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

శ్రీహరికోట, జూలై18 : భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి చేపట్టిన ప్రయోగం విజయవంతం అయ్యింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1' రాకెట్ రూపొందించింది. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యక్రమాలు సహా భారత ప్రైవేటు రంగం కూడా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటినట్లు అయ్యింది. వాస్తవానికి ఉదయం 11.30 గంటలకు ప్రయోగం

11 లో



## ప్రజాకవికి అపూర్వ గౌరవం ఇచ్చాము

**- అందెశ్రీ కుటుంబానికి వాగ్దానాలన్నీ నెరవేర్చాం**

**- 'అందెశ్రీ స్మృతి వనం' శంకుస్థాపనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూలై 18 : ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సాంస్కృతిక సారథి, ప్రజాకవి డాక్టర్ అందెశ్రీకి తమ ప్రభుత్వం అపూర్వ గౌరవం ఇచ్చిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్‌లో అందెశ్రీ అంతిమ సంస్కారాలు జరిగిన ప్రదేశంలో 'అందెశ్రీ స్మృతి వనం' ఏర్పాటుకు, అలాగే ఆయన విగ్రహ ప్రతిష్ఠాపనకు జయంతి రోజైన శుక్రవారం నాడు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో కలిసి ఉప ముఖ్యమంత్రి భూమి పూజ చేసి, పునాది రాయి వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ... సాధారణంగా నాయకులు లేదా ప్రభుత్వాలు ఒక కార్యక్రమం చేసి ఆ తర్వాత వదిలేస్తుంటాయని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అలా కాదని, ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటుందని చాటిచెప్పారు. అందెశ్రీ దివంగతులైన వేళ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆయన పాడె మోసి ఒక కవికి

11 లో

## ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ కొరత రావద్దు

**- అవసరమైన సరఫరా కొనసాగించాలన్న భట్టి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూలై18 : ఎల్‌నినో సవాళ్లను ముందుగానే అంచనా వేసి రాష్ట్రంలో విద్యుత్ సరఫరాపై ఎలాంటి ప్రభావం పడకుండా ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించడం మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని విస్తరించడం, రాష్ట్రవ్యాప్తంగా 'పవర్ అంబులెన్స్' సేవలను బలోపేతం చేయ డం, అంగన్‌వాడీ కేంద్రాలకు దశలవారీగా సోలార్ విద్యుత్

11 లో

## ఆహార కల్తీపై ఇక ఉక్కుపాదం

**- ప్రజల ప్రాణాలతో చెలగామడితే కఠిన చర్యలు**

**- ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం**

**- ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం**

**- సేంద్రియ ఉత్పత్తుల పేరుతో విచ్చలవిడిగా అమ్మకాలు**

**- వాటి స్వచ్ఛతపైనా ఇకనుంచి పరిశీలిన**

**- అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన**

**- ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూలై 18 : ఆహార, ఔషధాల కల్తీని నిరోధించేందుకు కఠిన చట్టం రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు, ఆహార పదార్థాల కల్తీ వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు.. పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలకు అమ్ముతున్నారని, అవి సేంద్రియ ఉత్పత్తులేనని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించడంతో పాటు.. ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కల్తీలకు సంబంధించి సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలట్

11 లో

## భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవు

**- అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నాం**

**- బండి సంజయ్, ఈటెల మధ్య సయోధ్యకు యత్నం**

**- ఎంపి లక్ష్మణ్ నివాసంలో ఇద్దరు నేతలతో అభయ్ పాటిల్ చర్చలు**

**- తెలంగాణలో అధికారం బిజెపిదేనన్న ఎంపి లక్ష్మణ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, జూలై 18 : తెలంగాణ భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవని, అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నామని బిజెపి ఎంపి లక్ష్మణ్ అన్నారు. బండి సంజయ్, ఈటెల రాజేందర్ మధ్య ఉన్న విభేదాలపై ఆయన స్పందించారు. కీలక నేతల మధ్య విభేదాలపై అధిష్ఠానం దృష్టి సారించింది. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్‌తో ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్ భేటీ అయ్యారు. ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇరువురు నేతలతో గంట పాటు సమావేశం జరిగింది. పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని అభయ్ పాటిల్ వారికి సూచించారు.

11 లో

### అబద్దాలు ప్రచారం చేసేవారికి

## సోషల్ మీడియాలో చోటు

**- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రికి ప్రజల గుండెల్లో స్థానం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూలై 18 : ప్రజాకవి, పద్మశ్రీ డాక్టర్ అందెశ్రీ జయంతి వేడుకల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ అమరవీరుల స్మారక చిహ్నంలో రాష్ట్రవ్యాప్త కవులు, కళా కారులు మరియు రచయితలతో

11 లో





# మానవీయ కోణంలో ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించాలి

**- బాధితుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ న్యాయం చేయాలి - బాధితులను కూర్చోబెట్టి ఓపికగా వింటే సగం సమస్యకు అక్కడే పరిష్కారం- ప్రతి నెల 'సివిల్ రైట్స్ డే' - ప్రతి మూడు నెలలకు విజిలెన్స్ కమిటీ సమావేశం తప్పనిసరి - జిల్లా యంత్రాంగం పనితీరు అభినందనీయం - ఇదే స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలి - ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, జూలై 18 : ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను అధికారులు మానవీయ కోణంలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. బాధితులను గౌరవంగా కూర్చోబెట్టి వారి సమస్యలను ఓపికగా వింటేనే వారికి న్యాయం జరుగుతుందనే నమ్మకం కలుగుతుందని, వారి ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ప్రతి అధికారి సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. శనివారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్వో స్వామి, నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ డీసీపీ వెంకటరమణతో కలిసి జిల్లా అధికారులతో ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు జిల్లా కలెక్టర్ జిల్లాలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించగా, అనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలోని సంక్షేమ పథకాలు, రిజర్వేషన్ల అమలు, అట్రాసిటీ కేసుల పురోగతి, విద్య, ఉపాధి, గురుకులాలు, గిరిజన సంక్షేమ కార్యక్రమాలపై సమగ్ర వివరాలను కమీషన్‌కు సమర్పించారు. సమీక్ష సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో శిక్షల శాతం (కన్విక్షన్ రేట్) పెంచేందుకు పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, సకాలంలో ఛార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. అట్రాసిటీ నిరోధక చట్టాన్ని కచ్చితంగా అమలు చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలన్నారు. తహసీల్దార్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ఫిర్యాదులను అత్యంత సున్నితంగా, మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని సూచించారు. మూఢనమ్మకాల నిర్మూలనతో పాటు ఎస్సీ, ఎస్టీ హక్కులు, చట్టాలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, కులాంతర వివాహ ప్రోత్సాహకం, ఓవర్సీస్ విద్యా పథకం, స్కాలర్‌షిప్‌లు, ఎస్సీ, ఎస్టీ బాధితుల పరిహారం తదితర పథకాలకు సంబంధించిన పెండింగ్ నిధుల పూర్తి వివరాలను వెంటనే ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ కమీషనర్, కమీషన్‌కు పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరులో ముఖ్యమంత్రితో సమావేశంలో ఈ అంశాలను ప్రస్తావించి పెండింగ్ నిధుల విడుదలకు కృషి చేస్తామని తెలిపారు. పీఎం-అజయ్ పథకం, అసైన్డ్ భూములు, ఎల్‌పీఎస్ వంటి పథకాల కింద అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, ఎంపీడీవోల పర్యవేక్షణలో సమర్థంగా అమలు చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి నెల 'సివిల్ రైట్స్ డే' నిర్వహించి, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, తహసీల్దార్లు తప్పనిసరిగా హాజరై ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన చట్టాలు, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు, ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి పెండింగ్ అంశాలను సమీక్షించాలని సూచించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు సమర్థవంతంగా అమలయ్యేలా జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ ఔట్‌సోర్సింగ్ సొసైటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఉపాధి అవకాశాల్లో సామాజిక న్యాయం తప్పనిసరిగా ప్రతిబింబించాలన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అమలవుతున్న విధానాన్ని ఆదర్శంగా తీసుకుని మిగిలిన మూడు పట్టణ స్థానిక సంస్థల్లో కూడా రూ.30 లక్షల యూబీఐ బీమా సదుపాయాన్ని అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలని, అర్హులైన బాధితుల వివరాలను వెంటనే సేకరించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. పీఎం విశ్వకర్మ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన సాంప్రదాయ వృత్తిదారులను గుర్తించి శిక్షణ, ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రహరీ గోడలతో సహా అవసరమైన మౌలిక వసతుల నిర్మాణాన్ని సంతృప్తికర స్థాయిలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం పనితీరును అభినందించిన బక్కి వెంకటయ్య, కరీంనగర్ అధికారులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, విద్య, ఉపాధి, జీవనోపాధి అంశాల్లో మరింత చొరవతో పనిచేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ కమీషన్ సూచనల మేరకు అన్ని చర్యలు తీసుకుంటామని, పెండింగ్ నిధుల పూర్తి వివరాలను నిర్ణీత సమయంలో కమీషన్‌కు సమర్పిస్తామని తెలిపారు. గ్రామస్థాయిలో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని, ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు. జిల్లా, మండల స్థాయి అధికారులు ఎస్సీ, ఎస్టీల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. కమీషన్ సూచించిన మేరకు పెండింగ్ నిధులకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి నిర్ణీత సమయంలో కమీషన్‌కు సమర్పిస్తామని తెలిపారు. విద్య, ఉపాధి, సంక్షేమం, జీవనోపాధి, గురుకుల విద్యాసంస్థల బలోపేతం, ఎస్సీ, ఎస్టీ వర్గాల సమగ్ర అభివృద్ధికి జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు. ఇంకా ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్, ఆర్డీవోలు షర్మిల, జల కుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తిరుపతిరావు, ఎస్సీ డెవలప్మెంట్ డిప్యూటీ డైరెక్టర్ భాగ్యలక్ష్మి, డిస్టిక్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# దండు కదిలే... పటాన్చెరు గులాబీ దండు కదిలే..

**- పటాన్చెరు గడ్డపై గులాబీ జెండా హోరు... యువ సంగ్రామ సదస్సుకు కదిలిన పటాన్చెరు గులాబీ దండు..**

**-ఎమ్మెల్యే జిఎంఆర్ నాయకత్వంలో... 1200ల వాహనాల్లో తరలి వెళ్లిన గులాబీ శ్రేణులు..**

**- జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్..**

**- పల్లెలు, పట్టణాల నుండి కదం తొక్కిన నిరుద్యోగులు, బిఆర్ఎస్ కార్యకర్తలు... నిరుద్యోగుల గొంతు కోసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి..- యూత్ డిక్లరేషన్ పేరుతో యువత భవిష్యత్తుకు చరమగీతం పాడారు... 2028లో ఎగిరేది గులాబీ జెండాయే...- పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి..**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పటాన్చెరు, జూలై 18 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ యూత్ డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. నేడు జాబ్ క్యాలెండర్ విడుదల చేయమంటే ఎండ్రిన్ తాగి చావాలంటూ వ్యాఖ్యలు చేస్తోందని.. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడంతో పాటు.. 2028 ఎన్నికల్లో తిరిగి గులాబీ జెండా ఎగరం ఖాయమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్ సరూర్ నగర్ స్టేడియం వేదికగా ఏర్పాటు చేసిన యువ సంగ్రామ సదస్సుకు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృతంలో 1200 వాహనాల్లో గులాబీ శ్రేణులు బయలుదేరి వెళ్లాయి. శనివారం ఉదయం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన ర్యాలీని జిఎంఆర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పటాన్చెరు పురవీధుల గుండా ఓఆర్ఆర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని స్వయానా కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ 2023 లో సరూర్ నగర్ స్టేడియం వేదికగా యూత్ డిక్లరేషన్ ప్రకటించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటనను నమ్మి యువత, నిరుద్యోగులు ఓటు వేసి అధికారం అప్పగించి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న.. జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఓటు కొట్టు.. జాబ్ పట్టు అని ప్రగల్బాలు పలికిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. నేడు ఉద్యోగాలు ఏవని ప్రశ్నిస్తున్న నిరుద్యోగులను ఎండ్రిన్ తాగి చావాలంటూ వ్యాఖ్యలు చేయడం ప్రభుత్వ దురాహంకారానికి అర్థం పడుతుందని విమర్శించారు. జాబులు నింపడంలో విఫలమైనా రేవంత్ రెడ్డి. రాహుల్ గాంధీ కి సుట్ కేసులు పంపడంలో గోల్డ్ మెడల్ సాధిస్తున్నారని ఎద్దేవా చేశారు. అరచేతిలో స్వర్గం చూపించి అందలమెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి.. ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని.. 2028లో తిరిగి కెసిఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. యువత, విద్యార్థి, నిరుద్యోగులకు సువర్ణ యుగం రాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువత, విద్యార్థి, మహిళ, కార్మిక విభాగాల ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మెట్ట పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

**- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.**

**- శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా సాగు విధానాలు మార్చుకోవాలని సూచన**

**- రూ.4.61 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన.. సంక్షేమ చెక్కుల పంపిణీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఖమ్మం, జూలై 18 :ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, ఈ పరిస్థితుల్లో రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా మెట్ట పంటల సాగుపై దృష్టి సారించాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచించారు. శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. శనివారం పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలంలో పర్యటించిన మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని, ఇప్పటికే రైతు భరోసా అమలు చేస్తున్నామని తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టడం అవసరమని పేర్కొన్నారు. మండల పర్యటనలో భాగంగా రూ.4.61 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మల్లాయిగూడెంలో రూ.2.52 కోట్లతో బీటీ రోడ్డు, రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ భవనం నిర్మాణానికి భూమిపూజ చేయగా, కోక్యా తండాలో రూ.1.69 కోట్లతో బీటీ రోడ్డు, అగ్రహారంలో రూ.20 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన 66 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అలాగే వివిధ అనారోగ్యాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 111 మందికి రూ.35.16 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# సింగరేణి బొగ్గు నాణ్యతపై రాజీ లేదు

**- ఉత్పత్తి నుంచి డిస్పాచ్ వరకు ప్రత్యేక పర్యవేక్షణ**

**- ఏరియాల వారీగా స్పెషల్ అధికారుల నియామకం**

**- నాణ్యమైన బొగ్గు సరఫరాపై సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాలు**

(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)



హైదరాబాద్, జూలై 18 : సింగరేణి బొగ్గు నాణ్యతే సంస్థకు గుర్తింపని, ప్రకటించిన గ్రేడ్‌కు అనుగుణంగా నాణ్యమైన బొగ్గు సరఫరాలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తితో పాటు నాణ్యతను కాపాడేందుకు ఏరియాల వారీగా ప్రత్యేక అధికారులను నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. శనివారం స్థానిక సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో బొగ్గు ఉత్పత్తి, గ్రేడ్ పరిరక్షణ, నాణ్యత, డిస్పాచ్ అంశాలపై సమీక్ష నిర్వహించిన సీఎండీ, రానున్న మూడు నెలల పాటు ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన ఏరియాల్లో ఉత్పత్తి, నాణ్యత, గ్రేడ్ నియంత్రణ, డిస్పాచ్, ఉత్పాదకత, కార్పొరేట్-ఏరియా సమన్వయం, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల అమలును పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ మేరకు డైరెక్టర్ (ఆపరేషన్స్)కు సత్తుపల్లి, ఇల్లందు ఏరియాలు, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్)కు మణుగూరు, భూపాలపల్లి, డైరెక్టర్ (ఫైనాన్స్)కు బెల్లంపల్లి, మందమర్రి, డైరెక్టర్ (ఈ అండ్ ఎం)కు ఆర్జీ-1, ఆర్జీ-3, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్)కు ఆర్జీ--2, నైనీ, జనరల్ మేనేజర్ (మార్కెటింగ్)కు శ్రీరాంపూర్, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలను ప్రత్యేక అధికారులుగా నియమించారు. కొన్ని ఏరియాల్లో అన్‌గ్రేడెడ్ బొగ్గు, షేల్ కలవడం వల్ల నాణ్యత తగ్గుతోందని అధికారులు వివరించగా, ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సీఎండీ ఆదేశించారు. వార్షిక కోల్ గ్రేడేషన్ ప్రణాళిక ప్రకారం సీమ్‌ల వారీగా తవ్వకాలు నిర్వహించి, ప్రకటించిన గ్రేడ్‌కు అనుగుణంగానే బొగ్గు ఉత్పత్తి జరగాలని సూచించారు. ఓపెన్‌కాస్ట్ గనుల్లో బ్లాస్టింగ్‌కు ముందు బొగ్గు బెంచీలను పూర్తిగా శుభ్రం చేయాలని, రాయి, షేల్‌ను బొగ్గుతో కలపకుండా వేరుగా తవ్వి ఓవర్‌బర్డెన్‌లోనే డంప్ చేయాలని ఆదేశించారు. ఫైరీ కోల్ నిర్వహణ, గ్యాలరీల శుభ్రతకు రూపొందించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ)ను అన్ని ఏరియాల్లో కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. అన్ని ఓపెన్‌కాస్ట్ గనులు, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లలో క్రషర్లు సమర్థంగా పనిచేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రతి ప్లాంట్‌లో రోజువారీ గ్రేడ్‌వారీ డిస్పాచ్ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఉత్పత్తి నుంచి డిస్పాచ్ వరకు ప్రతి దశలో నాణ్యత నియంత్రణకు అధికారులు వ్యక్తిగత బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు.



# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధం

**- రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పిస్తున్నాం.**

**- భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూలై 18 : ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో అన్ని శాఖలతో సమన్వయంగా ముందస్తు కార్యాచరణ అమలు చేస్తున్నామని, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపు పద్ధతులపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఎలాంటి పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూపర్ ఎల్‌నినో పరిస్థితులు, వర్షాభావ నివారణ చర్యలు, వ్యవసాయ ప్రణాళికలు, తాగునీటి నిర్వహణ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో భద్రాద్రి జిల్లా ఐడీఓసీ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున జిల్లాల వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, విత్తనాలు, ఎరువులు, తాగునీరు, పశుగ్రాసం, ఉపాధి హామీ పనులపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఇన్‌చార్జి మంత్రుల సమీక్ష సమావేశాలకు శాఖల వారీ సమగ్ర నివేదికలతో హాజరు కావాలని అధికారులను ఆదేశించారు.



# అందెశ్రీ తెలంగాణ ఆత్మను ప్రపంచానికి చాటిన మహాకవి

**- ఆయన రచనల 20 వేల ప్రతులు ముద్రిస్తాం**

**-కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం: సీఎం రేవంత్ రెడ్డి**

**- ఘట్‌కేసర్‌లో ఘనంగా అందెశ్రీ స్మారక సభ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఘట్‌కేసర్, జూలై 18 : తెలంగాణ ఆత్మను తన కలంతో ప్రపంచానికి పరిచయం చేసిన మహాకవి అందెశ్రీ అని, ఆయన మరణం వ్యక్తిగతంగా తనను తీవ్రంగా కలచివేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావోద్వేగంగా పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసిన "జయ జయహే తెలంగాణ" గీతం చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌లో శనివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రజాకవి అందెశ్రీ స్మారక సభకు ముఖ్య అతిథిగా హాజరైన సీఎం, అందెశ్రీ కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేశారు. అలాగే అందెశ్రీ రచనల 20 వేల ప్రతులను ముద్రించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, తాపీ మేస్త్రీగా జీవితాన్ని ప్రారంభించిన అందెశ్రీ తన కలంతో తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థుల్లో ఉద్యమ చైతన్యాన్ని రగిలించిన కవి ఆయన అని పేర్కొన్నారు.




# ప్రభుత్వ పాఠశాలల నుంచే గొప్ప విజయాలు సాధ్యం

## - చేగుంటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుకు కృషి చేస్తా
## - రాష్ట్ర మంత్రి డా.జి.వివేక్ వెంకటస్వామి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జూలై 18 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పెద్ద లక్ష్యాలు నిర్దేశించుకుని క్రమశిక్షణతో కష్టపడితే దేశంలోనే అత్యున్నత స్థానాలను చేరుకోవచ్చని కార్మిక, ఉపాధి,శిక్షణ & ఫ్యాక్టరీలు) మరియు గనుల శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి అన్నారు. మెదక్ జిల్లా చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని విద్యార్థులకు ఉచిత స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పుడు బ్లాక్‌బోర్డు మాత్రమే కాదు, ప్రపంచాన్ని చూసే అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కష్టపడి చదివి ఐఐటీలు, మెడికల్,ఇంజినీరింగ్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధిస్తున్నారని చెప్పారు. చేగుంట పాఠశాల నుంచే ఇద్దరు విద్యార్థులు ఐఐటీలో ప్రవేశం పొందడం ఉపాధ్యాయుల నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యం ఉండాలని, డాక్టర్, ఐఏఎస్,ఇంజనీర్ లేదా ఇతర ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం కృషి చేయాలని సూచించారు. విజయవంతమైన వ్యక్తుల్లో కనిపించే ప్రధాన లక్షణం క్రమశిక్షణేనని,చదువుతో పాటు కష్టపడి పనిచేసే అలవాటు పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన తరగతి గదులు, మరుగుదొడ్లు,ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం,కార్పొరేట్ సామాజిక బాధ్యత (జుల) నిధులు,స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడం అభినందనీయమన్నారు. విద్యాభివృద్ధికి సేవలందిస్తున్న సంకల్ప్ సంస్థను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఇప్పటివరకు వేలాది మంది విద్యార్థులకు చదువుకునేందుకు సహాయం అందించడంతో పాటు, ఉన్నత విద్య కొనసాగించాలనుకునే విద్యార్థులకు అండగా నిలుస్తామని ప్రకటించడం గొప్ప సామాజిక బాధ్యతగా అభివర్ణించారు. తన తండ్రి వెంకటస్వామి స్ఫూర్తితోనే సమాజానికి తిరిగి ఇవ్వాలనే భావన అలవడిందని మంత్రి పేర్కొన్నారు. వ్యాపారంలో విజయం సాధించిన తర్వాత పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఫర్నిచర్,ఇతర మౌలిక వసతులు కల్పించడం ప్రారంభించానని చెప్పారు. సంపాదనలో కొంత భాగాన్ని సమాజానికి వెచ్చించడం దాతృత్వం కాదని,అది ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి కూడా నేటి కాలంలో అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. కృత్రిమ మేధ విస్తరిస్తున్న నేపథ్యంలో సంప్రదాయ ఉద్యోగాల్లో మార్పులు వస్తున్నాయని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా యువతకు ఆధునిక నైపుణ్య శిక్షణ అందిస్తోందన్నారు. జావీజావీ ద్వారా విదేశీ భాషా శిక్షణతో పాటు దేశీయ, అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులు చదువులో రాణించడమే కాకుండా తల్లిదండ్రులను గౌరవిస్తూ మంచి విలువలతో ఎదగాలని సూచించారు. చేగుంట ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి,డిగ్రీ కళాశాల మంజూరుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్,ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపాల్,నాబాకీవలిటం మేనేజింగ్ డైరెక్టర్,సంకల్ప్ సంస్థ ప్రతినిధులు,దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, చేగుంట సర్పంచ్, ఉపసర్పంచ్,మార్కెట్ కమిటీ చైర్మన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

## రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రంగారెడ్డి, జూలై 18 : రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలం ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను మంత్రి సందర్శించి పాఠశాలలోని విద్యా, క్రీడా, మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమై ప్లేగ్రౌండ్‌లో కాసేపు క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యార్థుల మధ్య ఉండటం ఎంతో ఆనందంగా ఉందని, ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ పాఠశాలను చూసి సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక విద్యా వాతావరణం, డిజిటల్ తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, విశాలమైన క్రీడా మైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడా సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. తమ చిన్నతనంలో ఇలాంటి సౌకర్యాలు లేకపోయినా కష్టపడి చదివి ఎదిగామని, ప్రస్తుతం విద్యార్థులకు లభిస్తున్న అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విజయం సాధించాలంటే కష్టపడి పనిచేయడం, క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం అవసరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను గౌరవించాలని, తల్లిదండ్రుల ఆశలు, త్యాగాలను గుర్తుంచుకోవాలని, ఓటమిని చూసి నిరాశ చెందకుండా నిరంతర సాధనతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో ఏర్పడే స్నేహాలు జీవితాంతం నిలుస్తాయని, పరస్పర గౌరవం, సహకారం, ముఖ్యంగా బాలికలను గౌరవించే సంస్కారాన్ని అలవర్చుకోవాలని అన్నారు. విజయం అనేది ఒక్కరోజులో రాదని, ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత కూడా వినయాన్ని కోల్పోకుండా నిరాడంబరంగా ఉండటమే నిజమైన గొప్పతనమని పేర్కొన్నారు. ఈ పాఠశాల నుంచి భవిష్యత్తులో వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, క్రీడాకారులు, పరిపాలనా అధికారులు తయారై రాష్ట్రానికి, దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని బలోపేతం చేస్తూ డైట్ ఛార్జీల పెంపు, విద్యార్థులకు పోషకాహారాన్ని అందించడం వంటి చర్యలు చేపట్టిందన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం ద్వారా ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో నాణ్యమైన విద్యను అందించేలా ఆధునిక మౌలిక వసతులతో కూడిన పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కృతజ్ఞతాభావంతో చదువుకోవాలని సూచించారు. విజయం అంటే కేవలం పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం మాత్రమే కాదని, ఎంచుకున్న ప్రతి రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో శ్రమించాలని చెప్పారు. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నిరంతర కృషితో ప్రతి విద్యార్థి రాష్ట్రానికి, దేశానికి గర్వకారణం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నవీన్ కుమార్ రెడ్డి, మంచాల్ తహశీల్దార్, ఆరుట్ల సర్పంచ్ శోభారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దొంగిలించిన మొబైల్ ఫోన్ల కొనుగోలు, విక్రయాలపై కఠిన చర్యలు

## - సెకండ్‌హ్యాండ్ మొబైల్ కొనుగోలు సమయంలో ఆధార్‌తో పాటు పూర్తి వివరాలు నమోదు చేయాలి
## - మొబైల్ దొంగల సమాచారమిస్తే ప్రశంసాపత్రంతో సత్కారం.
## - జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, జూలై 18 : మొబైల్ షాప్ యజమానులు సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొనుగోలు లేదా ఎక్స్చేంజ్ చేసే సమయంలో విక్రయించే వ్యక్తి యొక్క ఆధార్ కార్డుతో పాటుగా పూర్తి వివరాలు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే మొబైల్ షాప్ యజమానులకు సూచించారు. ఈ సందర్భంగా శనివారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పరిధిలోని పలు మొబైల్ షాప్స్ మరియు రిపేర్ షాప్స్ యజమానులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలో వివిధ సందర్భాల్లో దొంగలించబడిన లేదా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్ అమ్మడానికి లేదా ఎక్స్చేంజ్ చేయడానికి వచ్చిన వారి పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తు వారి యొక్క ఆధార్ కార్డ్ తో పాటుగా పూర్తి వివరాలు సేకరించాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా లేదా దొంగిలించిన మొబైల్ ఫోన్ల విక్రయానికి ప్రయత్నిస్తున్నట్లు అనుమానం వచ్చినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. మొబైల్ ఫోన్ దొంగలను పట్టించడంలో లేదా వారి ఆచూకీ పోలీసులకు అందించడంలో సహకరించిన మొబైల్ షాప్ యజమానులకు జిల్లా పోలీసుల తరఫున ప్రశంసాపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్ కొనుగోలు చేసే సమయంలో సంబంధిత మొబైల్ షాప్ యజమాని నుంచి తప్పనిసరిగా బిల్లు లేదా రసీదు తీసుకోవాలని, తక్కువ ధరకు లభిస్తుందనే ఆశతో దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను తెలియక కొనుగోలు చేసి అమాయక ప్రజలు చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దొంగిలించబడిన మొబైల్ ఫోన్ అని తెలిసి కూడా కొనుగోలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొబైల్ ఫోన్ విక్రయించాలనుకునే వారు సంబంధిత కంపెనీల స్టోర్ లలో ఎక్స్చేంజ్ లేదా చట్టబద్ధమైన విక్రయ కేంద్రాల ద్వారానే విక్రయించాలని, తెలియని వ్యక్తులకు లేదా అనధికారికంగా కొనుగోలు చేసే షాపులకు విక్రయించవద్దని సూచించారు. ఇటువంటి దొంగిలించబడిన మొబైల్ ఫోన్లు సైబర్ నేరాలకు వినియోగించే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ తెలిపారు. అందరి సహకారంతోనే మొబైల్ ఫోన్స్ రికవరీలో దక్షిణ భారతదేశంలో మొదటి స్థానం,రాష్ట్రంలో వరుసగా మూడవ సంవత్సరం మొదట స్థానంలో నిలవడం జరిగిందని,అందరి సహకారంతోనే నేరాల నియంత్రించవచ్చని తెలిపారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే జులు× పోర్టల్ ( ప్రైజాం://ఒ.ఎ,ఎఎఆ.స్తఁఱ.ఙఅ ) నందు బ్లాక్ చేసి, సంబంధిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటి కోర్ ఎస్.ఐ కిరణ్ కుమార్, కానిస్టేబుల్ రాజాతిరుమలేష్, మొబైల్ షాప్స్ యజమానులు పాల్గొన్నారు.

# కోర్టు డ్యూటీ అధికారులు పనితీరును మెరుగు పర్చుకోవాలి

## - శిక్షల శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి
## - పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటీ (గోదావరిఖని), జూలై 18 : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కోర్టు డ్యూటీ,కోర్టు లైజనింగ్ పోలీసు అధికారులతో శనివారం సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు విధుల నిర్వహణ, కేసుల పురోగతి,శిక్షల శాతం పెంపు, సాంకేతిక సమస్యలు, సాక్షుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ,కోర్టు విధులకు సంబంధించిన ప్రతి పనిని నిర్దేశిత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. విధుల నిర్వహణలో ఎదురయ్యే పరిపాలనా లేదా సాంకేతిక సమస్యలను దాచిపెట్టకుండా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. కోర్టు డ్యూటీ అధికారుల పనితీరును నిరంతరం సమీక్షిస్తున్నామని, ప్రతి అధికారి తన పనితీరును మరింత మెరుగుపర్చుకుని దిశగా కృషి చేయాలని సూచించారు. సమన్లు,బెయిలు మంజూరు కాని అరెస్టు వారెంట్లు (ఎన్‌బీడబ్ల్యూలు), ఇతర వారెంట్ల అమలు,కోర్టుకు సంబంధించిన అన్ని ప్రక్రియలను వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సాక్షులను కోర్టుకు సకాలంలో హాజరుపరిచే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సాక్షులకు కోర్టు ప్రక్రియపై ముందస్తు అవగాహన కల్పించి, వారు ధైర్యంగా, స్పష్టంగా వాంగ్మూలం ఇచ్చేలా అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. విచారణ సమయంలో అనవసర గందరగోళానికి గురికాకుండా వారికి ధైర్యం చెప్పి,న్యాయ ప్రక్రియపై సరైన అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి కేసులో శిక్షలు పడేలా దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, సమయపాలన, నాణ్యమైన దర్యాప్తు, సమర్థవంతమైన కోర్టు నిర్వహణ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలని సీపీ పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులను ప్రతి నెల గుర్తించి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. విధి నిర్వహణలో విశేష కృషి చేసి అనంతరం బదిలీపై వెళ్లిన అధికారుల దర్యాప్తు చేసిన కేసుల్లో తర్వాత శిక్షలు విధించబడినా, సంబంధిత అధికారుల సిఫారసు మేరకు వారికి కూడా గుర్తింపు,ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో శిక్షల శాతాన్ని పెంచడం, ప్రతి కేసును సకాలంలో పూర్తి చేయడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్న పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు సమర్థవంతమైన న్యాయ సేవలు అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పలు కేసుల్లో నిందితులకు శిక్షలు పడడంలో కీలక పాత్ర పోషించిన కోర్టు డ్యూటీ సిబ్బందిని పోలీస్ కమిషనర్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) కె.శ్రీనివాస్, సీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్లు అనిల్ కుమార్, బాబురావు, ఎస్‌బి వినీత, కోర్టు డ్యూటీ సిబ్బంది,కోర్టు లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.



# తెలంగాణలో 'ఓటు చోర్'కు తావివ్వొద్దు

## - ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్య బలోపేతం: మంత్రి జూపల్లి
## - సర్ ప్రక్రియలో బీఎల్ఏలు, బీఎల్‌వోలు సమన్వయంతో పనిచేయాలి :: శివసేనరెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి , జూలై 18 : రాష్ట్రంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియలో ప్రతి అర్హుడికి ఓటు నమోదు కావాలని, ఇతర రాష్ట్రాల్లో జరిగినట్లుగా ఓటర్ల హక్కులకు భంగం కలిగే పరిస్థితులు తెలంగాణలో తలెత్తకూడదని రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడు దాని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల, పానుగల్, చిన్నంబావి మండల కేంద్రాల్లో శనివారం నిర్వహించిన సర్ ప్రక్రియ సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలపై వివాదాలు నెలకొన్నాయని, అటువంటి పరిస్థితులు తెలంగాణలో చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం ప్రజాస్వామ్య పరిరక్షణకు కీలకమని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి సిద్దేశ్వర్ మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తి ఓటరుగా నమోదు కావాలని, ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. బీఎల్ఏలు, బీఎల్‌వోలు గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి ఎన్యూమరేషన్ ఫారాల పూర్తి ప్రక్రియలో సహకరించాలని సూచించారు. వనపర్తి డీసీసీ అధ్యక్షుడు శివసేనరెడ్డి మాట్లాడుతూ.. బీఎల్‌వోలు, బీఎల్ఏ-2లు సమన్వయంతో పనిచేస్తూ సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. గ్రామాల వారీగా డిజిటలైజేషన్ పురోగతిని సమీక్షించిన ఆయన, గడువు తక్కువగా ఉన్నందున పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. 80 నుంచి 90 శాతం వరకు డిజిటలైజేషన్ పూర్తి చేసిన బీఎల్‌వోలు, బీఎల్ఏలను ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో ఎమ్మార్వోలు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు, బీఎల్ఏ-2లు, సర్పంచులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, కాంగ్రెస్ నాయకులు తిరుపతయ్య, సాయిచరణ్‌రెడ్డి, బ్రహ్మచారి, పాండు సాగర్ తదితరులు పాల్గొన్నారు.



# 20 యేళ్ల అనుబంధానికి సంబరాలు

## - ఎస్ అండ్ పీసీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, జూలై 18 : సింగరేణి సెక్యూరిటీ విభాగంలోని ఎస్ అండ్ పీసీ-2006 బ్యాచ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ములుగు జిల్లా మేడారంలోని శ్రీ సమ్మక్క-సారలమ్మ పుణ్యక్షేత్రంలో శుక్రవారం ఘనంగా జరిగినట్లు సింగరేణి ఆర్జీ-2 ఓసీపీ సీనియర్ సెక్యూరిటీ గార్డ్ ఎం.డి.మహబూబ్ అలీ తెలిపారు. సింగరేణి సెక్యూరిటీ విభాగాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో అప్పటి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రిటైర్డ్ కల్నల్ జాఫర్ నసీం ఆధ్వర్యంలో 2006లో వివిధ డివిజన్ల నుంచి 129 మందిని ఎంపిక చేసి, కొత్తగూడెంలోని ఎస్ అండ్ పీసీ శిక్షణ కేంద్రంలో నాలుగు నెలల పాటు పీటీ, పరేడ్, ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్, ట్రాఫిక్ కంట్రోల్, ఆన్‌ఆర్మ్స్, ఇంటెలిజెన్స్, పెట్రోలింగ్, సెక్యూరిటీ సిస్టమ్స్, విధి నిర్వహణ, దొంగతనాల నివారణ తదితర అంశాలపై సమగ్ర శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం వారిని సంస్థలోని వివిధ డివిజన్లలో నియమించినట్లు తెలిపారు. కాగా 20 ఏళ్ల సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ సమ్మేళనంలో వివిధ డివిజన్లకు చెందిన 96 మంది ఉద్యోగులు పాల్గొని శిక్షణ రోజుల అనుభవాలను గుర్తు చేసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ అందించిన నాగేశ్వరరావు, నాగేంద్రబాబు, పోగుల స్వామి, నారాయణమూర్తిని శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేసి కృతజ్ఞతలు తెలిపామని పేర్కొన్నారు. అనంతరం ఆట పాటలు, నృత్యాలతో ఆనందంగా గడిపామని, భవిష్యత్తులోనూ ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు మహబూబ్ అలీ తెలిపారు.

# మెదక్ అగ్నిమాపక శాఖలో పనిచేస్తున్న స్వీపర్, కంప్యూటర్ ఆపరేటర్లకు రెండు సంవత్సరాలుగా జీతాల్లేవ్...!

## - ఉపాధి లేక రోడ్డున పడిన ఔట్సోర్సింగ్ ఉద్యోగులు...!?

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




మెదక్, జూలై 18 : మెదక్ జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక శాఖలో ఔట్సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న స్వీపర్,కంప్యూటర్ ఆపరేటర్లకు గత రెండు సంవత్సరాల నుండి జీతాలు లేక పస్తులుండాల్సిన పరిస్థితి దాపురించింది. గత ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు కంటిన్యూషన్ ఆర్డర్ రాలేదు. రెండు సంవత్సరాల నుండి మేము ఖాళీగా ఉంటూ కూలీ నాలి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నట్లు వారు స్థానిక విలేకరులతో వెల్లడించారు. మేము విధులు నిర్వహించలేక, జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటివరకు పని చేసిన జీతాలు ఇవ్వలేదని,ఇది ఏంటి సార్ అని అడిగగా జిల్లా డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్ కు ఆర్థిక శాఖ నుంచి కంటిన్యూస్ ఆర్డర్ రాలేదని అని బదులు ఇచ్చినారని వెల్లడించారు. మేము పని చేసిన కొన్ని నెలల జీతాలు కూడా రాలేదని,మూడు బిల్లులు చేసుకోకపోతే ఎలాంటి జీవో రాలేదని చెప్తున్నారు. ఇప్పటికైనా మా చిన్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కంటిన్యూస్ ఆర్డర్ ఇవ్వవలసిందిగా కోరుకుంటు న్నామన్నారు. మేము నిరుపేద కుటుంబానికి చెందిన వాళ్ళమని ఇప్పటికైనా కంటిన్యూషన్ ఆర్డర్స్ ఇస్తే మేము విధుల్లోకి చేరి విధులు నిర్వహిస్తామని అని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే తమ బాధను పట్టించుకుని తమ సమస్యను పరిష్కరించాలని వారు వేడుకున్నారు.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలి

## - బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూక్యా జవహర్ లాల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు (వెంకటాపూర్) జూలై 18 : భారత ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ-2026 ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భుక్య జవహర్ లాల్ పిలుపునిచ్చారు. వెంకటాపూర్ మండలంలోని నల్లగుంట గ్రామపంచాయతీలో శనివారం కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో ఇంటింటా తిరిగి ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించి, వాటిని స్థానిక బీఎల్ఓ నాగేశ్వర్ సహకారంతో డిజిటలైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా భూక్యా జవహర్ లాల్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఎన్నికల అధికారులు బూత్ లెవల్ ఏజెంట్లు,పార్టీ ప్రతినిధులు ముందుకు సాగాలన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను ప్రతి అర్హుడు కి అందజేసి వాటిని సక్రమంగా నింపేలా అవగాహన కల్పించాలని,బిజెపి బూత్ లెవెల్ ఏజెంట్లకు సూచించారు. గ్రామంలోని ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా తమ ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తి వివరాలతో నింపి,ఎన్నికల సంఘం నిర్దేశించిన ఆగస్టు 3వ తేదీ లోపు సంబంధిత బీఎల్ఓ కు సమర్పించాలని సూచించారు.

ప్రజాలక్ష్యం
సంపాదకీయం

# కాళేశ్వరం...ఆత్మరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం !

దొంగలుపడ్డ ఆరు నెలలకు ...అన్న చందంగా ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్న తరుణంలో ఇప్పుడు ధరణిపై విచారణకు ఒక కమిటీని వేయాలని రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయం నవ్వులు తెప్పించేదిగా ఉంది. కెసిఆర్, బిఆర్ఎస్ అవినీతిపై పెద్దపెద్ద మాటలు మాట్లాడి అధికారం లోకి వచ్చిన రేవంత్ ఇప్పటి వరకు పైసా అవినీతిని నిరూ పించ లేకపోయారు. కాళేశ్వరం, ధరణి, ఈ కార్ రేస్, పవర్ ప్లాంట్లు, విద్యుత్ ఒప్పందాలు తదితర అంశాలన్నీ ఇప్పుడు ప్రచార వస్తువుగా మారాయి. కేవలం బిఆర్ఎస్‌పై రాజకీయంగా పైచేయి సాధించేందుకు మాత్రమే విమర్శలు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా కాళేశ్వరం కూలేశ్వరం అంటూ చేసిన ఆరోపణల్లో ఇంచు కూడా ముందుకు కదలలేదు. లక్షకోట్లు పెట్టిన ప్రాజెక్ట్ పడావు పడ్డది. దానిని ఎలాగైనా వినియోగంలోకి తేవడం ద్వారా ప్రజాధనాన్ని కాపాడాలన్న ముందుచూపు లేకుండా పోయింది. ఎంతసేపు రాజకీయంగా విమర్శలు తప్ప ఈ ప్రభుత్వం గత బిఆర్ఎస్ చేసిన అవినీతిపై ఎలాంటి పురోగతి సాధించలేదు. రేవంత్ రెడ్డి దీనిని కేవలం రాజకీయంగా ఉపయోగించు కుని బిఆర్ ఎస్‌ను భ్రష్టు పట్టించే యోచనలో ఉన్నారా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఎందుకంటే కాళేశ్వరాన్ని పక్కన పెట్టి ఇప్పుడు మళ్లీ ప్రాణహిత అంటూ పల్లవి అందుకున్నారు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం, వినిగంలోకి ఎలా తేవడం అన్న ఆలోచన పక్కన పెట్టారు. అందుకే నిత్యం కాళేశ్వరం ప్రాజెక్టు వివాదం కొనసాగుతూనే ఉంది. రాజకీయ విమర్శలకు కాళేశ్వరం వేదికగా మారుతోంది. పరస్పర విమర్శలు తప్ప గోదావరి జలాలను ఎలా ఉపయోగించు కోవాలన్నది ఆలోచించడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల వ్యవహారం కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య సవా ళ్లు, ప్రతిసవాళ్లు, పరస్పర ప్రజెంటేషన్లకు కేంద్రంగా మారిం ది. ఎల్‌నినో ప్రభావంతో వానలు వెనక్కి పోయాయి. మరో వైపు కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు తరలింపు అసాధ్య మని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసినప్పటికీ మెడిగడ్డ వద్ద కొన్ని పిల్లర్లు కుంగడంతో ఇక అది పనికిరాన్న రీతిలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మోటర్లు, కాలువలు అంతా వృథా అవుతున్నాయి. ఇదే విషయాన్ని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ప్రస్తావిస్తూ.. ఆయనను బిఆర్ఎస్ ఏజెంట్గా అభి వర్ణించి విమర్శలతో దాడి చేశారు. నిజానికి గత 2023 శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓటమిలో కాళేశ్వరం, ధరణి అక్రమాలు ప్రధాన భూమిక పోషించాయి. అధికారంలోకి రావడానికి అనేకానేక హామీలు, వాగ్దానాలు గుప్పించిన రేవంత్ సర్కార్ ఇప్పుడు గుడ్డెద్దు చేలో పడ్డదన్నట్లుగా సాగుతు న్నారు. పదికాలాలపాటు పనికి వచ్చే పనులు చేయడం లేదు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎలాంటి విధానం అనుసరించాలన్న దానిమీద సరైన అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారు. కాళేశ్వరం పిల్లర్లను పునరుద్దరించే ప్రయ త్నాలు చేసి, నీటిని వినియోగంలోకి తీసుకుని వచ్చివుంటే, ఈపాటికి మంచి ఫలితాలు వచ్చేవి. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేది. కానీ కాళేశ్వరం ప్రాజెక్టును ఉపయోగించరాదన్న మొండి వైఖరితో రేవంత్ ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఆ ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో ఉందని నేషనల్ డామ్ సేఫ్టీ అథారిటీ చెప్పిందని, అందువల్ల అక్కడ నీటిని వినియోగంలోకి తీసుకుని రావడం అసాధ్యమని చెబుతున్నారు. కాళేశ్వరం ఎటిఎం గా మారిందని గతంలో బిజెపి కూడా ఆరోపించింది. రేవంత్ రెడ్డి కూడా ఇదే ప్రచారం చేశారు. పోనీ అలాగని ఇందులో జరిగిన అవినీతిని వెలికితీసి కెసిఆర్ తదితరులను దోషులుగా నిలబెట్టి ఉంటే రేవంత్ ఇమేజ్ పెరిగేది. కానీ ఆరోపణలతోనే రెండున్నరేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. కాళేశ్వరం కమిషన్ ను కూడా ఏర్పాటు చేశారు. జస్టిస్ పిసి ఘోష్ కమిటీ రిపోర్టుపై హైకోర్టు స్టే విధించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీష్ రావులను అరెస్టు చేస్తామేమో అన్నంతగా ప్రచారం జరిగింది. అంతా తుస్సు మంది. ఇప్పుడు కమిషన్ రిపోర్టులు కూడా పెద్ద విలువ లేకుండా పోయిందా అన్న అనుమానాలు వస్తున్నాయి. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద నీరు నిల్వచేసి పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని తోడి ఆయా ప్రాంతాలలో ఉన్న రిజర్వాయర్లను నింపాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఇందుకు రేవంత్ ససేమిరా అనడంతో చంద్రబాబు కోసం గోదావరి జలాలను కిందికి జారవిడుస్తున్నారని బిఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఒక వైపు వర్షాభావ పరిస్థితులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల వర్షాలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు నీరు ఎలా ఇవ్వవచ్చు అన్నదానిపై ఆలోచన చేసి ఉండాల్సింది. కేసీఆర్ కట్టించినంత మాత్రాన ఆ ప్రాజెక్టు కెసిఆర్‌ది అయిపోదు. ఇదంతా ఒక ఎత్తుఅయితే ఇప్పుడు రాజకీయంగా రేవంత్‌ను ఏకిపారేయడంలో బిఆర్ఎస్ మెల్లగా పైచేయి సాధిస్తోంది. మంత్రులు అవినీతిలో కూరుకు పోయారని కెటిఆర్, హరీష్ రావులు రోజూ విమర్శలు చేస్తున్నారు. కమిషన్లు లేనిదే మంత్రులు కాలు బయటపెట్టడం లేదని అంటున్నారు. ఈ ఎదురుదాడితో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఓ రకంగా ఆత్మరక్షణలో పడిపోయింది. సింగరేణి తదితర విషయాల్లో గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లు అయ్యింది. ఈ క్రమం లోనే వాదోపవాదాలు, విమర్శ, ప్రతి విమర్శలతో రాజకీయ వేడెక్కింది. అవినీతి అంటూ ఆరోపించిన రేవంత్ నిరూపించ లేదు. దీనికి బదులుగా కేటీఆర్, హరీష్‌రావులే గట్టిగా బదులు ఇస్తున్నారు. దీనివల్ల కూడా రేవంత్ అసహనానికి గురి అవుతున్నారనిపిస్తోంది. ఒక వేళ నిజంగానే గోదావరి నీటిని లిఫ్ట్ చేయడంలో ఇబ్బంది ఉంటే, ఎన్‌డిఎస్‌ఎ నివేదికపై అభిలపక్షం నిర్వహించి చర్చ చేయాలి. బారేజీల వద్దకు, పంప్ హౌస్‌ల వద్దకు రిటైర్డ్ ఇంజనీర్లను తీసుకువెళ్లి ఇరిగేషన్ అధికారుల ద్వారా పరిస్థితిని వివరించాలి. కానీ ఇవేవీ చేయకపోవడంతో ఇప్పుడు కాళేశ్వరమే బిఆర్ఎస్‌కు ఆక్సిజన్ నింపుతోంది.

# ఆరు నెలల పోరాటం... ఐదేళ్ల రాజకీయాలను తారుమారు చేసింది!

**- మంత్రి కోటను కూల్చిన మేఘారెడ్డి వ్యూహం - "అసాధ్యం అనుకున్నది... ప్రజలే సాధ్యం చేశారు!"**

(సాంరామ్ - ప్రజాలక్ష్యం ప్రతినిధి)




వనపర్తి రాజకీయ చరిత్రలో 2023 అసెంబ్లీ ఎన్నికలు ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోయాయి. అధికారంలో ఉన్న బలమైన రాజకీయ వ్యవస్థను ఎదుర్కొని, రాష్ట్ర మంత్రిగా కొనసాగుతున్న నాయకుడిపై విజయం సాధించడం సాధారణ విషయం కాదు. కానీ ప్రజల విశ్వాసాన్ని పెట్టుబడిగా చేసుకుని, కేవలం ఆరు నెలల వ్యవధిలో రాజకీయ సమీకరణాలను మార్చిన నాయకుడిగా తూడి మేఘారెడ్డి పేరు చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత మేఘారెడ్డి రాజకీయ భవిష్యత్తుపై అనేక ఊహాగానాలు వినిపించాయి. అధికార పార్టీని వీడిన నాయకుడికి ముందున్న మార్గం సులభం కాదని రాజకీయ వర్గాలు భావించాయి. అయితే ఆయన మాత్రం ప్రజలే తన బలం అనే నమ్మకంతో ముందుకు సాగారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత గ్రామం గ్రామం తిరుగుతూ ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు పెంచుకున్నారు. రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, కార్మికులు, మేధావులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో ప్రజల అభిప్రాయాలు వింటూ, స్థానిక సమస్యలను ప్రధాన అంశాలుగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. రాజకీయ సభల కంటే ప్రజల మధ్య గడిపిన సమయానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ఆ సమయంలో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అత్యంత బలమైన స్థితిలో ఉండగా, వనపర్తిలో అప్పటి వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న నాయకుడు అధికార కేంద్రానికి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. అలాంటి పరిస్థితుల్లో ఆయనను ఎదుర్కోవడం అంటే రాజకీయంగా సాహసమేనని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. చాలా మంది పోటీని ఏకపక్షంగా భావించినా, ప్రజల తీర్పు మాత్రం భిన్నంగా నిలిచింది.

'సేవ్ వనపర్తి - చేంజ్ వనపర్తి' అనే నినాదంతో మేఘారెడ్డి ప్రజల్లోకి వెళ్లారు. అది కేవలం ఎన్నికల నినాదంగా కాకుండా, మార్పు కోరుకున్న ప్రజల భావోద్వేగంగా మారింది. గ్రామీణ సమస్యలు, అభివృద్ధి అంశాలు, ప్రజల అవసరాలను ప్రధాన ఎజెండాగా తీసుకొని సాగిన ప్రచారం ఆయనకు విస్తృత మద్దతును తెచ్చిపెట్టింది. నవంబర్ 2023లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఊహించని తీర్పునిచ్చారు. అధికార పార్టీకి చెందిన కీలక మంత్రిని ఓడించి మేఘారెడ్డిని అసెంబ్లీకి పంపారు. ఈ విజయం కేవలం ఒక అభ్యర్థి గెలుపు మాత్రమే కాదు... ప్రజల విశ్వాసం, మార్పుపై ఉన్న ఆకాంక్షకు ప్రతీకగా నిలిచింది. మేఘారెడ్డి రాజకీయ ప్రస్థానం కూడా గ్రామీణ స్థాయి నుంచి ఎదిగిన నాయకత్వానికి నిదర్శనం. సర్పంచ్‌గా ప్రారంభమైన ప్రయాణం ఎంపీటీసీ, ఎంపీపీ దశలను దాటి ఎమ్మెల్యే స్థాయికి చేరుకుంది. ప్రతి దశలో ప్రజలతో అనుబంధాన్ని కొనసాగించడం ఆయన ప్రత్యేకతగా చెబుతారు.

ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతులు, విద్య, వైద్యం, రైతు సంక్షేమం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ నియోజకవర్గ సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తున్నారు. రాజకీయాల్లో పదవులు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ ప్రజల గుండెల్లో చోటు సంపాదించిన నాయకులే చరిత్రలో నిలిచిపోతారు. వనపర్తిలో ఆరు నెలల రాజకీయ పోరాటంతో ఐదేళ్ల రాజకీయ సమీకరణాలను మార్చిన నాయకుడిగా తూడి మేఘారెడ్డి ప్రస్థానం అలాంటి అరుదైన అధ్యాయంగా నిలిచిందని ఆయన అనుచరులు, రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. "అధికారం ఇచ్చేది పార్టీ కావచ్చు... నాయకుడిని నిలబెట్టేది మాత్రం ప్రజలే. ఆ విశ్వాసమే మేఘారెడ్డి విజయానికి అసలైన పునాది."

# అసమానతలు ఉన్నంతకాలం కమ్యూనిస్టులకు అంతం లేదు

**- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శితక్కళ్లపల్లి శ్రీనివాసరావు**
**- ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులే**
**- భూపాలపల్లిలో సీపీఐ జిల్లా రాజకీయ శిక్షణా శిబిరం ప్రారంభం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, జూలై 18 : సమాజంలో అసమానతలు ఉన్నంతకాలం కమ్యూనిస్టు ఉద్యమానికి అంతం ఉండదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని, దేశంలో మతతత్వ శక్తుల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో వామపక్షాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భూపాలపల్లి మంజూరునగర్‌లోని ఇల్లందు క్లబ్‌లో శనివారం మోటపలుకుల రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సీపీఐ జిల్లా రాజకీయ శిక్షణా శిబిరాన్ని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పార్టీ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజల తిరుగుబాటును ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు, జీవో-58 ప్రకారం పేదలకు భూ పట్టాల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుపేదలు సొంత ఇల్లు లేక జీవిస్తున్నారని, ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టుల మద్దతు ఉన్నప్పుడే ప్రభుత్వాలు స్థిరంగా కొనసాగగలవని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, సీపీఐ జిల్లా నాయకులు పైళ్ల శాంతికుమార్, మామిడాల సమ్మిరెడ్డి, క్యాథరాజు సతీష్, పరమండ్ల రాజయ్య, కొరిమి సుగుణ, పెంట రవి, సోతుకు ప్రవీణ్‌కుమార్, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, కుదుదుల వెంకటేష్, తాళ్ల పోశం, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శులు జి. శ్రీనివాస్, ఆసిఫ్ పాషా, ఏఐటీయూసీ నాయకులు కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేటలో రూ.3.14 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

**- క్షేత్రస్థాయిలో ఎంపీ రఘురామి రెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పర్యటన.**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



అశ్వారావుపేట, జూలై 18 : ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామి రెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శనివారం దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో విస్తృతంగా పర్యటించి రూ.3 కోట్ల 14 లక్షల 50 వేల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. పర్యటనలో భాగంగా అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించిన వారు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. నారవారిగూడెం కాలనీ, అల్లిగూడెం, ఊట్లపల్లి, మల్లాయగూడెం, అనంతారం, గాండ్లగూడెం, జెట్టివారిగూడెం, కొత్తూరు, మామిళ్లవారిగూడెం, పాకలగూడెం, అసుపాక గ్రామాల్లో నూతన సీసీ రోడ్లను ప్రారంభించారు. గుమ్మడివల్లిలో మహిళా స్వయం సహాయక సంఘాల కోసం నిర్మించిన వీఓ భవనం, సీసీ రోడ్డును ప్రారంభించగా, అసుపాకలో బోర్‌వెల్, సీసీ రోడ్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అశ్వారావుపేటలో నిర్మాణంలో ఉన్న కొమరం భీమ్ ఇకోపార్క్ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. రమణక్కపేటలో సీసీ రోడ్లు, తోగ్గూడెంలో బోర్‌వెల్ నిర్మాణాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉంచవద్దని అధికారులను ఆదేశించిన వారు ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నశెట్టి సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు తుమ్మా రాంబాబు, కోల లక్ష్మినారాయణ, తహసీల్దార్, ఎంపీవో రామ కోటి రెడ్డి, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పాల్వంచలో నాటు బాంబుల తయారీ కలకలం..!?

**- హోల్‌సేల్ క్రాకర్స్ షాపులో పేలుడు పదార్థాల తయారీపై తీవ్ర ఆరోపణలు**
**- వ్యాపారానికే అనుమతి.. తయారీకి కాదు.**
**- పాల్వంచ పట్టణ ఎస్సై నాగరాజు.**
**- విచారణలో నిబంధనల ఉల్లంఘన తేలితే షాప్ సీజ్.. బాధ్యులపై కఠిన చర్యలు..**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పాల్వంచ, జూలై 18 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని శ్రీనివాస కాలనీలో ఉన్న శ్రీ వెంకటేశ్వర క్రాకర్స్ దుకాణంలో నాటు బాంబుల తయారీ జరుగుతోందన్న సమాచారం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. హోల్‌సేల్ బాణాసంచా విక్రయాలకు మాత్రమే అనుమతులు ఉన్న దుకాణంలో పేలుడు పదార్థాల తయారీ జరుగుతోందనే ఆరోపణలు రావడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. స్థానికుల కథనం ప్రకారం, తెలంగాణ రాష్ట్రంలో బాణాసంచా తయారీకి కఠిన నిబంధనలు అమలులో ఉండగా, కేవలం వ్యాపారానికి మాత్రమే అనుమతి పొందిన దుకాణంలో నాటు బాంబుల తయారీ జరుగుతోందని ప్రచారం జరుగుతోంది. దీనిపై సంబంధిత శాఖలు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దుకాణానికి సంబంధించిన అనుమతులు నిబంధనల ప్రకారమే మంజూరయ్యాయా..? పేలుడు పదార్థాల తయారీకి ప్రత్యేక లైసెన్సులు ఉన్నాయా..? భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా..? అనే అంశాలపై అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. అటవీ ప్రాంతానికి ఆనుకొని, జనావాసాల మధ్య ఇలాంటి కార్యకలాపాలు జరిగితే ఎలాంటి ప్రమాదం జరిగినా భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల ఈ వ్యవహారాన్ని అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి అన్ని సంబంధిత శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని వారు కోరుతున్నారు.

**వ్యాపారానికే అనుమతి... తయారీకి కాదు.**

ఈ అంశంపై పాల్వంచ పట్టణ ఎస్సై నాగరాజు స్పందిస్తూ, "శ్రీ వెంకటేశ్వర క్రాకర్స్‌కు కేవలం బాణాసంచా విక్రయాల నిర్వహణకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. అక్కడ ఎలాంటి క్రాకర్స్ తయారీకి లేదా పేలుడు పదార్థాల తయారీకి అనుమతులు లేవు. పోలీసులు ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతారు. తనిఖీల్లో నాటు మందుగుండు సామగ్రి లేదా నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాల తయారీ జరుగుతున్నట్లు తేలితే వెంటనే దుకాణాన్ని సీజ్ చేసి, నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేశారు.

**అధికారుల చర్యలపై సర్వత్రా ఆసక్తి**

పోలీసుల ప్రకటనతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చిన తర్వాత సంబంధిత శాఖలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయనే దానిపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులెవ్వరినీ ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అక్రమ అరెస్టులతో ప్రజా గొంతుకను అణిచివేయలేరు

**- కొమ్మిడి మహిపాల్ రెడ్డి**
**- ఘట్కేసర్ సమస్యలను దాచిపెట్టేందుకే ముందస్తు అరెస్టులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఘట్కేసర్, జూలై 18 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘట్కేసర్ పర్యటన సందర్భంగా ప్రజల సమస్యలను దాచిపెట్టేందుకే ప్రభుత్వం బీజేపీ నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా హౌస్ అరెస్టు చేసిందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ బీజేపీ అధ్యక్షుడు కొమ్మిడి మహిపాల్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆయన శనివారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును హరించడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని, అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను అణిచివేయడం సాధ్యం కాదని అన్నారు. ఘట్కేసర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మాణం 18 ఏళ్లుగా పూర్తికాకపోవడంతో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, ప్రతిరోజూ వేలాది మంది తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని పేర్కొన్నారు. వంతెన నిర్మాణం ఆలస్యంతో స్థానిక వ్యాపారులు నష్టపోతుండగా, భూములు కోల్పోయిన నిర్వాసితు లకు మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం అందడం లేదని విమర్శించారు. తూముకుంటలో గజానికి లక్ష రూపాయల వరకు నష్టపరిహారం చెల్లిస్తున్న ప్రభుత్వం, ఘట్కేసర్‌లో మాత్రం గజానికి రూ.10 వేలే నిర్ణయించడం వివక్షకు నిదర్శనమని మండిపడ్డారు. రైతు రుణమాఫీ పూర్తయిందని ప్రభుత్వం ప్రచా రం చేస్తున్నప్పటికీ, ఘట్కేసర్ మండలంలోని అనేక మంది అర్హు లైన రైతులకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు కాలేదని ఆరోపించారు. రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, అర్హులైన ప్రతి రైతుకు వెంటనే సంపూర్ణ రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను ప్రశ్నించే నాయకులను, కార్యకర్తలను అక్ర మంగా అరెస్టు చేసి భయపెట్టే ప్రయత్నాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్న మహిపాల్ రెడ్డి, ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే వరకు భారతీయ జనతా పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# సింగరేణి ఆధ్వర్యంలో ఈనెల 21న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, జూలై 18 : సింగరేణి భూపాల పల్లి ఏరియా ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఏరియా అధికార ప్రతినిధి విశ్రాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రముఖ ఆయుర్వేద నిపుణుడు డాక్టర్ విశ్వనాథ మహర్షి నేతృత్వంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక కృష్ణ కాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో శిబిరం నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో చర్మవ్యాధులు, మోకాళ్ల నొప్పులు, గుండె దడ, రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, మలబద్ధకం, అజీర్ణం, పక్షవాతం,ఆస్తమా,మహిళలకు సంబం ధించిన ఆరోగ్య సమస్యలకు ఉచితంగా వైద్య పరీక్షలు, సలహాలు అందజేయను న్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి సంబం ధించిన పూర్తి వివరాల కోసం డాక్టర్ విశ్వనాథ మహర్షిని 98495 74706 నంబర్‌లో సంప్రదించవచ్చని విశ్రాంత్ కుమార్ పేర్కొన్నారు.

# ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా పథకం కింద రూ.2 లక్షల చెక్కు పంపిణీ

**- బీమా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి- బ్రాంచ్ మేనేజర్ రాజిరెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాటారం, జూలై 18 : జయశంకర్-భూపాల పల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని కేడీసీసీబీ బ్యాంకు శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) పథకం కింద రూ.2 లక్షల బీమా చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. కాటారం గ్రామానికి చెందిన తోట సదానందం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, పథకం కింద మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును ఆయన భార్య తోట సరోజనకు బ్యాంకు అధికారులు అందిం చారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ వి. రాజిరెడ్డి మాట్లాడు తూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన వంటి సామాజిక భద్రతా పథకాలను ప్రతి బ్యాంకు ఖాతాదా రుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ఎస్ఐఆర్ విజయవంతానికి రాజకీయ పార్టీల సహకారం కీలకం

## రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ హరి చందన దాసరి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూలై 18 : ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ఎన్నికల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, శక్తి శాఖ కార్యదర్శి హరి చందన దాసరి అన్నారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ములుగు జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జితో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ , మహబూబాబాద్ జిల్లాలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ, ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, అధికారులు, స్వయం సహాయక మహిళా సంఘాలు, జిల్లా, మండల సమాఖ్యలు, పాఠశాలలు, కళాశాలల సహకారంతో స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియా, పత్రికా సమావేశాల ద్వారా కూడా విస్తృత ప్రచారం చేపడుతున్నామని, నిర్దేశించిన గడువులోగా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియపై అభిప్రాయాలు, సూచనలు, సందేహాలను తెలుసుకున్న అధికారులు, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం వాటిపై సమగ్ర వివరణ ఇచ్చి సందేహాలను నివృత్తి చేశారు. రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ హరి చందన దాసరి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంలో రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రజల్లో అపోహలు తొలగిస్తూ ఎన్నికల సంఘం నిబంధనలను విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లకు నిరంతరం శిక్షణ, మార్గదర్శకత్వం అందిస్తూ వారి పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. అలాగే అపార్ట్‌మెంట్ సముదాయాలు, గేటెడ్




కమ్యూనిటీలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు (ఆర్‌డబ్ల్యూఏలు), గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి అర్హుడైన ఓటరు ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగస్వామి అయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ పురోగతిని మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి బీఎల్‌వో ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, వాటిని తిరిగి సేకరించి సకాలంలో డిజిటలైజేషన్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, తమ నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 55.60 శాతం ఎస్ఐఆర్ ఫారాల డిజిటలైజేషన్ మాత్రమే పూర్తైందని తెలిపారు. మిగిలిన ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. కుడా చైర్మన్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనగాల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ, గ్రేటర్ పట్టణ ప్రాంతాల్లో సెలవు దినాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, వాటిని వెంటనే డిజిటలైజేషన్ చేసేలా చర్యలు తీసుకుంటే నిర్దేశిత లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చని అన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో బీఎల్ఏల ద్వారా ప్రజలకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పిస్తూ ఎన్నికల సంఘం చేపడుతున్న కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పలు అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటిపై వివరణలు పొందారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, రాజేశ్వరి, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నాం

## మేయర్ మహంకాళి స్వామి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్‌సిటీ (గోదావరిఖని), జూలై 18 : వర్షా కాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. శనివారం వివిధ డివిజన్ లలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు నాలా పూడిక తీత పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని గత నాలుగు నెలలుగా సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎక్కువగా ప్రభావం చూపే నాలాల్లో పూడిక తీత పనులు నిర్వహించడం జరిగిందని అన్నారు. అలాగే నాలాలో పెరిగిన పిచ్చి చెట్లు తొలగించడంతో నీళ్ళు ఎక్కడా నిలువకుండా సాఫీగా ప్రవహించి వరద ముప్పు ఉండదని అన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వరద ప్రభావం చూపే ప్రాంతాల్లో కాంక్రీట్ తో కాలువల నిర్మాణం చేపట్టారని అన్నారు. ఉష్ణోగ్రతలు తగ్గిన నేపథ్యంలో రోడ్ల నిర్మాణాలు కూడా ప్రారంభమయ్యాయని అన్నారు. అంటువ్యాధుల నివారణపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టామని అన్నారు. కాగా మేయర్ ఉదయం 38, 39 డివిజన్ లలో ప్రవహిస్తున్న పెద్ద నాలాలో జరుగుతున్న పూడిక తొలగింపు పనులను స్థానిక కార్పొరేటర్ నెలకంటి రాముతో కలిసిపర్యవేక్షించారు. అనంతరం 46 వ డివిజన్‌లో ట్రాన్స్ జెండర్‌లకు కేటాయించిన ఇంటి స్థలాల ప్రాంతాన్ని పరిశీలించి అత్యవసరంగా శుభ్రం చేసి చదును చేయించవల్సిం దిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆ తరువాత మేడిపల్లి, పికెరామయ్య కాలనీ లలో పర్యటించారు. నిర్మాణంలో ఉన్న రోడ్డు పనులనుపరిశీలించారు. ప్రతిపాదిత కాలు వల నిర్మాణ ప్రాంతాలను కూడా పరిశీలించారు. అనంతరం పిజి కళాశాలలో ఉప న్యాసకులు, విధ్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయశీ మూల నుండి ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి వైపు రోడ్డు వెడల్పు చేయడానికి గల అవకాశాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వెంట కార్పొరేటర్ దాసరి సాంబమూర్తి, డేవిడ్ రాజు నగరపాలక సంస్థ టిపిఓ నవీన్, ఎఇ తేజస్విని, నాయ కులు మడిపెల్లి మల్లేశం, గడ్డం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి



## వ్యవసాయ విస్తరణ అధికారి ఏఈఓ సౌమ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోరుట్ల, జూలై 18 : ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు పరిస్థితులకు అనుగుణంగా సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) సౌమ్య సూచించారు. సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, అధిక నీటి అవసరం ఉండే పంటల కంటే తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడంతో పాటు పంట నష్టాలను కూడా నివారించవచ్చని తెలిపారు. వర్షాలపై పూర్తిగా ఆధారపడే పరిస్థితుల్లో రైతులు వ్యవసాయ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని, నేల స్వభావానికి అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అలాగే వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వర్షపాతం పరిస్థితులకు అనుగుణంగా విత్తనాలు వేయాలని తెలిపారు. నాణ్యమైన విత్తనాలు, శాస్త్రీయ సాగు విధానాలు, సమతుల్య ఎరువుల వినియోగం, సకాలంలో కలుపు నివారణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్ మాట్లాడుతూ, రైతులు వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చే సలహాలను పాటించి పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని కోరారు. గ్రామంలోని ప్రతి రైతు నష్టపోకుండా ముందస్తు ప్రణాళికతో సాగు చేయాలని, అవసరమైన సహాయ సహకారాలను గ్రామ పంచాయతీ తరపున అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు మంతెన రాజేందర్, దండికం మోహన్, సురకంటి మోహన్ రెడ్డి, జగిడి గంగారెడ్డి, మ్యాకల గంగాధర్, జగిడి శంకర్, చంటి తదితర రైతులు పాల్గొని పంటల ఎంపిక, సాగు విధానాలపై అధికారులను ప్రశ్నించి పలు సూచనలు, సలహాలు పొందారు.



# తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే విద్యార్థుల ప్రగతి

## కలెక్టర్ కోయ శ్రీహర్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, జూలై 18 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రగతికి తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. పెద్దపల్లి మండలం తుర్కల మద్దికుంట ఎంపీపీఎస్ పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్-టీచర్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, జిల్లాలోని పాఠశాలలకు సంబంధించిన మౌలిక వసతుల పనులన్నింటినీ వచ్చే ఆరు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తుర్కల మద్దికుంట పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణం పూర్తయిందని చెప్పారు. ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా పేరెంట్-టీచర్ సమావేశాలకు హాజరై పిల్లల చదువు, ప్రగతిని తెలుసుకోవాలని, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడడంతో పాటు ఇంట్లో హోంవర్క్ పూర్తి చేసేలా పర్యవేక్షిం చాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జిల్లా యంత్రాంగం సమిష్టిగా పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల కంటే మెరుగైన ఫలితాలు సాధించగలరని కలెక్టర్ విశ్వాసం వ్యక్తం చేశారు. డీఈఓ శారద, జీసీడీఓ కవిత, సర్పంచ్ రాజయ్య, ఉపసర్పంచ్ తిరుపతి, ప్రధానోపాధ్యాయురాలు మంజులత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# 23వ వార్డులో ఇందిరమ్మ చీరల పంపిణీ

### - మహిళల ముఖాల్లో చిరునవ్వులు చూడడమే ప్రభుత్వ లక్ష్యం
### - వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జులై 18 : భువనగిరి మున్సిపల్ పరిధిలోని 23వ వార్డు ఇందిరానగర్ కాలనీలో శనివారం మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను ఘనంగా పంపిణీ చేశారు. వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత-జహంగీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం, సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. మహిళా సంఘాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అందులో భాగంగానే ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత-జహంగీర్ మాట్లాడుతూ తమ వార్డులో అర్హులైన ప్రతి మహిళా సంఘ సభ్యురాలికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. వార్డు ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించిన నాణ్యమైన, ఆకర్షణీయమైన రంగుల చీరలను అందుకున్న మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత-జహంగీర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్పీ సుదర్శనం మంజుల, వార్డు ఇంచార్జి అనిల్ నాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు, పురపాలక శాఖ అధికారులు, ఆర్పీలు, మహిళా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించేందుకు సమన్వయంతో పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సంగారెడ్డి, జూలై 18 : జిల్లాలో మహిళల్లో రొమ్ము క్యాన్సర్ కేసులను ప్రారంభ దశలోనే గుర్తించి, అనుమానితులను సకాలంలో వైద్య పరీక్షలు, చికిత్స కోసం రిఫర్ చేసే విధంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రాజు-రా శాఖ, యునో బ్రెస్ట్ ఫౌండేషన్, గ్రాన్యూల్స్ ఇండియా, సంస్థల సమన్వయంతో రొమ్ము క్యాన్సర్ గుర్తింపు, ముందస్తు నిర్ధారణ కార్యక్రమాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై విస్తృత అవగాహన కల్పించడం, గ్రామ స్థాయిలో స్క్రీనింగ్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం, అనుమానిత కేసులను వెంటనే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేసే వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స విజయవంతం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖతో పాటు సంబంధిత అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంత మహిళలకు రొమ్ము క్యాన్సర్ లక్షణాలు, ముందస్తు పరీక్షల అవసరంపై విస్తృత ప్రచారం నిర్వహించి, ఎక్కువ మంది మహిళలు స్క్రీనింగ్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్ శిబిరాల నిర్వహణలో ఎసఈఆర్‌పి శాఖ, యునో బ్రెస్ట్ ఫౌండేషన్, గ్రాన్యూల్స్ ఇండియాకు అధికారులు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స అందేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి , జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.లలితా దేవి , డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక ప్రాంతంలో మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలి

### - ఎంపీ గడ్డం వంశీకృష్ణకి వినతి పత్రం అందజేత
### - డివైఎఫ్ఐ జిల్లా నాయకులు సాగర్, సురేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




కోల్ సిటి (గోదావరిఖని), జూలై 18 : రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని శనివారం పెద్దపల్లి జిల్లా పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ కి డివైఎఫ్ఐ యువజన సంఘం జిల్లా కార్యదర్శి కొంటు సాగర్ జిల్లా నాయకులు మొగిలిచర్ల సురేష్, వీరసూర్య వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కొంటు సాగర్ మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఇంటర్ డిగ్రీ, మెడికల్ కళాశాలతో పాటు త్వరలో నర్సింగ్ కాలేజీ కూడాప్రారంభమవుతున్నా నేపథ్యంలో ఈ పారిశ్రామిక ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే ఇక్కడ ప్రధాన వనరులైన బొగ్గు నిక్షేపాలు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాల అందుబాటులోకి వస్తే ఇక్కడ మా ఎంతో మంది విద్యార్థులకు మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యను పూర్తి చేసి అనంతరం ఇదే ప్రాంతంలో ఎన్నో ఉ ద్యోగ అవకాశాలు కూడా వస్తాయని తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి మరింత ముందుకు వెళుతుందని వారు ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారన్నారు. అంతే కాకుండా చాలామంది విద్యార్థులు వారి ఆర్థిక ఇబ్బందుల వల్ల దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే స్తోమత లేక ప్రత్యామ్నాయ కోర్సులను తీసుకొని చదువుకుంటున్నారన్నారు. పారిశ్రామిక ప్రాంత పరిశ్రమలను దృష్టిలో ఉంచుకొని మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాలను అందుబాటులోకి తీసుకువస్తే ఎంతోమంది ఇక్కడి విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తును కల్పించిన వారు అవుతారని ఈ అంశం పైన వచ్చే పార్లమెంటు సమావేశంలో కూడా ప్రస్తావించాలని నాయకులు ఎంపీ కి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎంపీ కచ్చితంగా ఈ పారిశ్రామిక ప్రాంతంలో మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానని వారు హామీ ఇవ్వడం జరిగిందన్నారు.



# వేతనాల పెంపుకు సమ్మెకు సిద్ధం కావాలి

### - టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల రమేష్


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), జూలై 18 : ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్జీవన్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహిం చారు. ఈ సమావేశంలో ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల రమేష్ హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నేటికీ ఒక్క పైసా వేతనాన్ని కూడా సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు పెంచలేదన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో కూడా వేతనాలు పెంచి న దాఖలాలు లేవన్నారు. చాలీచాలని వేతనాలతో, ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలను పోషించుకోలేక సింగరేణి కాంట్రాక్టు కార్మికులంతా అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు . 2013 నుంచి రావలసిన హై పవర్ కమిటీ వేతనాలను సైతం సింగరేణి యాజమాన్యం అమలు చేయలేదన్నారు. 18 రోజుల సమ్మె సందర్భంగా చేసిన ఒప్పందాన్ని సైతం సింగరేణి యాజమాన్యం తుంగలో తొక్కింది. అధికారంలోకి వచ్చే నెల రోజుల్లో వేతనాలు పెంచుతామన్న కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ వేతనాల పెంపు ప్రస్తావనే లేదన్నారు. ప్రతి రాజకీయ నాయకుడు అధికార ప్రతిపక్ష నేతలు బాయి బాట పేరుతో సింగరేణి వ్యాప్తంగా పర్యటిస్తూ అనేక హామీల వర్షాలను కురిపిస్తున్నారని అన్నారు. కాగా సింగరేణిలో పనిచేస్తున్న 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల కోసం మాట కూడా మాట్లాడడం లేదన్నారు. ఈ దశలో పోరాటమే ఏకైక మార్గంగా సింగరేణిలో పనిచేస్తున్న అన్ని డివిజన్ల అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులంతా ఐక్యంగా సమ్మెకు సిద్ధం కావాలని వేతనాల పెంపు ఏకైక డిమాండ్తో సింగరేణి వ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు.

# యాదగిరిగుట్ట కొండపై తాత్కాలిక దుకాణాల రెన్యూవల్ వివరాలు వెల్లడించాలి

### - దేవస్థానం ఈవో కు యాదాద్రి పరిరక్షణ కమిటీ వినతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, జులై 18 : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో కొండపై ఉన్న పది తాత్కాలిక దుకాణాల లీజుల వ్యవహారంపై పారదర్శకత పాటించాలని కోరుతూ యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో దేవస్థానం ఈవోకు శనివారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో కమిటీ ప్రతినిధులు పేర్కొన్న వివరాల ప్రకారం, కొండపై వర్తక సంఘం పేరుతో కొనసాగుతున్న పది తాత్కాలిక దుకాణాల లీజు గడువు 2026 మే 31తో ముగిసిందని తెలిపారు. అనంతరం జూన్, జూలై నెలలకు లీజు కాలపరిమితిని పొడిగించిన నేపథ్యంలో, ఆ రెండు నెలలకు సంబంధించి వ్యాపారులు దేవస్థానానికి చెల్లించిన మొత్తాల వివరాలను వెల్లడించాలని కోరారు. అలాగే 2026 జూలై 9న అదే దుకాణాలను మరో మూడు సంవత్సరాల పాటు షరతులతో కూడిన రెన్యువల్ చేస్తూ, అద్దెను 100 శాతం పెంచి జారీ చేసిన ఉత్తర్వుల ప్రతిని అందించాలని విజ్ఞప్తి చేశారు. ముందస్తుగా అద్దె చెల్లించి ఉంటే, అందుకు సంబంధించిన రసీదుల ప్రతులను కూడా ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, ఈ దుకాణాలను ఓపెన్ టెండర్ విధానంలో కేటాయిస్తే దేవస్థానానికి సంవత్సరానికి రూ. 20 నుంచి రూ. 30 కోట్ల వరకు అదనపు ఆదాయం వచ్చే అవకాశముందని, అదే సమయంలో కొత్త వ్యాపారవేత్తలకు అవకాశాలు కల్పించే వీలుంటుందని అభిప్రాయపడ్డారు. ఈ అంశాలపై దేవస్థానం అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు ఈవోను కోరారు.



# సరూర్‌నగర్ యువ సంగ్రామ సదస్సుకు ఆల్విన్ కాలనీ నుంచి భారీగా బీఆర్ఎస్ శ్రేణులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్‌పల్లి, జూలై 18 : బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లో నిర్వహించిన యువ సంగ్రామ సదస్సుకు శేరిలింగంపల్లి నియోజకవర్గం ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువత తరలివెళ్లారు. డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు డి. అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ర్యాలీగా బయలుదేరి సదస్సులో పాల్గొన్నారు. సదస్సులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్, ఆ హామీని నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వం 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఉద్యోగ నియామకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకుంటోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు వారిని నిరాశపరిచిందని విమర్శించారు.



## రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన

### మండల ఏఓ శ్రీనివాస్ రాజు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జూలై 18 : పాపన్నపేట మండల పరిధిలోని మల్లం పేట రైతు వేదికలో శనివారం రోజు పాపన్నపేట మండల వ్యవసాయ శాఖ అధికారి పి.శ్రీనివాస్ రాజు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రైతులు ప్రస్తుత వాతావరణంపై ఎల్‌నినో ప్రభావం,ఎల్‌నినో వ్యవసాయం పై వివిధంగా ప్రభావం చూపించున్నది.ప్రత్యామ్నాయ పంటల సాగు అవసరం పై అవగాహన కల్పించారు. ఎల్ నినో ప్రభావం మూలంగా ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పబ్బతి. ప్రభాకర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య,మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీఓ విష్ణు వర్ధన్, మల్లంపేట, సర్సింగరావుపల్లి, కందిపల్లి, ఎల్లాపూర్ గ్రామ సర్పంచ్లు, మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి సంతోష్ కుమార్, మండల రైతులు తదితరులు పాల్గొన్నారు.





## నిందితులకు శిక్షే లక్ష్యం... కోర్టు డ్యూటీలో నిర్లక్ష్యం వద్దు

### - శిక్షల శాతం పెంచడంపై పోలీసులకు ఎస్పీ సునితారెడ్డి దిశానిర్దేశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, జూలై 18 : నేరాలకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టి శిక్ష పడేలా చేయడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని జిల్లా ఎస్పీ సునితారెడ్డి ఐపీఎస్ పేర్కొన్నారు. ప్రతి కేసులోనూ నిందితులకు శిక్ష పడేలా కోర్టు డ్యూటీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం కోర్టు లైజన్ అధికారులు, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. కోర్టు విధులను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా కేసుల పరిష్కార వేగం పెరుగుతుందని, శిక్షల శాతం కూడా మెరుగుపడుతుందని అన్నారు. నేర నియంత్రణలో కోర్టు కేసుల ఫలితాలు కీలకమని, నిందితులకు శిక్షలు పడినప్పుడే సమాజంలో చట్టంపై గౌరవం పెరుగుతుందని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు నుంచి కేసు తుది తీర్పు వచ్చే వరకు అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్షుల వాంగ్మూలాలు సక్రమంగా కోర్టుకు చేరేలా కోర్టు డ్యూటీ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. సాక్షులు, బాధితులు నిర్ణీత తేదీల్లో కోర్టుకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు వారికి కేసు పురోగతిపై అవగాహన కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని, నాన్‌బెయిలబుల్ వారెంట్లు (ఎన్‌బీడబ్ల్యూలు), సమన్ల అమలులో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని ఎస్పీ స్పష్టం చేశారు. కోర్టు నుంచి వచ్చే ప్రతి సమాచారాన్ని సంబంధిత దర్యాప్తు అధికారులకు వెంటనే చేరవేయాలని ఆదేశించారు. సమావేశంలో వనపర్తి డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్, డీసీఆర్బీ ఎస్సై తిరుపతి రెడ్డి, జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.



## డిపో మేనేజర్ కు వినతి పత్రం అందించిన బిజెపి నేతలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోరుట్ల, జూలై 18 : మెట్పల్లి పట్టణ అధ్యక్షులు దొనికేల నవీన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పాత బస్టాండ్, బస్ డిపో పరిస రాలలో బస్సు షెల్టర్ లను ఏర్పాటు చేయాలని కోరుతూ, శనివారం బిజెపి నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ..బస్సు షెల్టర్ లేకపోవడంతో ప్రయాణి కులు, ప్రజలు, విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారని, వర్షాకాలం, ఎండా కాలంలో ప్రజలు ఆయా ప్రాంతాలలో బస్సుల కోసం రోడ్డుపై వేచి చూడవలసిన పరిస్థితి వుందన్నారు. తక్షణమే బస్సు షెల్టర్ లను ఏర్పాటు చేయాలని బిజెపి పట్టణ శాఖ తరపున డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనూప్ రావు, బీజేపీ పట్టణ అధ్యక్షులు ధోనికేల నవీన్, కౌన్సిలర్, వైస్ ఫోర్ లీడర్ బొడ్ల ఆనంద్, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శిలు కలికోట శ్రీకాంత్, బత్తుల జగదీష్, సీనియర్ నాయకులు ధర్మపురి వేణుగోపాల్, పుడుకారపు కిషోర్ రెడ్డి, ఉపా ధ్యక్షులు లోలపు అనిల్, భోగ దత్తు, గుంటుక హనుమాన్లు, ఐటీ సెల్ పాసికంటి శ్రీనివాస్, కోశాధికారి తల్లోజి భాస్కర్, టౌన్ ఆఫీస్ ఇంచార్జ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



## చెక్ బౌన్స్ కేసులపై ప్రత్యేక లోక్ అదాలత్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, జూలై 18 : ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ ఎస్.వి.పి సూర్య చంద్రకళ ఆదేశానుసారం జిల్లాలోని చెక్ బౌన్స్ కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.శనివారం ములుగు జిల్లా కోర్ట్ ఆవరణలో ఎన్.ఐ యాక్ట్ సెక్షన్ 138 క్రింద ఉన్న చెక్ బౌన్స్ కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ టీ.కన్హయ్య లాల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.జ్యోత్స్న,అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధులిక తేజ,జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాలుగు చంద్రయ్య ఉపాధ్యక్షులు రంగోజు భిక్షపతి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు మేకల మహేందర్, బానోత్ స్వామిదాస్, న్యాయవాదులు ఆర్.శ్రీనివాస్,రంగోజు సూర్యం, ఎండీ.మున్సూర్ అలీ,కే.ప్రణయ్ ప్రసాద్,విజయ్,ములుగు సీఐ సురేష్,వివిధ బ్యాంక్ మేనేజర్ లు తదితరులు పాల్గొన్నారు..



## జూలై 20 న పెద్దపల్లి కలెక్టరేట్ ముందు ధర్నా

### - బీసీడబ్ల్యూయూ (సీఐటీయూ)

### - ప్రధాన కార్యదర్శి వేల్పుల కుమారస్వామి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), జూలై 18 : గోదావరిఖని సీఐటీయు కార్యాలయం లో పెద్దపల్లి జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మీటింగ్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిసిడబ్ల్యుయూ (సిఐటియూ) జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల కుమారస్వామి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని జులై 20న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నాలకు పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఈ నెల 20న పెద్దపల్లి జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమం లో జిల్లా లోని భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.అదే విదంగా ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన జీఓ 12ను రద్దుచేసి వెల్ఫర్ బోర్డు ద్వారా నే కార్మికులకు సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు సిఎస్‌సి సంస్థ హెల్త్ టెస్ట్ లను వెంటనే రద్దు చేయాల న్నారు.. కార్మికులందరికి హెల్త్ కార్డు లు ఇవ్వాలని డిమాండ్ చేసారు.55 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు పెన్షన్ 6వేలు ఇవ్వాలన్నారు అదేవిదంగా పిల్లల చదువులకు స్కాలర్షిప్ లు గృహ వసతి అడ్డాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని తదితర సమస్యలు పరిష్కారం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరమేష్, మోహన్, కిషన్, సదయ్య, మధు, అంజయ్య, అవినాష్, డేవిడ్, రాజబాబు, సమ్మయ్య సతీష్, శ్రవణ్ కుమార్, దీక్షిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఖనిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

### - 25 కిలోల వాడిన వంటనూనె స్వాధీనం

### - చిప్స్ ధ్వంసం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, జూలై 18 : స్థానిక పలు రెస్టారెంట్లు, ఆహార తయారీ యూనిట్లలో శనివారం పెద్దపల్లి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌నగర్‌లోని ఓ ఆహార తయారీ యూనిట్‌ను తనిఖీ చేయగా ఆలుగడ్డ చిప్స్‌తో పాటు ఇతర స్నాక్స్ తయారీలో వంటనూనెను పదేపదే వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ శాఖ టెస్టింగ్ మీటర్‌తో వంటనూనె నాణ్యతను పరీక్షించగా, దాని విలువలు నిర్దేశిత ప్రమాణాలను మించినట్లు తేలింది. దీంతో సుమారు 25 కిలోల వాడిన వంటనూనెను స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేయడం తో పాటు, ఆ నూనెతో తయారు చేసిన చిప్స్‌ను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. వాడిన వంటనూనెను ఎట్టి పరిస్థితుల్లోనూ అనధి కార వ్యక్తులు లేదా సంస్థలకు విక్రయించరాదని యాజమాన్యానికి ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.అలాగే సంబంధిత ఆహార నమూనాలను సేకరించి రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపినట్లు తెలిపారు. ప్రయోగశాల నివేదికల ఆధారంగా అవసర మైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వి.అంకిత్ రెడ్డి వెల్లడించారు.



## ఆర్.ఆర్. విద్యాభవన్ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

### - శిబిరాన్ని ప్రారంభించిన బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్‌పల్లి, జూలై 18 : శేర్లింగంపల్లి నియోజకవర్గం వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ బస్తీలో ఉన్న ఆర్.ఆర్. విద్యాభవన్ పాఠశాలలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మల్లారెడ్డి ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, పాఠశాల నిర్వాహకులు సుబ్రహ్మణ్యం కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి ఆసుపత్రికి చెందిన వైద్యులు విద్యార్థులు, స్థానికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించిన చికిత్సలు అందించారు. అలాగే ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం చికిత్స పొందిన విద్యార్థులు, స్థానికులకు ఊట్ల చంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యం వెంకటరెడ్డి, బి. ఎల్లారెడ్డి, శ్రీనివాసరావు, డి. తిరుపతిరెడ్డి, లక్ష్మణ్, గోపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు



## జోగన్ పల్లిలో ఎస్ఐఆర్ వంద శాతం పూర్తి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోరుట్ల, జూలై 18 : కోరుట్ల మండలం జోగన్ పల్లి గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియ వంద శాతం పూర్తయింది. గత నెల 25 నుండి ఈనెల 15,వ తేదీ వరకు నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జిపివో సుమలత సహకారంతో బిఎల్వోలు వసణ, కృష్ణవేణిలు వంద శాతం ఎన్యూమరేషన్ ఫామ్ లు అందజేసి, ఆన్లైన్ లో నమోదు చేశారు. ఈ సందర్భంగా వారిని గ్రామ పంచాయతీ తరఫున కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీల ప్రతినిధులు పార్టీల సమక్షంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బద్దం తిరుపతి రెడ్డి, ఉప సర్పంచ్ వేల్పుల అంబేద్కర్, పంచాయతీ కార్యదర్శి గీతారాణి, దుంపల రాజనర్సయ్య, సైదు గంగాధర్, పోతవేణి శేఖర్, ఎలేటి స్వామి రెడ్డి, కందుల శ్రీను, మేడే అంజయ్య, తెలు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డి పట్టా పొందిన కాయితి వనిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోరుట్ల, జూలై 18 : మేడిపల్లి మండలం కల్వకోట గ్రామానికి చెందిన కాయితి వనిత ఉస్మానియా విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (స్వయంప్రతిపత్తి), ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో 'నోవెల్ త్రీ ఫేజ్ మల్టీలెవల్ ఇన్వర్టర్ టోపాలజీ యూజింగ్ ఎస్ఐసి మోస్ ఫేట్స్ ఫర్ గ్రిడ్ కనెక్టెడ్ అప్లికేషన్స్' అనే అంశంపై పరిశోధన చేసి పీహెచ్.డి పట్టాను విజయ వంతంగా పొందారు. ఈ పరిశోధనను ప్రొఫెసర్ ఎం.చక్రవర్తి పర్యవేక్షణలో, ప్రొఫెసర్ పి.సతీష్ కుమార్ సహ పర్యవేక్షణలో పూర్తి చేశారు. పీహెచ్.డి వైవా-వోస్ పరీక్షను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ పట్టా సాధించిన సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అధ్యాపకులు, గ్రామస్థులు కాయితి వనితకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## ఎల్లమ్మబండ వాటర్ ట్యాంక్ వాల్వ్ మరమ్మతులు వేగవంతం

### - త్వరలో నీటి సరఫరా సమస్యకు శాశ్వత పరిష్కారం: జిల్లా గణేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్‌పల్లి, జూలై 18 : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఉమ్మడి ఆల్విన్ కాలనీ 124వ డివిజన్ పరిధిలో గత వారం రోజులుగా నీటి మోటార్లు చెడిపోవడంతో గ్రావిటీ పద్ధతిలో నీటి సరఫరా కొనసాగుతుండగా, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఎల్లమ్మబండ వాటర్ ట్యాంక్‌కు నీటి సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ వాల్వ్ దెబ్బతినడంతో ట్యాంక్‌కు నీటి నిల్వ పూర్తిగా నిలిచిపోయింది. సమస్యను తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు జిల్లా గణేష్ నేత వెంటనే సంబంధిత ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్‌తో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దెబ్బతిన్న వాల్వ్‌కు తక్షణ మరమ్మతులు చేపట్టేలా అధికారులతో సమన్వయం చేసి పనులను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ మాట్లాడుతూ, గత వారం రోజులుగా మోటార్లు పనిచేయకపోవడంతో నీటి పంపిణీలో తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చొరవతో కాలిపోయిన రెండు మోటార్లకు మరమ్మతులు కొనసాగుతున్నాయని తెలిపారు. మరో రెండు నుంచి మూడు రోజుల్లో మోటార్లు పూర్తిగా అందుబాటులోకి వచ్చి, నీటి సరఫరా సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, అనంతరం నీటి పంపిణీ యథావిధిగా కొనసాగుతుందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ అకాడమీల్లో ప్రవేశాలకు ఎంపికలు

### - జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి డా.ఓలేటి జ్యోతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, జూలై 18 :తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో 2026--27 విద్యా సంవత్సరానికి ప్రాంతీయ క్రీడా వసతి గృహాలు, స్పోర్ట్స్ అకాడమీల్లో ప్రవేశాల కోసం బాలుర, బాలికలకు ఈ నెల 20 నుంచి 28 వరకు వివిధ కేంద్రాల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి డా. ఓలేటి జ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు స్పోర్ట్స్ సర్టిఫికెట్లు, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లు, 10 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఒరిజినల్ పత్రాలతో పాటు జిరాక్స్ ప్రతులు తీసుకుని సంబంధిత కేంద్రాలకు ఉదయం 8 గంటలకు హాజరుకావాలని సూచించారు.వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్, రెజ్లింగ్, సైక్లింగ్, హాకీ, హ్యాండ్‌బాల్, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్ తదితర క్రీడల్లో ఎంపికలు సిద్ధిపేట, రాజన్న సిరిసిల్ల, హైదరాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, హనుమకొండ, గచ్చిబౌలి తదితర కేంద్రాల్లో నిర్వహిస్తారు. వాలీబాల్ అకాడమీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 30-06-2010 నుంచి 01-07-2012 మధ్య జన్మించి ఉండాలి.మరిన్ని వివరాలకు జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయం లేదా ౹94406 30681౹ నంబర్‌ను సంప్రదించాలని డా.ఓలేటి జ్యోతి సూచించారు.

## ఏడుపాయల వనదుర్గా మాతను దర్శించుకున్న మాఅసోసియేషన్ అధ్యక్షులు సినీ నటుడు మంచు విష్ణు


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, జూలై 18 : తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన శ్రీ ఏడుపాయల వనదుర్గామాతను శనివారం రోజు మా అసోసియేషన్ అధ్యక్షులు,సినీనటుడు మంచు విష్ణు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. మంచు విష్ణు ఏడుపాయలకు చేరుకోగానే అదనపు కలెక్టర్ నగేష్ మొక్కను అందించి స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన, అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర , ప్రాముఖ్యాన్ని అదనపు కలెక్టర్ నగేష్ మంచు విష్ణు కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం చారిత్రక నేపథ్యం కలిగిన మెదక్ ఖిల్లా సందర్శించి దాని చరిత్రను జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం మెదక్ చర్చిని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన, వారసత్వ సంపదకు మెదక్ జిల్లా నిలయమన్నారు. భవిష్యత్తులో నేను నటించే సినిమా గానీ, ప్రొడ్యూసర్ గానీ చేసే సినిమాలో మెదక్ నుండే ఒక అవకాశం ఇస్తానని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి రమేష్, మెదక్ యూత్ ఐకాన్ లీడర్ భువన్ కుమార్,మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ నవీన్ కుమార్, కౌన్సిలర్లు, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, పాపన్నపేట ఎస్ఐ సారా శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి కోర్టు నుండి పటాన్చెరు మధ్య రెండో బస్సు సర్వీస్ ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కూకట్‌పల్లి, జూలై 18 : కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సౌకర్యార్థం పటాన్‌చెరు నుంచి కూకట్‌పల్లి కోర్టు వరకు రెండో బస్సు సర్వీసును ప్రారంభించి నట్లు బార్ అసోసియేషన్ ప్రకటించింది. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు పటాన్‌చెరు నుంచి బయలుదేరే బస్సు ఆర్‌సీ పురం, బీరంగూడ ఆర్చ్, అశోక్‌నగర్, భెల్ జంక్షన్, చందానగర్, గంగా రం, మదీనాగూడ, ఆల్విన్ ఎక్స్ రోడ్స్, మియాపూర్, హైదర్‌నగర్, జేఎన్‌టీయూ, లులు మాల్, నెక్సస్ మాల్, మలేషియన్ టౌన్‌షిప్, 9వ ఫేజ్ మీదుగా ప్రయాణించి ఉదయం 10:15 గంటలకు కూకట్‌పల్లి కోర్టుకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సాయం త్రం 5:15 గంటలకు కూకట్‌పల్లి కోర్టు నుంచి బయలు దేరి అదే మార్గంలో ప్రయాణించి సాయంత్రం 6:15 గంటలకు పటాన్‌చెరు చేరుకుంటుంది. ఈ ఉచిత రవాణా సౌకర్యాన్ని బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అందరూ సద్వినియోగం చేసుకుని బస్సు సేవ విజయవం తంగా కొనసాగేందుకు సహకరిం చాలని బార్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడానికి సహకరించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బార్ కౌన్సిల్ సభ్యులు అశోక్ గౌడ్, న్యాయాధికారి, టీజీఎస్‌ఆర్టీసీ అధికారులకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి. పి, ప్రధాన కార్యదర్శి కె. సురేందర్ గౌడ్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలకు తరలివెళ్లిన మహబూబాబాద్ జిల్లా నేతల

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




మహబూబాబాద్ టౌన్, జూలై 18 : పాల్వంచలో జూలై 18, 19 తేదీల్లో జరుగుతున్న తెలంగాణ గిరిజన సమాఖ్య మూడో రాష్ట్ర మహాసభలకు మహబూబాబాద్ జిల్లా నుంచి గిరిజన నాయ కులు శనివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోతు రవీందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర మహాసభల్లో విస్తృతంగా చర్చించి, వాటి పరిష్కారం కోసం ఉద్యమాలు చేపడతా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్య హరి నాయక్, లావుడ్య భీముడు, వీరన్న, సుమన్, రవి, బీమ్లు, బావుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యన్నయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి...

### - జిల్లా పంచాయతీ అధికారి యదయ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేక్మాల్ జులై 18 : రాష్ట్రంలో నెలకొన్న సూపర్ ఎల్ -నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరమయ్యే వరి పంటలకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య అన్నారు. శనివారం మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఎల్లుపేట గ్రామ రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఎల్ -నినో వాతావరణం వ్యవసాయ శాఖ అవగాహన సదస్సు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం డిపిఓ యాదయ్య రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ...లోటు వర్షపాతం నమోదవుతున్న కారణంగా వేసిన పంటలకు అధికంగా ఎరువులు వాడరాదన్నారు. నీటి లభ్యతను బట్టి పప్పు దినుసుల పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నీటి వనరులు ఉంటేనే వరిని సాగు చేయాలని అయన సూచించారు.నీటిని నిలువ చేసుకునేందుకు ఫారం ఫండ్‌లు, చెక్ డ్యామ్‌లు, కాలువలను మరమ్మత్తులు చేసుకోవాలని తెలిపారు.ఇళ్ళ ముందు ఇంకుడు గుంతను నిర్మించుకుంటే భూగర్భ జలాల పొదుపుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్, ఎంపీఓ రియాజుద్దీన్, ఎల్లుపేట, బోడగట్టు, సూరంపల్లి కమ్మరికత, సీఎం తండా, వేల్పుగొండ షాబాద్ తాండ సర్పంచులతో పాటు ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, యువజన సంఘాల నాయకులు,ప్రజా ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి బలమైన పునాది



**- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు పరిశీలించుకోవాలి:**
**- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్‌పల్లి, జూలై 18 : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో డివిజన్ నాయకుడు పట్వారీ శశిధర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని స్థానిక శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్ గౌడ్ , మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, డివిజన్ నాయకులు, ప్రజలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి అసలైన బలం ప్రజలేనని, ప్రజల శక్తికి ప్రతీక ఓటు హక్కు అని అన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం కేవలం ఒక ప్రక్రియ మాత్రమే కాదని, దేశం పట్ల ప్రతి పౌరుడి బాధ్యతతో పాటు రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం అత్యంత కీలకమైనదని ఆయన అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయడం, ఇప్పటికే నమోదైన వివరాల్లో ఉన్న పొరపాట్లను సవరించడం, చిరునామా మార్పులను నమోదు చేయడం, కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతకు ఓటు హక్కు కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు, ముఖ్యంగా యువతకు విజ్ఞప్తి చేస్తూ, ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, పేరు లేకపోతే వెంటనే నమోదు చేసుకోవాలని, వివరాల్లో ఏవైనా మార్పులు ఉంటే సవరించుకోవాలని సూచించారు. అలాగే కుటుంబ సభ్యులు, బంధువులు, పొరుగువారిని కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములను చేసి ఓటరు నమోదు పట్ల అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్ల సంజీవ రెడ్డి, నాయకులు బల్లింగ్ యాదగిరి గౌడ్, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అభిషేక్ గౌడ్, మన్నేపల్లి సాంబశివరావు, రవి, కట్ల శేఖర్ రెడ్డి, యలమంచి ఉదయ్ కిరణ్, సంగమేష్, వాసు, సర్జింగ్ రావు, భాస్కర్, జి. రవి, నాగయ్య, గణేష్, రాంచందర్, సూర్యనారాయణ, రాందాస్, శ్రీను, కురువ శ్రీను, అగ్రవాసు, ముజీబ్, షౌకత్ అలీ మున్నా, వీరేష్, మహ్మద్ రఫీక్, అంజలయ్య, చంద్రయ్య, ప్రసాద్, నారాయణ, కమ్మినేని వాసు, రాజ్ కుమార్, డి. ప్రభాకర్, లక్ష్మణ్, విష్ణు, మల్లేష్, రాజు, నవాజ్, ఇంతియాజ్, సురేష్, రాం రెడ్డి, గఫూర్, వెంకటేష్, శ్రీనివాస్, ప్రభాకర్, కిట్టు, పండు, అరుణ్, సందీప్, సుధాకర్, వెంకట్, రంగారెడ్డి జిల్లా డీసీసీ కార్యదర్శి సత్తూర్ శిరీష, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు రాజమణి, రమాదేవి, లక్ష్మి, స్వప్న, సాలమ్మ, మమత, శాంతి, అనుపమ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి :: కలెక్టర్ దివాకర టీఎస్.



**- అంజనాపురంలో గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి విస్తృత ఏర్పాట్లు**
**- హెలిప్యాడ్, సభా ప్రాంగణం, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూలై 18 : గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లాకు విచ్చేయనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను ప్రోటోకాల్‌కు అనుగుణంగా పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. వైరా నియోజకవర్గం కొణిజర్ల మండలం అంజనాపురంలో నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ, సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలను శనివారం పరిశీలించిన ఆయన సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. సభా వేదిక, సీటింగ్ ఏర్పాట్లు ప్రోటోకాల్ ప్రకారం ఉండాలని, ప్రతి గ్యాలరీకి స్పష్టమైన గుర్తింపు బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. మీడియా ప్రతినిధులకు ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేయడంతో పాటు వీవీఐపీ పాస్‌లను అవసరానికి మించి జారీ చేయరాదని స్పష్టం చేశారు. వేదిక సుమారు 100 మంది బరువును తట్టుకునేలా నిర్మించాలని, మినిట్ టు మినిట్ కార్యక్రమ షెడ్యూల్‌ను ముందుగానే సిద్ధం చేసి అన్ని శాఖలు దానికి అనుగుణంగా పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్, సభా ప్రాంగణం, రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. మీడియా, అధికారులు, వీఐపీలు, వీవీఐపీలకు వేర్వేరు ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేయడంతో పాటు సభా ప్రాంగణంలో బారికేడింగ్ పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ, వీఐపీ, ఇతర వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఆడియో, వీడియో ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించే అంశాన్ని రెవెన్యూ డివిజనల్ అధికారి సమన్వయం చేయాలని సూచించారు.

సభకు హాజరయ్యే వారికి స్పష్టంగా కనిపించేలా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సభా ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణ, సురక్షిత తాగునీటి సరఫరా, ముఖ్యమంత్రి, మంత్రులకు అందించే ఆహార నాణ్యత, వైద్య బృందాలు, అంబులెన్స్‌లు, అత్యవసర వైద్య పరికరాలు, నిరంతర విద్యుత్ సరఫరా, స్టాండ్‌బై జనరేటర్లు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ ప్రతినిధులతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తమకు అప్పగించిన బాధ్యతలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని సూచించారు. ఈ పరిశీలనలో ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, పోలీసు అధికారులు, ఆర్ అండ్ బి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముహమ్మద్ ముజాహిద్, డీఏవో సునీల్ రెడ్డి, ఫుడ్ సేఫ్టీ అధికారి, డీపీఓ రాంబాబు, ఉద్యానవన శాఖ అధికారి అనిత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.





# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి-నాణ్యతలో రాజీ పడొద్దు

**- పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.**
**- పాలేరు నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష.**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూలై 18 : పాలేరు నియోజకవర్గంలో కొనసాగుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార–పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి క్యాంపు కార్యాలయంలో శనివారం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో పాలేరు నియోజకవర్గ అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పరిధిలో మంజూరైన పనులు, టెండర్లు పూర్తైనవి, నిర్మాణంలో ఉన్నవి, టెండర్లు పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక లేదా ఇతర కారణాలతో నిలిచిపోయిన పనులకు ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, నిర్ణీత గడువులో అన్ని పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి సూచించారు. పెండింగ్ బిల్లుల వివరాలను కూడా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం ఉంటేనే అభివృద్ధి పనులు వేగంగా పూర్తవుతాయని పేర్కొన్న మంత్రి, సమస్యలు తలెత్తిన వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. ప్రజాదర్బార్‌లో స్వీకరించిన దరఖాస్తులను శాఖల వారీగా త్వరితగతిన పరిష్కరించాలని, ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో రీ–సర్వే ప్రక్రియను పూర్తిస్థాయిలో చేపట్టి, రాష్ట్రానికే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్‌రావు, పీఆర్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసచారి, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.





# తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కోసం తొలి ఉద్యమం ఏఐటీయూసీదే :: వంగ వెంకట్

**- సింగరేణి మనుగడకు మరిన్ని బొగ్గు బ్లాక్‌లు కేటాయించాలని డిమాండ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, జూలై 18 : సింగరేణికి తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ కేటాయింపునకు తొలి ఉద్యమాన్ని 2013లో ఏఐటీయూసీ ప్రారంభించిందని ఆ సంఘం కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ తెలిపారు. భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం మెయిన్ వర్క్‌షాప్‌లో శనివారం నిర్వహించిన తాడిచర్ల––2 బొగ్గు బ్లాక్ సాధన విజయోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2017 మేలో “సింగరేణి జాతా” పేరుతో తాడిచర్ల––2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ బస్సు యాత్ర నిర్వహించిన ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీనేనని పేర్కొన్నారు. ఈ బ్లాక్ సాధనలో కార్మికులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు అందించిన సహకారం అభినందనీయమని అన్నారు. జేవీఆర్ ఓసీ––3, కోయగూడెం, శ్రావణపల్లి, మణుగూరు డిప్‌సైడ్ బ్లాక్‌లను కూడా సింగరేణికే కేటాయించి సంస్థ మనుగడను బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, కార్మికులకు రావాల్సిన లాభాల వాటా చెల్లించాలని కోరారు. అలాగే, జెన్‌కో నుంచి సింగరేణికి రావాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే వసూలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్), డైరెక్టర్ (పీపీ), జీఎం (సీపీపీ), జీఎం (వెల్ఫేర్), సీఎంఓఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# అన్నోజిగూడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

**- నూతన డైరీని ఆవిష్కరించిన సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఘట్‌కేసర్, జూలై 18 : లయన్స్ క్లబ్ ఆఫ్ దిల్‌సుఖ్‌నగర్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ మండలం అన్నోజిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించిన వైద్యులు అవసరమైన సూచనలు అందించారు. అనంతరం పాఠశాలలో నూతన డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీం రేవంతన్న రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, సమయపాలన అలవర్చుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులకు ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. వైద్య శిబిరం, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం విద్యార్థులు, ఉపాధ్యాయుల ఉత్సాహభరిత పాల్గొనికతో విజయవంతంగా సాగింది.

# కలెక్టర్‌కు ఫిర్యాదుపై కొడుకు వివరణ

**- తనపై తప్పుడు ప్రచారం చేశారని డీఈ భూక్య పుల్యా ఆరోపణ.**
**- తల్లిదండ్రులంటే గౌరవమేనని స్పష్టం.**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)






పాల్వంచ, జూలై 18 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన కేటీపీఎస్ డీఈ భూక్య పుల్యా తన తల్లిదండ్రులు కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదుపై శనివారం పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి తన వివరణ ఇచ్చారు. తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఉద్దేశంతోనే తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. శుక్రవారం తన తల్లిదండ్రులు తమను ఇంటి నుంచి బయటకు పంపించి తాళం వేశారని, జీవన భృతి కోసం తన జీతం నుంచి కొంత మొత్తం ఇప్పించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం మీడియాలో, సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చిన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఈ సందర్భంగా పుల్యా మాట్లాడుతూ తనకు తల్లిదండ్రులంటే ఎంతో గౌరవమని, తాను తనకు సంబంధించిన ఇంటి భాగానికే తాళం వేశానని, తల్లిదండ్రులు ఉంటున్న భాగానికి ఎలాంటి ఇబ్బంది కలిగించలేదని తెలిపారు. తాము ముగ్గురు అన్నదమ్ములమని, తన వాటాగా ఎకరం భూమి రావాల్సి ఉండగా కేవలం పది కుంటల భూమి ఇస్తామని చెప్పారని పేర్కొన్నారు. తన తల్లితో మాట్లాడించి తనపై తప్పుడు ప్రచారం చేయించారని ఆరోపించిన ఆయన, తల్లిదండ్రులను ఇంటి నుంచి వెళ్లగొట్టలేదని స్పష్టం చేశారు. మంచి హోదాలో ఉద్యోగం చేస్తున్న తన ప్రతిష్ఠను దెబ్బతీసేలా ప్రచారం జరగడంతోనే మీడియా సమావేశం ఏర్పాటు చేశానని తెలిపారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేసి తన పరువును కాపాడాలని మీడియాను కోరారు. ఈ మీడియా సమావేశంలో ఆయన మామ కూడా పాల్గొన్నారు.

# ఏఐసీసీ, పీసీసీ పిలుపుతో కాంగ్రెస్ నిరసన

**ఖమ్మంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సత్తుపల్లి నాయకులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)





సత్తుపల్లి, జూలై 18 : ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన శనివారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో “ఛాత్రోన్ కీ గూనీ” పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల పట్ల కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.



# ‘సర్’తో పాటు ప్రజా సమస్యలపైనా దృష్టి పెట్టండి

**- పెద్దమందడి మండలంలో విస్తృతంగా పర్యటించిన నిరంజన్‌రెడ్డి**
**- అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని**
**- బీఆర్ఎస్ శ్రేణులకు సూచన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, (పెద్దమందడి) జూలై 18: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియలో చురుగ్గా పాల్గొంటూనే ప్రజా సమస్యలను గుర్తించి పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామస్థాయి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతున్న సర్ ప్రక్రియను పరిశీలిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి శనివారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పెద్దమందడి మండలంలో విస్తృతంగా పర్యటించారు. చిలుకటోనిపల్లి, బలీదుపల్లి, వెల్టూరు, మదిగట్ల, మోజర్ల, చిన్నమందడి, పెద్దమందడి, జగత్‌పల్లి, అల్వాకుల మండలంలోని పెద్దమునుగల్‌చేడు, చిన్నమునుగల్‌చేడు, కనుమనూరు తదితర గ్రామాల్లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఓటరు పేరు తుది జాబితాలో ఉండేలా బీఎల్‌వోలు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమని, ఒక్క అర్హుడూ జాబితా నుంచి తప్పిపోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సర్ ప్రక్రియలో పాల్గొంటూనే గ్రామాల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాల అమలు వంటి ప్రజా సమస్యలను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం పార్టీ నాయకుల బాధ్యత అని పేర్కొన్నారు. పర్యటనలో వాకిటి శ్రీధర్, జగదీశ్వర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, వేణు యాదవ్, కుమార్ యాదవ్, అశోక్, సేనాపతి, పురుషోత్తంరెడ్డి, కురుమూర్తి, శ్రీనివాసులు, మొగిలయ్య, వెంకటన్న, ఆంజనేయులు, నరసింహ, హనుమంత్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.



# సింగరేణి లాభాల వాటా వెంటనే ప్రకటించాలి: కామెర గట్టయ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, జూలై 18 : సింగరేణి 2025–26 ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాలను యాజమాన్యం వెంటనే ప్రకటించి, అందులో 35 శాతం వాటాను కార్మికులకు అందజేయాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం (టీఎస్‌యూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య డిమాండ్ చేశారు. శనివారం టీఎస్‌యూఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్థిక సంవత్సరం ముగిసి నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు సంస్థ సాధించిన వాస్తవ లాభాల వివరాలను యాజమాన్యం వెల్లడించలేదని విమర్శించారు. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై పారదర్శకత పాటిస్తూ లాభాలను ప్రకటించి, సంప్రదాయం ప్రకారం లాభాల్లో 35 శాతం కార్మికులకు వాటాగా ఇవ్వాలని కోరారు. ఈ అంశంపై గుర్తింపు పొందిన ప్రాతినిధ్య కార్మిక సంఘాలు చొరవ తీసుకుని యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలని కామెర గట్టయ్య పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీఎస్‌యూఎస్ నాయకులు దాసరి జనార్ధన్, నామల శ్రీనివాస్, కాసర్ల ప్రసాద్ రెడ్డి, రాళ్లబండి బాబు, జయశంకర్, ఎం. మధుకర్, ఎండీ సాజిత్, నరసింహారెడ్డి, సలీం, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# మైనింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి

**- ఎస్.కె.ఎం.ఎల్.యు. బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ భేతెల్లి మధుకర్ రెడ్డి**
**- భూపాలపల్లిలో మైనింగ్ స్టాఫ్ సమస్యలపై నేడు సమావేశం.**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్–భూపాలపల్లి, జూలై 18 : సింగరేణి మైనింగ్ స్టాఫ్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు రావాలని, సమస్యల సాధనకు నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ భూపాలపల్లి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మధుకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ డాక్టర్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు జూలై 19న (ఆదివారం) సాయంత్రం 4 గంటలకు భూపాలపల్లి సింగరేణి పైలెట్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మైనింగ్ స్టాఫ్ సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మైనింగ్ స్టాఫ్‌కు సంబంధించిన వివిధ సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన కార్యాచరణపై సమావేశంలో సమగ్రంగా చర్చిస్తామని చెప్పారు. అన్ని ఏరియాల వైస్ ప్రెసిడెంట్లు, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జిలు, స్థానిక మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని మధుకర్ రెడ్డి కోరారు.

# ప్రతాపగిరిలో వనమహోత్సవం.. ఇంటింటికీ పండ్ల మొక్కల పంపిణీ

**పచ్చదనం పెంపొందించడమే లక్ష్యం : సర్పంచ్ వూర వెంకటేశ్వరరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




కాటారం, జూలై 18 : మండలంలోని ప్రతాపగిరి గ్రామపంచాయతీలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం ఇంటింటికీ పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వూర వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామస్తు లకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం, పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి వృక్షాలుగా తీర్చిదిద్దాలని గ్రామస్తులకు సూచించారు. పంపిణీ చేసిన పండ్ల మొక్కలను ఇంటి ప్రాంగణంలో నాటి శ్రద్ధగా పెంచుకోవాలని కోరారు. ఉపసర్పంచ్ బియ్యన రాజయ్య, పంచాయతీ కార్యదర్శి అరికిల్ల శంకరయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ బందెల స్వామి, పాలకవర్గ సభ్యురాలు బిసుల స్వరూపతో పాటు పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సత్తుపల్లి రేజర్ల సింగరేణి ఓసీ వద్ద సత్తెమ్మ కాలనీ వాసుల నిరసన

**- కాలుష్యం, బ్లాస్టింగ్‌లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన.**
**- నష్టపరిహారం చెల్లించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని డిమాండ్.**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, జూలై 18 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రేజర్ల సింగరేణి ఓపెన్‌కాస్ట్ గని సమీపంలోని సత్తెమ్మ కాలనీ వాసులు శనివారం గని ప్రధాన మార్గం వద్ద ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు బ్లాస్టింగ్‌ల వల్ల నష్టపోయిన కుటుంబాలకు నష్టపరిహారం అందించి, ప్రమాదకర ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. గ్రామానికి అతి సమీపంలో గని కార్యకలాపాలు కొనసాగుతుండటంతో దుమ్ము, ధూళి కాలుష్యం తీవ్రంగా పెరిగి ప్రజలు శ్వాసకోశంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు తెలిపారు. గనిలో జరుగుతున్న బాంబు బ్లాస్టింగ్‌ల కారణంగా ఇళ్ల గోడలు, స్లాబులు బీటలు వారి పగుళ్లు ఏర్పడ్డాయని, భారీ శబ్దాల వల్ల చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులపై ఫారెస్ట్ అధికారుల వేధింపులు ఆపాలి

### - ప్రభుత్వం అణచివేత ధోరణి వీడాలి
### -గిరిజనుల హక్కులను కాపాడాలి: బీఆర్ఎస్ నేతలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, జూలై 18 : పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులపై ఫారెస్ట్ అధికారులతో వేధింపులకు పాల్పడించడం మానుకోవాలని, గిరిజనుల భూ హక్కులను ప్రభుత్వం పరిరక్షించాలని బీఆర్ఎస్ మణుగూరు మండల అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా మణుగూరులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షుడు కుంట లక్ష్మణ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. అశ్వాపురం మండలం మనుబోతులగూడెంలో పోడు భూముల వివాదం నేపథ్యంలో ఫారెస్ట్ అధికారులు మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించడం, పత్తి పంటను ధ్వంసం చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కృషితో అనేక మంది గిరిజనులకు పోడు భూముల పట్టాలు అందించామని గుర్తు చేశారు. ప్రస్తుతం గిరిజనులు సాగు చేస్తున్న భూముల్లో చిన్నచిన్న వివాదాలను సాకుగా చూపుతూ ఫారెస్ట్ అధికారులు దాడులకు పాల్పడటం సరికాదన్నారు. గిరిజనులకు భూమిపై హక్కు ఉన్న నేపథ్యంలో సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో గిరిజనులపై ఇలాంటి దాడులు పునరావృతమైతే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, బాధితులకు అండగా నిలిచి ఉద్యమిస్తామని హెచ్చరించారు. పోడు భూముల వివాదాన్ని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, చట్టబద్ధంగా గిరిజనులకు హక్కులు కల్పించే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నూకారపు రమేష్, అక్కి నరసింహారావు, ముద్దంగుల కృష్ణ, ఎస్‌కే మౌలానా, జావిద్ భాష, తురక రామకోటి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాస్, మోహన్‌రావు ఎన్నిక

### - ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని నూతన నాయకత్వం వెల్లడి.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఖమ్మం, జూలై 17 : తెలంగాణ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ ఆటో డ్రైవర్స్, ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా రావుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శిగా పేరబోయిన మోహన్‌రావు ఎన్నికయ్యారు. ఖమ్మంలోని మేకల భిక్షమయ్య ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన జిల్లా మహాసభలో 13 మంది కార్యవర్గ సభ్యులతో పాటు 51 మంది సభ్యులతో నూతన జిల్లా కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 500 మంది ప్రతినిధులు మహాసభకు హాజరయ్యారు. యూనియన్ గౌరవాధ్యక్షుడిగా పగడాల మల్లేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రావుల శ్రీనివాస్, కార్యదర్శి పేరబోయిన మోహన్‌రావు మాట్లాడుతూ ఆటో కార్మికులను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. మోటార్ వర్కర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ భరోసా పథకం కింద ప్రతి ఏడాది రూ.15 వేల ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో ఆటో కార్మికుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు చేపట్టి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు, నాణ్యమైన భోజనం అందించాలి

### - మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూలై 18 : నర్సాపూర్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ నర్సాపూర్ (జి), భైంసా మండలాల్లో పర్యటించారు. నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, కల్పిస్తున్న వసతులు, విద్యా బోధన, మొత్తం విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సంఖ్య, నేటి హాజరు, తదితర విషయాలను ఆరా తీశారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. రిజిస్టర్లన్నింటిని పకడ్బందీగా నమోదు చేయాలని చెప్పారు. ప్రతి రోజు విద్యార్థులు, ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా హాజరు అయ్యేలా చూడాలన్నారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, పాఠశాల ప్రాంగణ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సామూహిక మరుగుదొడ్ల సముదాయాన్ని పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్మాణాలకు సంబంధించి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత భైంసా మండలంలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టును కలెక్టర్ పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలు, ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు,



తదితర వివరాలను అధికారులను అడిగారు. త్రాగు నీటి సరఫరా కు సంబంధించి అంశాలను సమీక్షించారు. భవిష్యత్ ప్రణాళికల ప్రకారం నీటి నిర్వహణ ఉండాలని తెలిపారు. అనంతరం భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయంలో పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమాల్లో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఈఓ భోజన్న, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఆర్డబ్ల్యుఎస్, నీటిపారుదల శాఖల ఈఈలు సందీప్, అనిల్ తహసిల్దార్ లు శ్రీకాంత్, శశి భూషణ్, ఎంపీడీఓ పుష్పలత, ఎంపివో తిరుపతి రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# ఆదివాసీ మహిళల పట్ల ఫారెస్ట్ అధికారుల ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నాం

### - ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
### - బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. వెంకన్న నాయక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, జూలై 18 : అశ్వాపురం మండలం మనుబోతులపాడు గ్రామపంచాయతీ పరిధిలో ఆదివాసీ మహిళలతో ఫారెస్ట్ అధికారులు దురుసుగా ప్రవర్తించినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని భారతీయ జనతా పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి డా. వెంకన్న నాయక్ పేర్కొన్నారు. ఈ ఘటనపై వెంటనే నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివాసీ మహిళల గౌరవం, భద్రత, రాజ్యాంగబద్ధ హక్కులను దెబ్బతీసే విధంగా ఎవరూ వ్యవహరించరాదని అన్నారు. మహిళల పట్ల, ముఖ్యంగా ఆదివాసీ మహిళల పట్ల ప్రభుత్వ అధికారులు అత్యంత సున్నితంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించడం వారి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే వాస్తవాలను వెలికితీసేలా నిష్పక్షపాత విచారణ నిర్వహించి, అధికార దుర్వినియోగం జరిగినట్లు తేలితే సంబంధిత అధికారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వ యంత్రాంగంపైనే ప్రజల్లో భయాందోళనలు నెలకొనే పరిస్థితి రావడం విచారకరమని వ్యాఖ్యానించారు. ఆదివాసీల హక్కులు, మహిళల గౌరవ పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని పేర్కొన్న డా. వెంకన్న నాయక్, ఈ అంశాన్ని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు భారతీయ జనతా పార్టీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

# ప్రతివర్షపు నీటి బొట్టును కాపాడుకోవాలి

### - జిల్లా కలెక్టర్ కె.హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, జూలై 18: ప్రతి వర్షపు నీటి బొట్టును భూమిలోకి ఇంకించి కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి కార్యాలయ ఆవరణలోని ఖాళీ ప్రదేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ అంజయ్య లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని పలు రాష్ట్రాలు ఎల్ నినో ప్రభావం వల్ల సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో నోటు వర్షపాతం నమోదు కారణంగా భూమిలోని నీటిమట్టం మరింత క్రిందికి పోవడంతో భవిష్యత్తు తరాల వారు ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి వర్షపు నీటి బొట్టును ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకించి భూగర్భ జల మట్టాన్ని పెంపొందించాలని తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురవాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని, ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. వర్షపు నీటిని వృధాగా పోనివ్వకుండా భూమిలోకి ఇంకించడంతో పాటు నీటిని పొదుపుగా వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రియాజ్ అలీ, తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వట్టివాగు ప్రాజెక్ట్ ను పరిశీలించిన ఎమ్మెల్యే కోవలక్ష్మీ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూలై 18: మండలంలోని వట్టివాగు ప్రాజెక్టును శనివారం ఎమ్మెల్యే కోవలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వట్టివాగు కెనాల్ మరమ్మతుల పనులను త్వరగా పూర్తి చేసి వరి సాగు రైతులకు నీళ్లను అందించాలని అధికారులకు సూచించారు. వర్షపాత నమోదును దృష్టిలో ఉంచుకొని అధికారులు వ్యవహరించాలి అన్నారు. వట్టివాగు ప్రాజెక్టు సామర్థ్యం ఎంత అని, కాలువల పరిస్థితిని ఈ సందర్భంగా ఆమె సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన మండల సింగిల్ విండో చైర్మన్ సంజీవ్ అధికారులు పాల్గొన్నారు.




# ప్రైవేటీకరణ ప్రతిపాదనలను విరమించాలి

### - బీటీపీఎస్‌లో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నిరసన
### - యాజమాన్యం వైఖరి మారకపోతే ఉద్యమం ఉధృతం :: జేఏసీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, జూలై 18 : యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1, స్టేజ్-2లో యాష్ ప్లాంట్, కోల్ ప్లాంట్‌లను ప్రైవేటీకరించే ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం మణుగూరు బీటీపీఎస్ ప్రధాన గేటు ఎదుట ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. దశలవారీ ఆందోళనలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి, విద్యుత్ యాజమాన్యం అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ బీటీపీఎస్ ప్రాంతీయ కన్వీనర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రైవేటీకరణ నిర్ణయాలను ఉద్యోగులు ఐక్యంగా వ్యతిరేకించడం అభినందనీయమన్నారు. జెన్‌కో యాజమాన్యం కక్షసాధింపు ధోరణిని వీడి ఉద్యోగుల ఆందోళనను గౌరవించాలని కోరారు. యాజమాన్యం వైఖరిలో మార్పు రాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రైవేటీకరణ నిర్ణయాలను వెనక్కి తీసుకునే వరకు ఉద్యోగులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి బి. రవిప్రసాద్, తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ బ్రాంచ్ కార్యదర్శి నరేష్, నాయకులు మహేష్, కార్మిక సంఘం-1535 ప్రాంతీయ అధ్యక్షుడు వి. ప్రసాద్, కార్మిక సంఘం-1104 నాయకుడు ఎ. వెంకట్రాం, కార్మిక సంఘం-327 ప్రాంతీయ అధ్యక్షుడు బి. కృష్ణ, ఏఐటీయూసీ నాయకుడు శోభన్, ఎస్సీ--ఎస్టీ అసోసియేషన్ ప్రాంతీయ అధ్యక్షుడు వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన డీటీడీఓ అంబాజీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, జూలై 18: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా అంబాజీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హరిత ని మర్యాదపూర్వకంగా కలిసి, అనంతరం తన కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీఓ లు చిరంజీవి, భాస్కర్, శ్రీనివాస్, డీఎస్ఓ షేకు, జి సి డి ఓ శకుంతల, ఎస్సీ ఆర్ పి లు రవీందర్, అనంత్, తెలంగాణ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం (ఎౌఖ) నాయకులు అశోక్, రవీందర్, కృష్ణారావు, గోపాల్, మీనా రెడ్డి, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు నారాయణ, రామ్‌చందర్, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు సిబ్బంది అంబాజీ కి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ అంబాజీ మాట్లాడుతూ, గిరిజన సంక్షేమం, విద్యాభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు అందరి సహకారంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే అధికారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి గిరిజన విద్యను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.

# బాదనకుర్తి బ్రిడ్జి పైన ఢీకొన్న బస్సులు

### - వెనుక నుంచి బస్సును ఢీకొన్న కారు
### - బస్సు డ్రైవర్ తల కు ఇద్దరు మహిళలకు గాయాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఖానాపూర్, జులై 18 : ఖానాపూర్ నుండి మెట్పల్లి వైపు, మెట్పల్లి నుండి ఖానాపూర్ వైపు వస్తున్న రెండు బస్సులు బాధనకుర్తి బ్రిడ్జి పైన ఢీకొన్నాయి. ఢీకొని ఆగిపోయిన బస్సును వెనుక నుండి కారు ఢీకొట్టడంతో కారు ముందు భాగము ధ్వంసం అయింది. ఈ రోడ్డు ప్రమాదంలో బస్సు డ్రైవర్ మురళి తలకు, బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలకు గాయాలు అయినాయి. గాయపడిన వీరిని 108 సిబ్బంది కృష్ణ, అజార్ హుస్సేన్ లు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మల్లాపూర్ ఎస్ఐ తెలిపినారు.



# డిటిడిఓ గా అంబాజీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూలై 18: కొమురం భీం జిల్లా డిటిడిఓ (గిరిజన సంక్షేమ శాఖ)జిల్లా అధికారిగా జాదవ్ అంబాజీ బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ జిల్లాలో ఏ టీ డబ్ల్యు ఓ గా విధులు నిర్వహించి, పదోన్నతి పై కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా శనివారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 2012 నుండి 2014 వరకు ఈ ప్రాంతంలో విధులు నిర్వహించిన అనుభవం ఉన్నది అని తెలిపారు. ఇక్కడున్న సమస్యల పైన అవగాహన ఉన్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వైద్యం, మౌలిక సదుపాయాల పైన దృష్టి సారించి , ఏదైనా సమస్యలుంటే ఐటీడీఏ పీవో, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వారి సహకారంతో ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. గిరిజన విద్యార్థులకు శుద్ధ నీరు, మెనూ ప్రకారం భోజనం కల్పిస్తామన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను అధికంగాఉన్న ప్రాంతాల నుండి ఉపాధ్యాయులను ఖాళీగా ఉన్న చోటికి తరలిస్తామన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు అందించామన్నారు.

# పిల్లలను సెల్ ఫోన్ లకు దూరంగా ఉంచండి.

### ఎస్‌హెచ్‌ఓ బాలాజీ వరప్రసాద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, జూలై 18 : సెల్ ఫోన్‌ల నుండి, పిల్లలను దూరంగా ఉంచాలని ఆసిఫాబాద్ ఎస్ హెచ్ ఓ బాలాజీ వరప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పైకాజినగర్ కాలనీలోగలవేధ ప్లే స్కూల్ లో నిర్వహించిన 'ఎల్లో డే' కార్యక్రమానికి బాలాజీ వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ఫోన్ల నుండి పిల్లలను దూరంగా ఉంచడం వల్ల పిల్లలు శారీరకంగా మానసికంగా దృఢంగా తయారవుతారని ఆయన వివరించారు. సెల్ ఫోన్లు వాడటం వల్ల పిల్లల మెదడు పనిచేయడం లేదని, ఆలోచనరహితంగా తయారవుతున్నారని, చిన్నతనం నుండే ఆటపాటలతో విద్యాభ్యాసం చేయడం వల్ల శారీరకంగా మానసికంగా చురుగ్గా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. ముందుగా తల్లిదండ్రుల ముందు విద్యార్థులు ఆట,పాటలతో ప్రదర్శనలు నిర్వహించారు. చురుగ్గా ఉన్న విద్యార్థులకు సీఐ సిబ్బంది బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆర్ మల్లికార్జున్ సిబ్బంది పాల్గొన్నారు.

# నీట్‌లో భద్రాద్రి విద్యార్థిని నైషా ప్రతిభ

### - 23 లక్షల మంది అభ్యర్థుల్లో ఆల్ ఇండియా 8182వ ర్యాంకు
### - 720కి 606 మార్కులతో మెరిసిన కొత్తగూడెం విద్యార్థిని

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, జూలై 18 : తాజాగా ప్రకటించిన నీట్-యూజీ ఆల్ ఇండియా మెడికల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంకు చెందిన విద్యార్థిని నైషా విశేష ప్రతిభ కనబరిచింది. 720 మార్కులకు గాను 606 మార్కులు సాధించి ఆల్ ఇండియా స్థాయిలో 8182వ ర్యాంకు దక్కించుకుంది. దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరుకాగా, నైషా అత్యుత్తమ ర్యాంకు సాధించి జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చింది. నైషా కొత్తగూడెంకు చెందిన వైద్య దంపతులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సిరిల కుమార్తె. ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఉపేందర్‌రావు మనవరాలు. ఆమె సాధించిన విజయంపై కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, వైద్యులు, ఉపాధ్యా యులు, పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేశారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# 33 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కే శ్రీహరి రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



నిర్మల్, జూన్ 18 : సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంలా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి కూచాడి శ్రీహరి రావు అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో నిర్మల్ నియోజకవర్గానికి చెందిన 33 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.11 లక్షల 80 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీహరి రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూనే, పేదలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు సీఎంఆర్ఎఫ్ ద్వారా సకాలంలో ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.

# బాసర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభం...

### - 2,500 ఎకరాలకు సాగునీరు...
### - రైతులకు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ శుభవార్త

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



నిర్మల్, జూన్ 18 : బాసర మండలంలోని స్వల్ప వర్షాలతో సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న రైతులకు బాసర లిఫ్ట్ ఇరిగేషన్‌ను ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా బాసర పరిసర ప్రాంతాల్లో 2,500 ఎకరాలకు పైగా సాగుభూమికి నీరందుతుందని తెలిపారు. దీంతో రైతులు పంటల సాగును సకాలంలో చేపట్టే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

**బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ నిర్మాణ పనుల పరిశీలన...**

బాసరలో శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# తానూర్ కేజీబీవీలో అదనపు తరగతి గదులు ప్రారంభోత్సవం

### ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



నిర్మల్, జూన్ 18 : తానూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో నాబార్డ్ నిధులతో నిర్మించిన మొదటి అంతస్తులోని అదనపు తరగతి గదులు మరియు అదనపు మౌలిక సదుపాయాలను ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.56 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులను, అలాగే రూ.42.12 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అదనపు మౌలిక సదుపాయాలను ప్రారంభించారు. విద్యార్థినులకు యూనిఫామ్ పంపిణీ చేశారు, విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఈ అభివృద్ధి పనులు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.






# పోస్టర్‌కే ఈ రేంజ్ క్రేజ్... 'ఫౌజీ'పై క్యూరియాసిటీ ఎందుకు ?

రెబెల్ స్టార్ ప్రభాస్, దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఫౌజీ' ఇటీవల విడుదలైన ఈ సినిమా రిలీజ్ డేట్ పోస్టర్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ పోస్టర్ కేవలం లైకులు సాధించలేదు, ఇన్‌స్టాగ్రామ్‌లో 24 గంటల్లో ఏకంగా 5.33 లక్షల మంది దీన్ని షేర్ చేశారంటే క్రేజ్ ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు. పూర్తిగా భిన్నమైన రెండు ఇమేజ్‌లు ఉన్న కాంబో కలిసినప్పుడు మార్కెట్లో ఎలాంటి క్యూరియాసిటీ పుడుతుందో చెప్పడానికి ఈ క్రేజే ఒక నిదర్శనం. ఆ విశేషాలు చూద్దాం. ఈ సినిమాపై ఇంతటి భారీ హైప్ రావడానికి ప్రధాన కారణం దర్శకుడు, హీరోల జోనర్లే. హను రాఘవపూడి అనగానే మనకు గుండెను పిండేసే క్లాస్ లవ్ స్టోరీస్, సీతా రామం,అందాల రాక్షసి లాంటి సున్నితమైన ఎమోషనల్ డ్రామాలు గుర్తొస్తాయి. మరోవైపు ప్రభాస్ అంటేబాక్సాఫీస్‌ను షేక్ చేసే భారీ మాస్ ఇమేజ్, కటౌట్ గుర్తొస్తాయి. క్లాస్ ఎమోషన్స్ రాసే దర్శకుడు.. మాస్ రేంజ్ ఉన్న హీరోతో సినిమా చేస్తుండటంతో ఈ రెండు భిన్నమైన శైలుల కలయిక వెండితెరపై ఎలాంటి వండర్స్ సృష్టించబోతోందో అనే కుతూహలం అందరిలోనూ మొదలైంది.

సాధారణంగా ప్రభాస్ సినిమా అనగానే భారీ ఫైట్లు, యాక్షన్ సీక్వెన్సులు ఆశిస్తారు. కానీ హను రాఘవపూడి సినిమా కాబట్టి ఇందులో ప్రేమకథకు, దేశభక్తి ఎమోషన్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక ఈ రెండు ఎలిమెంట్స్ ప్రభాస్ మాస్ ఇమేజ్‌కు తోడైతే సినిమా జోనర్ ఏ రేంజ్‌లో ఉండబోతోంది అనే సస్పెన్స్ ప్రేక్షకుల్లో క్రియేట్ అయింది. ఈ క్యూరియాసిటీనే పోస్టర్ షేరింగ్స్ రూపంలో రికార్డులు సృష్టిస్తోంది. ఒక పోస్టర్ నచ్చితే లైక్ కొట్టడం కామన్. కానీ 24 గంటల్లో 5.33 లక్షల మంది ఇన్‌స్టాగ్రామ్‌లో దీన్ని షేర్ చేయడం అనేది ఇండియన్ సినిమా హిస్టరీలోనే ఒక అరుదైన రికార్డు. కేవలం అభిమానులే కాకుండా, సామాన్య సినీ ప్రేమికులు సైతం ఈ ఆర్ట్‌వర్క్‌ను తమ స్టేటస్‌లుగా పెట్టుకుంటున్నారు. ఇక మైత్రీ మూవీ మేకర్స్ ఎక్కడా బడ్జెట్ విషయంలో కాంప్రమైజ్ కాకుండా ఈ పీరియాడిక్ డ్రామాను నిర్మిస్తుండటం సినిమా రేంజ్‌ను మరో మెట్టు ఎక్కించింది. కేవలం ఒకే ఒక్క పోస్టర్‌తో దేశవ్యాప్తంగా ఇంతటి క్యూరియాసిటీని రేకెత్తించడం 'ఫౌజీ' టీమ్‌కే సాధ్యమైంది. హను రాఘవపూడి క్లాస్ మేకింగ్, ప్రభాస్ గ్లోబల్ మాస్ అప్పీల్ కలిసి ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త వండర్స్ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ విభిన్నమైన కాంబినేషన్ తెచ్చిన హైప్, డిసెంబర్ 3న థియేటర్లలో ప్రేక్షకులకు ఎలాంటి సరికొత్త అనుభూతిని ఇస్తుందో చూడాలి..






# బ్యూటీ కాదు... సెల్ఫ్ రెస్పెక్ట్ ముఖ్యం! ఆ హీరోయిన్ స్ట్రాంగ్ మెసేజ్

సినీ పరిశ్రమలో హీరోయిన్లపై ఉండే ఒత్తిడి గురించి నటి సమీరా రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు సమాజంలో ఒక కొత్త చర్చకు దారితీశాయి. కెరీర్ ప్రారంభంలో ఇండస్ట్రీ సృష్టించిన ఇన్సెక్యూరిటీ నుండి బయటపడటానికి, తనను తాను పూర్తిగా అంగీకరించడానికి ఆమెకు 40 ఏళ్ల వయసు దాటాల్సి వచ్చింది. 20 ఏళ్ల వయసులో సమాజం, కెరీర్ పెట్టే కృత్రిమ అందాల ఒత్తిళ్లకు లొంగిపోయే మహిళలు.. వయసు పెరిగే కొద్దీ మానసికంగా ఎంత స్ట్రాంగ్ అవుతారో చెప్పడానికి సమీరా జీవితమే ఒక పెద్ద ఉదాహరణ. బాహ్య సౌందర్యం కంటే 'ఆత్మగౌరవం' ముఖ్యమనే స్వేచ్ఛను సాధించడంలో వయసు ఒక ఆయుధంగా ఎలా మారుతుందో ఆమె మాటలు ద్వార తెలుస్తుంది.

సమీరా రెడ్డి తన తొలి చిత్రం 'మైనే దిల్ తుజ్కో దియా' రోజులను గుర్తు చేసుకుంటూ.. తన సహజ రూపాన్ని మార్చడానికి ఇండస్ట్రీ ఎంత ఒత్తిడి తెచ్చిందో ఆవేదన వ్యక్తం చేశారు. మేకప్ ద్వారా ఆమె రంగును రెండు మూడు షేడ్స్ తెల్లగా మార్చేవారట. అంతేకాదు, తోటి హీరోల కంటే తాను పొడవుగా కనిపిస్తానేమో అని భయంతో నడుస్తున్నప్పుడు వంగి నడిచేదాన్ని అని ఆమె చెప్పారు. ఇక హీరో ఆధిపత్యం కోసం ఒక నటి తన సహజత్వాన్ని ఎంతగా చంపుకోవాల్సి వస్తుందో ఈ విషయాలు నిరూపిస్తున్నాయి. తన సహజ రూపం ఇండస్ట్రీకి సరిపోదనే అభద్రతాభావంతో సమీరా రెడ్డి ఏళ్ల తరబడి ప్యాడెడ్ బ్రాలు, బమ్ ప్యాడ్స్, రంగురంగుల కాంటాక్ట్ లెన్స్‌లు వాడాల్సి వచ్చింది. బరువు తగ్గిన తర్వాత కూడా నీ శరీరం సరిగ్గా లేదంటూ కాస్ట్యూమ్ డిజైనర్లు, మహిళా అసిస్టెంట్ డైరెక్టర్లు కూడా కామెంట్లు చేసేవారట. ఇక 20 ఏళ్ల వయసులో ఉండే అమాయకత్వం, కెరీర్ లో నిలదొక్కుకోవాలనే ఆరాటం వల్ల మహిళలు ఇలాంటి అవాస్తవిక బ్యూటీ స్టాండర్డ్స్ బందీలుగా మారిపోతుంటారు. సమీరా చాల కాలం దాదాపు 14 ఏళ్ల తర్వాత 'ఆఖరి సవాల్' చిత్రంతో హిందీ సినిమాలోకి రి ఎంట్రీ ఇవ్వనుంది. ఇక ఇప్పుడు తన 40ల వయసులోకి వచ్చాకే ఈ ఇన్–సెక్యూరిటీస్ నుండి బయటపడ్డానని స్పష్టం చేశారు. వయసు పెరగడం అనేది మహిళలకు కేవలం శారీరక మార్పు కాదు, అది ఒక మానసిక ఆయుధం. 40లలోకి అడుగుపెట్టాక సమాజం ఏమనుకుంటుందో అనే భయం పోయి, 'నేను ఎలా ఉంటే అలాగే ఉంటాను' అనే సెల్ఫ్ రెస్పెక్ట్, స్వేచ్ఛ మహిళల్లో పెరుగుతాయి. సమీరా రెడ్డి పంచుకున్న నిజాలు కేవలం సినిమా రంగానికే కాదు, సమాజంలోని ప్రతి మహిళకు వర్తిస్తాయి. రంగు, రూపు, పొడవుల కంటే కూడా తనను తాను ప్రేమించుకోవడం, ఆత్మగౌరవంతో బతకడం ముఖ్యం అనే స్ట్రాంగ్ మెసేజ్ ఆమె ఇచ్చారు. ఇక బాహ్య సౌందర్యం కోసం ఇతరుల అంచనాలకు లొంగిపోకుండా, మనసుకు నచ్చినట్టు స్వేచ్ఛగా బతికినప్పుడే మహిళలకు నిజమైన సాధికారత లభిస్తుంది అన్నది విశ్లేషకులు అభిప్రాయం.

# హిట్ కోసం రెండేళ్లు వెయిటింగ్.. ఇప్పుడు క్యూ కడుతున్నారా?

సినీ ఇండస్ట్రీలో టాలెంట్ ఒక్కటే సరిపోదు. దానికి తోడు సరైన విజయం అవసరమే. కొంతమందికి తొలి సినిమాతోనే స్టార్ డమ్ వస్తే, మరికొందరు హిట్ కోసం చాలా కాలం ఎదురుచూడాల్సి వస్తుంది. హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే జర్నీ దాదాపు అలాంటిదే. వరుస అవకాశాలు వచ్చినా, సరైన కమర్షియల్ సక్సెస్ మాత్రం దూరంగానే నిలిచింది. అయితే తాజాగా వచ్చిన లెనిన్ ఆమెకు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రిలీఫ్ ఇచ్చినట్లు కనిపిస్తోంది.

రవితేజ సరసన మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన భాగ్యశ్రీ, తొలి చిత్రంతోనే తన అందం, స్క్రీన్ ప్రెజెన్స్ తో ఆకట్టుకుంది. సినిమా ఆశించిన రిజల్ట్ అందుకోకపోయినా, ఆమెకు మాత్రం మంచి గుర్తింపు వచ్చింది. దీంతో టాలీవుడ్ లో వరుస అవకాశాలు దక్కాయి. ఆ తర్వాత కింగ్‌డ మ్, కాంతా, ఆంధ్ర కింగ్ తాలూకా వంటి ప్రాజెక్టుల్లో నటించినా, ఆ సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాలు సాధించలేకపోయాయి.



సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో హీరోయిన్ల కెరీర్ పై ఎఫెక్ట్ పడుతుంది. కానీ భాగ్యశ్రీ విషయంలో పరిస్థితి భిన్నంగా కనిపించింది. వరుస రిజల్ట్స్ అనుకూలంగా రాకపోయినా, దర్శక నిర్మాతలు ఆమెకు అవకాశాలు ఇస్తూనే వచ్చారు. దీనికి ప్రధాన కారణం ఆమెపై ఉన్న నమ్మకమేనని టాక్ వినిపిస్తోంది. తెరపై ఆమె కనిపించే తీరు, పాత్రలకు సరిపోయే లుక్, నటనలో చూపిస్తున్న డెవలప్మెంట్ వంటి అంశాలు ఆమెకు ప్లస్ అయ్యాయని అంటున్నారు. అందుకే సినిమాల రిజల్ట్స్ తో సంబంధం లేకుండా కొత్త ప్రాజెక్టుల్లో ఆమె పేరు వినిపిస్తూనే వచ్చింది. ఇలాంటి సమయంలో విడుదలైన లెనిన్ సినిమా భాగ్యశ్రీ కెరీర్ లో కీలక మలుపుగా మారింది. ఆ చిత్రంలో ఆమె నటనకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ లభించింది. ముఖ్యంగా సోషల్ మీడియాలో కూడా ఆమె పాత్ర గురించి పాజిటివ్ చర్చ సాగుతోంది. దీంతో కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటిగా కూడా తన స్టామినా నిరూపించుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఆమె చేతిలో పలు చిత్రాలు ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా యంగ్ హీరోలు, మీడియం రేంజ్ చిత్రాల దర్శక నిర్మాతలు భాగ్యశ్రీని తమ ప్రాజెక్టులకు పరిశీలిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. రెండేళ్లుగా సరైన హిట్ కోసం ఎదురుచూసిన హీరోయిన్ కు వరుస ఛాన్సులు వస్తున్నాయట. మరోవైపు శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కుతున్న సేయోన్ చిత్రంతో భాగ్యశ్రీ కోలీవుడ్ లోకి అడుగుపెడుతోంది. తెలుగు సినిమాలే తన ఫస్ట్ ప్రిఫరెన్స్ అయినప్పటికీ, ఇతర భాషల్లోనూ అవకాశాలు రావడం ఆమె కెరీర్ కు మరింత బలం చేకూర్చే అవకాశం ఉందని చెప్పాలి. ఏదేమైనా హిట్ కోసం రెండేళ్లుగా ఎదురుచూసిన భాగ్యశ్రీకి లెనిన్ విజయం కొత్త జోష్ ఇచ్చినట్లు కనిపిస్తోంది. వరుస ఫ్లాపుల మధ్య అవకాశాలు కోల్పోకుండా ముందుకు సాగిన ఆమెకు, లెనిన్ మూవీ కెరీర్ లో టర్నింగ్ పాయింట్ గా మారుతుందా లేదా అన్నది రాబోయే చిత్రాల రిజల్ట్స్ పై ఆధారపడి ఉంటుంది. అయితే ప్రస్తుతం మాత్రం టాలీవుడ్ లో ఆమె పేరు మళ్లీ గట్టిగానే వినిపిస్తోంది.

# ఆరోగ్యం

## షుగర్ వ్యాధిలో కొత్త రకం..భయాందోళనలు పుట్టిస్తున్న





షుగర్ వ్యాధి లేదా డయాబెటిస్ పేరు వింటేనే చాలామంది హడలెత్తిపోతారు. మనదేశంలో కోట్ల మందిని వేధిస్తున్న సమస్య ఇది. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువమంది షుగర్ వ్యాధిగ్రస్థులు ఉన్నది కూడా మన దేశంలోనే. అందుకే మనదేశాన్ని వరల్డ్ డయాబెటిస్ రాజధాని అని కూడా పిలుస్తుంటారు. అయితే ఇప్పటిదాకా మనకు తెలిసిన డయాబెటిస్ లేదా మధుమేహం రెండు రకాలు మాత్రమే. టైప్ 1 డయాబెటిస్, టైప్ 2 డయాబెటిస్ గురించి మాత్రమే ఇప్పటిదాకా సామాన్య జనానికి తెలిసేది. అయితే టైప్ 5 డయాబెటిస్ ఇప్పుడు కొత్తగా తెరపైకి వచ్చింది. పోషకాహార లోపం ఉన్న టీనేజర్లు, యువకులను ఎక్కువగా బాధిస్తున్న ఓ కొత్త రకం డయాబెటిస్ ను సైంటిస్టులు గుర్తించారు. ఏప్రిల్ 7,2025 నుంచి ఏప్రిల్ 10 వరకు థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్ లో నిర్వహించిన వరల్డ్ డయాబెటిస్ కాంగ్రెస్ 2025 వేదికగా ఇంటర్నేషన్ డయాబెటిస్ ఫెడరేషన్ దీనిని అధికారికంగా టైప్ 5 డయాబెటిస్ గా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు 2.5 కోట్ల మందికి టైప్ 5 డయాబెటిస్ బారిన పడ్డారని అంచనా. వీరిలో ఎక్కువగా ఆసియా,ఆఫ్రికా దేశాలకు చెందినవాళ్లే ఉన్నట్లు అంచనా. ఆశ్చర్యకరంగా..చాలామందికి ఇన్సులిన్ కూడా అసరం లేకుండా ఉంది. వాస్తవానికి టైప్ 1 డయాబెటిస్ లో ఇంజెక్షన్లు తప్పనిసరి కానీ దీని పరిస్థితి వేరుగా ఉంది.

ఈ రకమైన డయాబెటిస్ ఆసియా, ఆఫ్రికా దేశాల్లో ఎప్పటినుంచో ఉన్నప్పటికీ సరైన అవగాహన లేక చాలామంది దీన్ని టైప్ 1 లేదా టైప్ 2 డయాబెటిస్ గా పొరబడ్డారు. అయితే ఇప్పుడు డాక్టర్ మెరెడిత్ హాక్సిన్ నేతృత్వంలోని పరిశోధనలు ఈ వ్యాధికి ప్రత్యేక గుర్తింపుని తీసుకొచ్చింది. టైప్ 5 డయాబెటిస్ అంటే ఏమిటి? సాధారణంగా దీనిని పోషకాహార లోపం సంబంధిత డయాబెటిస్ అని కూడా అంటారు. చిన్న వయస్సులో సరైన పోషహాకారం అందని బలహీనంగా ఉండే వ్యక్తు..టైప్ 2 డయాబెటిస్ ఊబకాయం,ఇన్సులిన్ నిరోధకతతో ముడిపడి ఉండగా..టైప్ 5 డయాబెటిస్ మాత్రం పోషకాహారం సరిగ్గా లేకపోవడం వల్ల క్లోమం సరిగ్గా డెవలప్ అవకపోవడం వల్ల వస్తుంది. టైప్ 5 డయాబెటిస్ ఉన్నోళ్లలో ఇన్సులిన్ ఉత్పత్తి తక్కువ ఉంటుంది..అయితే టైప్ 2 డయాబెటిస్ వాళ్లలో ఉండే మాదిరి శరీరం ప్రతిస్పందించకపోవడంలా ఉండదు. అందుకే టైప్ 5 డయాబెటిస్ ఉన్నోళ్లకి ఇన్సులిన్ ఇంజెక్షన్లు అక్కర్లుదు. కేవలం నోటి మెడిసిన్ తోనే దీన్ని కంట్రోల్ చేయవచ్చు.

## మహారాష్ట్ర స్పెషల్ కంద పోహా..

మహారాష్ట్రలో చాలామంది పొద్దున్నే బ్రేక్ ఫాస్ట్ లోకి కంద పోహా తింటుంటారు. దీనిని అటుకుల ఉప్మా అని మన దగ్గర అంటుంటారు. దీనిని బ్రేక్ ఫాస్ట్ గా,డిన్నర్ గా లేదా స్నాక్ గా ఎలా అయినా తినొచ్చు. పిల్లల నుంచి వృద్ధుల వరకు అన్ని వయస్సుల వారికి నచ్చే వంటకం ఇది. ఒక్కసారి టేస్ట్ చేశారంటే మాత్రం మళ్లీ మళ్లీ చేసిపెట్టాలని ఇంట్లోవాళ్లని సతాయించడం గ్యారెంటీ. మహారాష్ట్ర స్పెషల్ కంద పోహాని ఇంట్లో ఎలా తయారుచేసుకోవాలి, దీని తయారీకి ఏమేం పదార్థాలు కావాలో ఇప్పుడు చూద్దాం.

కంద పోహా తయారీకి కావలసిన పదార్థాలు -అటుకులు -బంగాళదుంప -పల్లీలు -ఆయిల్ -నిమ్మరసం -పచ్చిమిర్చి తరుగు -ఉల్లిపాయ తరుగు -కరివేపాకు -కొత్తిమీర తరుగు.

-ఆవాలు -జీలకర్ర -ఇంగువ -పసుపు -ఉప్పు -చక్కెర.

కంద పోహా తయారీ విధానం -ముందుగా 2 కప్పుల అటుకులని జల్లెడలో వేసి బాగా జల్లించుకోవాలి. -తర్వాత అటుకులలో 300 %ఎత్రీ% నీళ్లు పోసి ప్రతి అటుకు తడిచేలా బాగా కలిపి పావుగంటసేపు పక్కన పెట్టుకోండి. ఎక్కువ నీళ్లు పోశారంటే ముద్ద అయిపోతుంది. -తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టి అందులో 3 టేబుల్ స్పూన్ ఆయిల్ పోసి వేడి చెయ్యండి. -ఆయిల్ వేడెక్కిన తర్వాత అందులో పావు కప్పు పల్లీలు వేసి తక్కువ మంట మీద ఎర్రగా వేపుకోవాలి. వేగిన పల్లీలను ఓ ప్లేట్ లోకి తీసి పక్కనపెట్టుకోండి.

-తర్వాత అదే నూనెలో 1 టీస్పూన్ ఆవాలు వేసి చిటపటలాడేదాకా వేగాక అందులో 1 టీస్పూన్ జీలకర్ర, 2 పచ్చిమిర్చి సన్నని తరుగు,రెండు చిటికెళ్ల ఇంగువ,2 రెమ్మల కరివేపాకు వేసి వేపుకోవాలి.





-తర్వాత అందులో రెండు ఉల్లిపాయల సన్నని తరుగు వేసి 2 నిమిషాలు వేపుకోవాలి. ఉల్లిపాయలు మరీ మెత్తబడేదాకా వేపకూడదు. -తర్వాత అందులో చెక్కు తీసి చిన్నగా కట్ చేసిన 1 బంగాళదుంప ముక్కలు, చిటికెడు పసుపు, సరిపడా ఉప్పు, ముప్పావు టీస్పూన్ చక్కెర వేసి బంగాళదుంప ముక్కల్లో పచ్చివాసన పోయేదాకా వేపుకోవాలి. -తర్వాత అందులో 3 టేబుల్ స్పూన్ల నీళ్లు పోసి బాగా కలిపి మూతపెట్టి మీడిమం మంటమీద మగ్గనివ్వాలి. దీనికి 7-8 నిమిషాల సమయం పడుతుంది.

-తర్వాత అందులో తడిపి ఉంచుకున్న అటుకులు వేసి మొత్తం కలిసేలా కలుపుకోవాలి. -తర్వాత పాన్ అంచుల వెంట 3 టేబుల్ స్పూన్ల నీళ్లు పోసి కదపకుండా మూతపెట్టి మీడిమం మంటమీద 5-6 నిమిషాలు అలా వదిలేయండి. -తర్వాత స్టవ్ ఆపేసి అందులో వేయించుకున్న పల్లీలు, కొత్తిమీర తరుగు, నిమ్మరసం పిండి బాగా కలపండి. అంతే కంద పోహా రెడీ.




## కూరగాయలే అవసరం లేని రాయలసీమ స్పెషల్ ఎండుమిర్చి పప్పు..





రాయలసీమ అంటే చాలామందికి అక్కడివాళ్లు చేసే మర్యాదలు, ఫ్యాక్షన్ వంటివి మనసులో మెదలుతూ ఉంటాయి. ఇప్పుడైతే అక్కడ ఫ్యాక్షన్ కనుమరుగైందని చెప్పొచ్చు. రాయలసీమ అంటే వంటలకు కూడా చాలా చాలా ఫేమస్. రాయలసీమలో పుట్టినవాళ్లకి మిగతా ప్రాంతం వాళ్లకన్నా కొంచెం ఎక్కువగానే పౌరుషం ఉంటుందని సహజంగా అంటుంటారు. అయితే చాలామంది సీమ ప్రజలు దీనికి తాము తినే ఫుడ్ కారణమని కూడా చెబుతుంటారు. రాయలసీమలో చాలామంది తరుచుగా తినే ఎండుమిర్చి పప్పు మీరెప్పుడైనా తిన్నారా? తినకపోతే ఖచ్చితంగా ట్రై చేసి తీరాల్సిందే. అన్నం లేదా జొన్న రొట్టెలలో రాయలసీమ స్టైల్ లో తయారుచేసే ఎండుమిర్చి పప్పుని కలుపుకుని తింటుంటే స్వర్గమే. రాయలసీమ స్పెషల్ ఎండుమిర్చి పప్పు ఇంట్లోనే తయారుచేసుకోడానికి కావలసిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

ఎండుమిర్చి పప్పు తయారీకి కావలసిన పదార్థాలు -ఆయిల్ -కందిపప్పు -చింతపండు -ఉల్లిపాయ -ఎండుమిర్చి -ఆవాలు -ధనియాలు -వెల్లుల్లి -శెనగపప్పు -మినపప్పు -జీలకర్ర -పసుపు -చింతపండు -కరివేపాకు -కొత్తిమీర.

ఎండుమిర్చి పప్పు తయారీ విధానం -ముందుగా కుక్కర్ 1 టేబుల్ స్పూన్ ఆయిల్ వేడి చేసి అందులో అరకప్పు కండిపప్పు వేసి మంచి సువాసన వచ్చేదాకా వేయించండి. -తర్వాత అందులో 1 ఉల్లిపాయ తరుగు, అర టీస్పూన్ జీలకర్ర, పావు టీస్పూన్ పసుపు, కొద్దిగా చింతపండు, 10-12 కారంగా ఉండే ఎండుమిర్చి ముక్కలు వేసి వేయించండి.

-కొద్దిగా ఉల్లిపాయలు,ఎండుమిర్చి వేగినత తర్వాత అందులో రెండున్నర కప్పుల నీళ్లు పోసి మూతపెట్టి మీడియం మంటమీద 5 విజిల్స్ వచ్చేదాకా ఆగండి. -తర్వాత మూతతీసి దానిని పప్పు గుత్తితో మెత్తగా మాష్ చేయాలి. -తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి అందులో 2 టేబుల్ స్పూన్ల నెయ్యి లేదా నూనె వేడి చేసి అందులో పావు చెంచా మెంతులు వేసి ఎర్రగా వేయించాలి. -మెంతులు వేగి తర్వాత అందులో అర టీస్పూన్ ఆవాలు, అర టీస్పూన్ నలిపిన ధనియాలు, 5 కచ్చిపచ్చిగా దంచిన వెల్లుల్లి, 1 టీస్పూన్ శెనగపప్పు, 1 టీస్పూన్ మినపప్పు, అర టీస్పూన్ జీలకర్ర, 1 రెబ్బ కరివేపాకు వేసి తాళింపు ఎర్రగా వేపుకోవాలి. -తర్వాత మెత్తగా మాష్ చేసిన పప్పుని తాళింపు బాండీలో వేసుకొని,ఇందులోని రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలపండి. -తర్వాత కొద్దిగా కొత్తిమీర చల్లి దించుకోవడమే. అంతే ఎండుమిర్చి పప్పు రెడీ. పప్పు మరీ గట్టిగా అనిపిస్తే కొంచెం వేడి నీళ్లు కలుపుకోండి.

## అలేఖ్య చిట్టి పికిల్స్ చికెన్ పచ్చడి ఎలా చేసుకోవాలో తెలుసా?



చికెన్ పచ్చడి తయారీకి కావాల్సిన పదార్థాలు బోన్‌లెస్ చికెన్ - 1 కేజీ నూనె - 1/2 కేజీ అల్లం వెల్లుల్లి పేస్ట్ - 5 టేబుల్ స్పూన్లు ఉప్పు - 50 గ్రాములు పసుపు - 1 టీ స్పూన్ కారం - 50 గ్రాములు (లేదా మీ రుచికి తగినంత) మెంతి పొడి - 1 టేబుల్ స్పూన్ ఆవాల పొడి - 2 టేబుల్ స్పూన్లు నిమ్మరసం - 3 టేబుల్ స్పూన్లు వెల్లుల్లి రెబ్బలు - 8-10 (చిన్నగా కట్ చేసుకోవాలి) కరివేపాకు - కొద్దిగా ఆవాలు - 1 టీ స్పూన్

చికెన్ పచ్చడి తయారీ విధానం: చికెన్ పచ్చడి తయారీకి ముందుగా మంచి, బోన్ లెస్ చికెన్ తీసుకోవాలి. ఈ చికెన్‌ను శుభ్రంగా కడుక్కొని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ముక్కలన్నీ సమాంతరంగా ఉండేలా చేసుకోవాలి. అలాంటప్పుడే చికెన్ పచ్చడి తయారైన తరువాత ముక్కలు సరిగ్గా దంతాల కింద తగులుతాయి. అలాగే తిన్న ఫీలింగ్ కలుగుతుంది.

ఇప్పుడు ఒక గిన్నె తీసుకొని చిన్న చిన్నగా కట్ చేసుకున్న చికెన్ ముక్కలను అందులో వేసుకోవాలి. ఇప్పుడు అందులో ఉప్పు, పసుపు వేసుకొని బాగా కలుపుకొని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక మందపాటి కడాయి తీసుకొని అందులో చికెన్ వేపుకోవడానికి సరిపడా నూనె పోసుకోవాలి. నూనె బాగా వేడయ్యాక.. అందులో చికెన్ ముక్కలను వేసుకొని వేయించుకోవాలి. ఆ చికెన్ ముక్కలు దోరగా, క్రిస్పీగా ఉండే విధంగా వేయించుకోవాలి.

ఇప్పుడు అదే నూనెలో ఆవాలు వేసుకోవాలి. ఆవాలు చిటపటలాడిన తరువాత అందులో కరివేపాకు, వెల్లుల్లి రెబ్బలు వేసుకోవాలి. ఆ తరువాత అల్లం పేస్ట్ వేసుకొని, అది పచ్చి వాసన పోయే వరకు బాగా వేయించుకోవాలి.

ఇప్పుడు అందులో ఫ్రై చేసి పెట్టుకున్న చికెన్ ముక్కలను వేసుకోవాలి. అలాగే ఇప్పుడు దానిపై ఉప్పు, కారం, మెంతుల పొడి, ఆవాల పొడి వేసుకొని బాగా కలుపుకోవాలి. ఆ మసాలాలు అంతా చికెన్‌కు పట్టుకునే విధంగా బాగా కలుపుకుంటూ ఉండాలి. ఆ తరువాత దానిపై ఒక నిమ్మకాయను కోసి దాని రసాన్ని పోసుకోవాలి. ఇప్పుడు మరోసారి బాగా కలిపి గ్యాస్ ఆఫ్ చేసుకొని పచ్చడిని కిందకు దించుకోవాలి. పచ్చడి పూర్తిగా చల్లారిన తరువాత దానిని ఒక సీసాలో నిల్వ చేసుకోవాలి. అంతే ఎంత రుచికరమైన అలేఖ్య చిట్టి పికిల్స్ ఫేమస్.. చికెన్ పచ్చడి సిద్ధమైనట్లే. ఈ స్టోరీలో మేము ఎవరినీ కించపరచడం లేదు. కేవలం వినోదం కోసం, మరియు మీకు చికెన్ పచ్చడిని ఎలా చేసుకోవాలి అనేది వివరించాము అంతే. ఇది కేవలం ఎడ్యుకేషన్ పర్పస్ కోసం మాత్రమే. ఎవరినీ కించపరిచేందుకు కాదు.

# అబద్ధాలు ప్రచారం చేసేవారికి సోషల్ మీడియాలో చోటు

మొదటిపేజీ తరువాయి

ముఖాముఖి సమీక్షా సమావేశాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించింది. ప్రత్యేక సమావేశంలో కమిటీ సభ్యులు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోతె శోభన్ రెడ్డి, ప్రొఫెసర్ ఎమ్.కోదండరామ్, అద్దంకి దయాకర్, ఎస్.రాములు నాయక్ తదితరులు హాజరై, మలిదశ ఉద్యమంలో తమ ఆట పాటలతో ప్రాణవాయువు ఊదిన సాంస్కృతిక పోరాట యోధుల నుండి సలహాలను, సూచనలు నేరుగా స్వీకరించారు. ఈ సందర్భంగా మోతె శోభన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాల తీరుపై, సోషల్ మీడియా ప్రచారాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వాళ్ళ పొద్దున లేస్తే అబద్ధాలు చెప్పే బావమరుదుల మాటలు, వారి అసత్య ప్రచారాలు ఇన్‌స్టాగ్రామ్‌లలో, వాట్సాప్‌లలో గిన్నిస్ బుక్ రికార్డుల రేంజ్‌లో హల్‌చల్ చేస్తుంటాయి. కానీ ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న రేవంత్ రెడ్డి చేస్తున్న చారిత్రాత్మక పనుల గురించి ఆ సోషల్ మీడియా మాధ్యమాల్లో రాదు. మా ముఖ్యమంత్రి పబ్లిసిటీ సీఎం కాదు.. క్షేత్రస్థాయిలో ప్రజల కోసం ప్రాణాలు పెట్టి పనిచేసే సీఎం! ఆయన నాయకత్వంలో మా ప్రభుత్వం సాధించిన విజయాలు సామాన్యమైనవి కావన్నారు. అవన్నీ కంటికి కనిపిస్తున్న నిజాలు. మా ప్రభుత్వం మరియు సీఎం గారు కవులు, కళాకారుల భవిష్యత్తును పూర్తి బాధ్యతతో చూసుకుంటారు. మీ ఆత్మగౌరవాన్ని కాపాడే బాధ్యత మాది. మీరంతా ఈ అద్భుతమైన ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను, నిజాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలన్నారు. సాంస్కృతిక శాఖలో ఉద్యోగాలు: ఎలాంటి సిఫార్సులు, రాజకీయ రికమండేషన్లు లేకుండా, కేవలం అర్హత, ప్రతిభ ఆధారంగానే నిజమైన కళాకారులను సాంస్కృతిక శాఖలోని ఉద్యోగాలకు ఎంపిక చేయాలని ఇకళాకారులు కోరారు. ఉద్యమ కళాకారులఆవేదనను విన్నకమిటీ సభ్యులు స్పందిస్తూ, గతంలో జరిగిన పొరపాట్లను ఖచ్చితంగా సరిదిద్దుతామని హామీ ఇచ్చారు.

# ప్రజాకవికి అపూర్వ గౌరవం ఇచ్చాము

మొదటిపేజీ తరువాయి

ఇవ్వాల్సిన అపూర్వమైన నివాళిని అర్పించి, తమకున్న గౌరవాన్ని చాటారని గుర్తు చేశారు. ఒక నిరుపేద దళిత కుటుంబంలో పెరిగి, రాష్ట్రం కోసం తపించిన ప్రజా గాయకుడికి ఈ ప్రభుత్వం సముచిత మర్యాదను అందించిందన్నారు. ఆనాడు అందెశ్రీ అంత్యక్రియల సమయంలో ఆయన కుటుంబానికి ప్రభుత్వం ఏ ఐదు వాగ్దానాలనైతే ఇచ్చిందో, వాటిని మరచిపోకుండా, నేడు స్మృతివనానికి భూమి పూజ చేసే సమయానికే వాటన్నింటినీ నెరవేర్చిన ప్రజా ప్రభుత్వంగా నిలిచామన్నారు. అందెశ్రీ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఇచ్చిన మాట ప్రకారం ఆయన కుమారుడు దత్తుకు బి.జె.ఆర్. డిగ్రీ కళాశాలలో ఉపన్యాసకుడిగా (లెక్చరర్) ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పించామని తెలిపారు. అలాగే అందెశ్రీ రచించిన ప్రసిద్ధ కవితా సంకలనం 'నిప్పుల వాగు' 20 వేల కాపీలను ప్రభుత్వ పరంగా ముద్రించి పంపిణీ చేసేందుకు విద్యాశాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, ఆ పనులను పురోగతిలో పెట్టామన్నారు. ఆయన అంతిమ సంస్కారాలు జరిగిన ప్రదేశాన్ని స్మృతి వనంగా మారుస్తామని చెప్పిన విధంగానే నేడు ముఖ్యమంత్రి తో కలిసి భూమి పూజ నిర్వహించడంతో పాటు, అందెశ్రీకి పద్మశ్రీ అవార్డు ఇవ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అధికారికంగా సిఫార్సు కూడా చేయడం జరిగిందని వివరించారు. నాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం ప్రతి ఒక్కరినీ కదిలించిన అందెశ్రీ కలం నుంచి జాలువారిన 'జయ జయహే తెలంగాణ' పాటను అధికారిక రాష్ట్ర గీతంగా ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ఏ కార్యక్రమం జరిగినా ఈ పాటను వినేలా మరియు వినిపించేలా ప్రభుత్వం నిర్ణయించి అమలు చేస్తున్నదని వివరించారు. 'మాయమై పోతున్నాడమ్మా మనిషన్నవాడు అనే పాట ద్వారా మానవత్వం గురించి, సమాజం పట్ల మనిషి, నాయకులు ఏ రకంగా నడుచుకోవాలో యావత్ ప్రపంచానికి తెలియజేసిన మహనీయుడు అందెశ్రీ. ఆయన జీవితాన్ని, ఆలోచనలను, సాహిత్య సంపదను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు.

# 'విక్రమ్-1' విజయవంతంపై ప్రధాని మోడీ హర్షం

మొదటిపేజీ తరువాయి

నేను ప్రత్యక్షంగా వీక్షించాను. దీని వెనుక ఎందరో యువ ఇంజినీర్ల శ్రమ దాగుంది. మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు. ఇది ఆరంభం మాత్రమే. ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి' అని స్కైరూట్ టీమ్‌ను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల బృందం త్వరలో తనను కలవాలని ఫోన్ ద్వారా ఆహ్వానించారు. అంతరిక్ష రంగంలో భారత్ స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఈ ప్రయోగం ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ అభిప్రాయపడ్డారు. 'అంతరిక్ష రంగంలోనూ భారత్ ఆత్మనిర్భర్‌గా ఎదగగలదని మీరు ప్రపంచానికి నిరూపించారు' అని ప్రధాని కొనియాడారు. 'విక్రమ్-1'లో తన 'వందేమాతరం' సందేశంతో కూడిన కార్డును కూడా పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన శుభాకాంక్షలు సహా ఆ సందేశం కూడా అంతరిక్షంలోకి చేరడం గర్వకారణమన్నారు. 'ఈ ప్రయోగం ద్వారా 'వందేమాతరం' సందేశం మరింత ఉన్నత స్థాయికి చేరి అంతరిక్షంలోనూ మార్మోగింది' అని మోదీ వ్యాఖ్యానించారు. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు 'మిషన్ ఆగమన్' పేరిట చేపట్టిన 'విక్రమ్-1' రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. నిర్ణీత సమయం కంటే 35 నిమిషాలు ఆలస్యంగా ప్రయోగం చేపట్టినప్పటికీ.. అన్ని దశలను విజయవంతంగా పూర్తి చేయడంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది.

# దొరల గడీల ముందు మోకరిల్లని కవి అందెశ్రీ

మొదటిపేజీ తరువాయి

అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం, ఆయన తనకు ఆత్మబంధువని, కుటుంబ సభ్యుడిగా, పెద్దన్నగా భావించానని అన్నారు. అందెశ్రీ పాటలు లక్షలాది మందిలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపాయని, తనలోనూ ఉద్యమ చైతన్యాన్ని రగిలించాయని పేర్కొన్నారు. గడీల ముందు మోకరిల్లనని చెప్పిన కవి అందెశ్రీ ఎప్పుడూ దొరల గడప తొక్కలేదని, ఆయన గానంలో గొప్పతనం, సమాజానికి మార్గనిర్దేశం చేసే శక్తి ఉందన్నారు. ఒకప్పుడు నిర్బంధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చారిత్రక విషయమని చెప్పారు. ఆనాటి ప్రభుత్వం అందెశ్రీని అవమానించిందని, అలాగే ప్రజాకవి గద్దర్‌ను ప్రగతిభవన్ ఎదుట ఎండలో నిలబెట్టిన ఘటనను కూడా సీఎం గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. గ్రూప్ పరీక్షలు నిర్వహించి నిజంగా ఉద్యోగాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. కేవలం నోటిఫికేషన్లు ఇచ్చి పేపర్లు లీక్ చేయడం ద్వారా కోట్లు సంపాదించారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులు, బంధువులకే ఉద్యోగాలు, పదవులు కట్టబెట్టారని, కష్టపడి చదివిన నిరుద్యోగులను నిరాశపరిచారని విమర్శించారు. గతంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలను ప్రస్తావించిన సీఎం, తెలంగాణను శవాలమయంగా మార్చింది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్న ఆయన, గత ప్రభుత్వం రాష్ట్రానికి రూ.8 లక్షల కోట్ల అప్పులు మిగిల్చి ఫామ్‌హౌస్ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇస్తే ఈ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందని ప్రతిపక్ష నేతలు నిస్సిగ్గుగా చెబుతున్నారని సీఎం మండిపడ్డారు. నిరుద్యోగులు, ఉద్యోగ నియామకాల గురించి ఒక్క రోజైనా బీఆర్ఎస్ పాలకులు ఆలోచించారా? 16 ఏళ్ల తర్వాత.. మేం అధికారంలోకి వచ్చాక గ్రూప్-1 నిర్వహించాం. బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలిచ్చాం. తల్లిదండ్రుల సాక్షిగా వారందరికీ ఉద్యోగ నియామక పత్రాలిచ్చాం. కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ సమాజం శ్రీమంతుల్ని చేసింది. అలాంటి రాష్ట్రానికి వాళ్లు తిరిగి ఏమిచ్చారు? ఉన్నదంతా దోచుకున్నారు. కేసీఆర్ 1000 ఎకరాల్లో, కేటీఆర్ 100 ఎకరాల్లో, హరీశ్‌రావు 50 ఎకరాల్లో, కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. మీరు నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎలా మారారు? కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు అప్పుడే క్షమించారని అనుకుంటున్నారా? నేను ఉన్నంతవరకు మరోసారి మీ సర్కారును రానివ్వను. తెలంగాణను దోచుకోవాలని చూస్తే.. అందెశ్రీ మళ్లీ పాటై పుడతాడని రేవంత్‌రెడ్డి అన్నారు.

# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

మొదటిపేజీ తరువాయి

మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిడ్డారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్య కాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, ఓయూలో నిర్బంధాలు కనిపించడం లేదా అని అడిగారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు. నవంబర్ 22న అవినీతి సొమ్ముతో జాబ్ క్యాలెండర్‌పై యాడ్‌లు వేశారని గుర్తుచేశారు. కానీ ఇవాళ జాబులు లేవు.. జవాబులు లేవని విమర్శించారు. ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ మారినా.. జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితాలుగా మారిందని విమర్శించారు. చరిత్రను మరిచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చరిత్రలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. తెలంగాణ ఉద్యమాల్లో చావగొట్టిన వాళ్లే మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు నమ్మి తెలంగాణ యువత మోసపోయింద్రు అని తెలిపారు. 1952, 1969లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత గుండెల్లో గుణపాలు నింపిందని గుర్తుచేశారు. వేలమంది యువత ప్రాణాలు తీసుకున్నా కాంగ్రెస్‌కు రక్తదాహం తీరడం లేదని అన్నారు. మన రక్తం పొలాల మీద చల్లాలని చిల్లరమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు, యూత్, మహిళ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. ఓటు కోసం కోటి మోసాలు చేస్తున్న కాంగ్రెస్ తీరు దేశానికి తెలియాలన్నారు. రేపటి తెలంగాణ నిర్మాతలు మీరు.. భవిష్యత్ నిర్ణేతలు మీరే అని యువతను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అలాంటి యువతను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. మీకు జరిగిన మోసం, వంచనను గుర్తుచేసుకుని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సరిగ్గా 38 నెలల కింద ఇదే సరూర్ నగర్ స్టేడియం సాక్షిగా తెలంగాణ యువత దగా పడిందని తెలిపారు. నిరుద్యోగులను వంచించిన దగాకోరులు కాంగ్రెస్ నాయకులు అని పేర్కొన్నారు. హైకమాండ్ తరలివచ్చి మాయామశ్చీంద్ర కార్యక్రమం ఇక్కడ చేశారని ఎద్దేవా చేశారు. యూత్ డిక్లరేషన్ పేరిట దుర్మార్గమైన వాగ్దానాల వరద పారించారని మండిపడ్డారు. పాత కేటుగాళ్లు.. కొత్త డూప్లికేట్లు వచ్చి యువతపై లేని ప్రేమను కనబరిచారని తెలిపారు. యూత్‌కు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారా అని నిలదీశారు. ప్రైవేటు కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ వచ్చిందా అని అడిగారు. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు వచ్చాయా? యువతకు రూ.10లక్షల రుణాలు వచ్చాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వచ్చాయా? అని ప్రశ్నించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీలు, మూడు యూనివర్సిటీలు వచ్చాయా? నెలకు రూ.4వేల భృతి వచ్చిందా? పదో తరగతిలో రూ.10వేలు, ఇంటర్ పాసైతే రూ.15వేలు వచ్చాయా? డిగ్రీ ఉత్తీర్ణులతై లక్ష వచ్చాయా? పీహెచ్‌డీ పాసైతే రూ.5లక్షలు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఇంత మోసానికి పాల్పడిన వారిని ఏమనాలో ఆలోచించాలని సూచించారు. దగుల్బాజీలా.. దోకేబాజ్‌లు అనాలో మీరే ఆలోచించాలన్నారు. జిత్తులమారి ముసలి నక్క కాంగ్రెస్ యువజనాన్ని తెలివిగా చిత్తు చేసిందని కేటీఆర్ విమర్శించారు. 60 ఏళ్లు నెత్తురు మరిగిన కాంగ్రెస్ యువతను ఎలా మోసం చేసిందో గుర్తించాలన్నారు. కాంగ్రెస్ మోసపు వలలో పడిపోయి గోసపడుతున్నారని తెలిపారు. 31 నెలలు గడిచాయి.. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. మాటతప్పి వంచించి, నమ్మించి నట్టేట ముంచి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. యువతరంతో పెట్టుకుంటే కొన్ని తరాలు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

# భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం

మొదటిపేజీ తరువాయి

జరగాల్సి ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టి ఇంధన పక్రియలో తలెత్తిన సమస్యను గుర్తించి సరిచేశారు. 35 నిమిషాల తర్వాత తిరిగి రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్‌లు సహా ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్-1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్నీ నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేకాకుండా.. ఈ ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ స్కైరూట్ టీమ్ సహా ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులనూ ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు. స్కైరూట్ సంస్థ 'మిషన్ ఆగమన్' పేరిట ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టింది. విక్రమ్-1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్‌డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ పేలోడ్‌లు సహా స్కైరూట్‌కు చెందిన 'స్కోప్'ను కూడా అంతరిక్షంలోకి పంపారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి తద్వారా కీలక సమాచారం రాబట్టనున్నారు. దీంతో రానున్న కాలంలో వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంకేతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా స్కైరూట్ ముందడుగేస్తోంది. ఇక.. సుమారు ఏడంతస్తుల భవనం ఎత్తులో రూపొందిన విక్రమ్-1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లోఎర్త్ ఆర్బిట్ లో ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2022లో విక్రమ్-ఎస్ ద్వారా తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు విక్రమ్-1తో తొలి దేశీయ ప్రైవేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టింది. ఈ ప్రయోగాన్ని ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రత్యక్షంగా వీక్షించారు. కుమారుడు దేవాన్ష్‌తో కలిసి శ్రీహరికోటకు వెళ్లిన లోకేశ్.. ఇస్రో గ్యాలరీ నుంచి 'విక్రమ్-1' ప్రయోగాన్ని వీక్షించారు. ఇస్రో మాజీ ఛైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆహార కల్తీపై ఇక ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి

ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ క్రమంలో తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం బిల్లుకు తుది రూపం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. కల్తీల నియంత్రణలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో అమలవుతున్న చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి వాటిలో ఉత్తమ పద్ధతులను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో 'క్యూర్' ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ వ్యవస్థను అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపింది. సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. రసాయన అవశేషాలు, కల్తీ కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం పేర్కొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ కొరత రావద్దు

మొదటిపేజీ తరువాయి

సదుపాయం కల్పించడం, ఐటీ కారిడార్‌లో అవసరమైన చోట్ల సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అదే విధంగా, తెలంగాణ భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింగరేణి కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధన, తాడిచర్ల-2 బ్లాక్‌లో నిర్ణీత గడువులో ఉత్పత్తి ప్రారంభం, కోయగూడెం 3, సత్తుపల్లి 3 బ్లాక్‌లను సింగరేణికి దక్కేలా కార్యాచరణ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఇంధన భద్రతను మరింత బలోపేతం చేస్తూ ప్రతి రంగానికి విశ్వసనీయ విద్యుత్ అందించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి అన్నారు.

# నేను ఎప్పుడూ పదవులు అడుక్కోను

మొదటిపేజీ తరువాయి

రాజకీయ రికార్డును గుర్తుచేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మీడియా ప్రతినిధులతో జరిపిన చిట్‌చాట్‌లో సంచలన వ్యాఖ్యలు చేశారు. తన మంత్రి పదవి, కుటుంబంలో ఇద్దరికి పదవుల అంశంపై వస్తున్న విమర్శలపై ఆయన తనదైన శైలిలో స్పందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడకముందు జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ.. ఎన్నికల ముందు ఏఐసీసీ నాయకత్వం ఆరుగురు సీనియర్లకు మంత్రి పదవులు ఇస్తామని హామీ ఇచ్చిందని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. 'హైకమాండ్ ఆరుగురిలో ఐదుగురికి మంత్రి పదవులు ఇచ్చింది. కానీ నా ఒక్కడికే ఇవ్వలేదు. అలాగని నేను పదవి కోసం అడుక్కునే టైం ఇది కాదు' అని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి పదవి దక్కకపోవడంపై తన అంతరంగాన్ని ఆయన ఈ సందర్భంగా బయటపెట్టారు. సొంత అన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇప్పటికే క్యాబినెట్ మంత్రిగా ఉన్నందున, 'ఒకే కుటుంబానికి ఒకే పదవి' అనే నిబంధన వల్లే రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి దక్కలేదనే ప్రచారంపై ఆయన తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ రూల్స్ పై స్పందిస్తూ.. భార్యాభర్తలు మాత్రమే ఒక కుటుంబం కిందకు వస్తారు. కానీ అన్నాదమ్ములు ఒకే కుటుంబం ఎలా అవుతారని ప్రశ్నించారు. దీనికి ఉదాహరణగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులను ప్రస్తావిస్తూ.. 'ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మావతి ఇద్దరూ ఒకే ఫ్యామిలీ అవుతారు. కానీ మేము అన్నదమ్ములం, ఇద్దరం వేర్వేరు ఇళ్లలో ఉంటున్నాం. అలాంటప్పుడు అన్న, నేను ఇద్దరం ఒకే కుటుంబం అంటే ఎలా కుదురుతుందని రాజగోపాల్ రెడ్డి నిలదీశారు. భిన్నమైన ఇళ్లలో ఉంటూ రాజకీయంగా విడివిడిగా కష్టపడుతున్న తమకు ఈ నిబంధన వర్తింపజేయడం సరికాదనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవు

మొదటిపేజీ తరువాయి

కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించిన అంశాల్లో ఇద్దరూ కలిసి పని చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే.. అంతర్గతంగా పరిష్కరించుకోవాలని ఆదేశించారు. అనంతరం ఇరువురు నేతలతో కలిసి ఎంపీ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో భాజపాను అధికారంలోకి తీసుకురావడంపై చర్చించినట్లు తెలిపారు. ప్రజలకు కాంగ్రెస్‌పై కోపం ఉందని, అలాగే బీఆర్ఎస్‌పై నమ్మకం లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లు పెరుగుతాయని, జమిలి ఎన్నికలు జరుగుతాయన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. భాజపాను అధికారంలోకి తెచ్చేందుకు తామంతా కలిసి పనిచేస్తామని వివరించారు. తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న బీజేపీ.. ఆ దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఈ క్రమంలోనే నేతల మధ్య విభేదాలను తొలగించి.. అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ఎంతో కాలంగా విభేదాలతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చారు. వీరిద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు రంగంలోకి దిగిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్.. నేడు ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా జరిగిన ఈ సమావేశంలో ఈటల, బండి మధ్య రాజీ కుదిర్చారు. విభేదాలు పక్కనపెట్టి.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని ఇద్దరు నేతలకు అభయ్ పాటిల్ దిశానిర్దేశం చేశారు. భేటీ అనంతరం మీడియా ముందుకు బీజేపీ నేతలు.. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందంటూ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధిపై మోదీ ప్రత్యేక చొరవ చూపారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# స్కైరూట్ మన టీ హబ్‌లోనే పుట్టింది

మొదటిపేజీ తరువాయి

రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపిన ఆ కంపెనీ మన టీహబ్ నుంచే వచ్చిందన్నారు. ఇవాళ ఉదయమే ప్రయోగం విజయవంతంగా నిర్వహించారు. ఈ రోజు శ్రీహరికోట నుంచి ప్రైవేట్ రాకెట్‌ను పంపిన స్కైరూట్ కంపెనీకి చప్పట్లతో అభినందనలు తెలుపాలని కేటీఆర్ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. ఇస్రో నుండి తొలిసారి ప్రైవేట్ రాకెట్ ప్రయోగం సక్సెస్ అవడంతో స్కైరూట్ కంట్రోల్ సెంటర్‌లో సంబురాలు చేసుకుంటున్నారు.

# దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

ఘన విజయం సాధించిందని తెలిపారు. భారత అంతరిక్ష రంగం మరో చారిత్రక మైలురాయిని చేరుకుంద న్నారు. దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ నిలిచిం దని సీఎం అన్నారు. హైదరాబాద్ ఇన్నోవేషన్ శక్తికి ప్రపంచ వేదికపై గుర్తింపు లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా స్కైరూట్ బృందానికి ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. విక్రమ్-1.. ప్రైవేట్ స్పేస్ రంగంలో భారత్ సత్తా చాటిందని కొనియాడారు. భవిష్యత్తు అంతరిక్ష ప్రయాణాలకు తెలంగాణ నుంచి బలమైన అడుగు పడిందని ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.



# ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలులో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

**- పెండింగ్ సంక్షేమ నిధుల పూర్తి వివరాలను వెంటనే సమర్పించాలి - గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ పాఠశాలల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండరాదు - ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య - ఐడీఓసీలో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, జూలై 18 : ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ రాంరెడ్డి, అదనపు కలెక్టర్లు బి. శ్రీరాములు, జె. అరుణశ్రీతో కలిసి జిల్లా అధికారులతో ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వివరించారు. అలాగే గురుకులాలు, సంక్షేమ, గిరిజన రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, మోడల్ పాఠశాలల నిర్వహణ, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో మాట్లాడి ఎస్సీ, ఎస్టీ బాధితుల పరిహారానికి సంబంధించిన 50 శాతం నిధులను విడుదల చేయించినట్లు తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, ఓవర్సీస్ విద్యా పథకం, ఎస్సీ, ఎస్టీ బాధితుల పరిహారం, గురుకుల విద్యాసంస్థలకు సంబంధించిన పెండింగ్ నిధులు ఎంత ఉన్నాయో పూర్తి వివరాలను వెంటనే కమీషన్‌కు సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరులో ముఖ్యమంత్రితో సమావేశం నిర్వహించనున్నందున, పెండింగ్‌లో ఉన్న అన్ని నిధుల విడుదల అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లి, మిగిలిన నిధులన్నింటినీ విడుదల చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలోని గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు), మోడల్ పాఠశాలల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా లేకుండా నింపి, పూర్తి సామర్థ్యంతో నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో ఎస్సీ, ఎస్టీలకు అమలులో ఉన్న రిజర్వేషన్లను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఉపాధి కల్పనలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను తప్పనిసరిగా అమలు చేయాలని, ఉపాధి కల్పన కార్యాలయం, వారధి సొసైటీ ద్వారా ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసే అన్ని ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు అమలులో ఉన్న రిజర్వేషన్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రిజర్వేషన్ విధానాన్ని పారదర్శకంగా అమలు చేసి, అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు న్యాయం జరిగేలా అన్ని శాఖలు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి, నిబంధనల ప్రకారం సత్వర విచారణ నిర్వహించి ఛార్జిషీట్ దాఖలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నిజమైన బాధితులకు చట్టబద్ధంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి, సంక్షేమ పథకాల అమలులో జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. కమీషన్ సూచించిన మేరకు పెండింగ్ నిధులకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి నిర్ణీత సమయంలో కమీషన్‌కు సమర్పిస్తామని తెలిపారు. విద్య, ఉపాధి, సంక్షేమం, జీవనోపాధి, గురుకుల విద్యాసంస్థల బలోపేతం, ఎస్సీ, ఎస్టీ వర్గాల సమగ్ర అభివృద్ధికి జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు. ఇంకా ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట ప్రవీణ్, ఆర్డీవోలు బి. గంగయ్య, సురేష్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్, ఏసిపి రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.








# అణచివేతలపై గిరిజనులు ఐక్యంగా ఉద్యమించాలి.

**- హక్కుల సాధనకు రాజీలేని పోరాటం తప్పదు - ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు - పాల్వంచలో గిరిజనుల భారీ ప్రదర్శన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, జూలై 18 : అడవిపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులపై అణచివేతలు, అక్రమ కేసులు, భూహక్కుల నిరాకరణను ఇకపై సహించబోమని, హక్కుల సాధన కోసం గిరిజనులంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. తెలంగాణ గిరిజన సమాఖ్య (టీజీఎస్) రాష్ట్ర మహాసభల ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తరతరాలుగా సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వకుండా గిరిజనులను వేధించడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. గిరిజనుల సమస్యలపై సమగ్ర కార్యాచరణ రూపొందించి, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని తెలిపారు. అడవి బిడ్డల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు శాసనసభలోనూ, బయటా తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, రహదారులు వంటి మౌలిక వసతులు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, గిరిజన సబ్‌ప్లాన్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించకుండా జనాభా ప్రాతిపదికన పూర్తిస్థాయిలో కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే కేంద్ర ప్రభుత్వ చర్యలను ఆయన తప్పుబట్టారు. నిధుల కోతలతో గిరిజన ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గి వలసలు పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. స్థానికంగా 200 రోజుల ఉపాధి కల్పించాలని, ఐటీడీఏల పనితీరును మెరుగుపరచి స్థానిక సంస్థలకు తగిన నిధులు, అధికారాలు అప్పగించాలని కోరారు. అటవీ హక్కుల చట్టం--2006ను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించిన ఆయన, పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా ఆదివాసీలను ఏకం చేసి హక్కుల సాధన కోసం బలమైన జాతీయ ఉద్యమాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. మహాసభల సందర్భంగా పాల్వంచ పట్టణంలో గిరిజనులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా రామ్మూర్తి నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామావత్ అంజయ్య నాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్ పాషా, పాల్వంచ మేయర్ మూడ్ గణేష్, సీపీఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, సరిరెడ్డి పుల్లారెడ్డి, సయ్యద్ సలీం, సలిగంటి శ్రీనివాస్, మున్నా లక్ష్మీకుమారి, జిల్లా నాయకులు, గిరిజన సమాఖ్య ప్రతినిధులు, వివిధ జిల్లాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



**- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ**
**- నానమ్మ కళావతి పేరిట సేవలు అందించడం గర్వకారణం**
**- నా వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తా: ఎంపీ హామీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), జూలై 18 : సమాజంలో వెనుకబడిన, దివ్యాంగులైన వ్యక్తులకు లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) లయన్ గడ్డం వంశీ కృష్ణ కొనియాడారు. శనివారం గోదావరిఖని రాజీవ్ రహదారి పక్కన ఉన్న లయన్స్ భవన్‌లో 'లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం' (డిస్ట్రిక్ట్ 320జి, రీజియన్-6, జోన్-2) ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత కాలిపర్స్ (కృత్రిమ కాళ్లు/సహాయక పరికరాలు) పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన ఎంపీ వంశీ కృష్ణ మాట్లాడుతూ, శారీరక వైకల్యంతో బాధపడుతున్న వారికి కాలిపర్స్ అందించడం ద్వారా వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపవచ్చన్నారు. లయన్స్ క్లబ్ ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండటం సంతోషకరమన్నారు. ముఖ్యంగా తన నానమ్మ కళావతి గారి పేరు మీద ఇక్కడ సేవా కార్యక్రమాలు జరగడం, సమాజానికి మేలు చేకూరడం తనకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. క్లబ్ తరఫున చేపట్టే ఇలాంటి మరిన్ని మంచి కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ తానిపర్తి విజయలక్ష్మి, కో-ఆర్డినేటర్ మనోజ్ కుమార్ అగర్వాల్, క్లబ్ ప్రెసిడెంట్ కళావతి బంక, సెక్రటరీ జయప్రద కాజంపురం, ట్రెజరర్ ఉమారాణి వడ్లకొండ, పి. మల్లికార్జున్, బంక రామస్వామి, కె. రాజేందర్, తానిపర్తి గోపాల్రావు, ఎల్లప్ప, గంగాధర్, వేణిగోపాల్ త్రివేది, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఉచితంగా కాలిపర్స్ పంపిణీ చేశారు.

# రామగుండం పట్టణంలో రాత్రి దొంగల అరెస్ట్

**పోలీసుల నిఘా... యువకులే నిందితులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, జులై 18 : రామగుండం పట్టణంలో గత కొన్ని నెలలుగా రాత్రి వేళలో జరుగుతున్న దొంగతనాలు పట్టణ ప్రజల్లో భయాందోళనలకు గురిచేస్తుంది. దీంతో రామగుండం పోలీస్ స్టేషన్ సిబ్బంది వ్యవహరిస్తూ నిఘా పెట్టి ఎట్టకేలకు చోరీలకు పాల్పడుతున్న దొంగలను పట్టుకున్నారు. శనివారం రామగుండం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోదావరిఖని ఏసిపి మడత రమేష్ ఈ చోరీలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. దొంగతనాలకు పాల్పడుతున్న ఎత్తరి సాయికుమార్, ఆనంద్, భాస్కర్ ఠాకూర్, ప్రమోద్ అలియాస్ పంకజ్ శెట్టి, వినయ్, శ్రీనివాస్, గణేష్, పరశురాం, సాగర్, బొమ్మ గంటి సాయి, అరవిందు పదిమంది యువకులు దొంగతనాలకు రాత్రి వేళలో పాల్పడుతున్నారని అన్నారు. అయితే వీరందరికీ గతంలో దొంగతనాలకు పాల్పడిన అనుభవం లేదని ఎలాంటి నేరచరిత్ర లేని వారని ఏసీపి మడత రమేష్ తెలిపారు. అయితే బొమ్మ కంటి సాయి, అరవింద్ పరారిలో ఉన్నారని మిగతా వారిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. కాగా రామగుండం సీఐ కృష్ణ కుమార్. ఎస్సై సంధ్యారాణి, ఎస్సై సర్దన, రవీందర్, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ రావు, కానిస్టేబుల్ కొల్లూరి సంపత్, లను ఏసీపి రమేష్ అభినందించారు. వీరికి రివార్డు కోసం సిపి అంబర్ కిషోర్ ఝా దృష్టికి తీసుకుపోయి ఇప్పిస్తామని ఏసీపి రమేష్ అన్నారు.

# గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

**- ఎస్‌బిఎం స్టేట్ డైరెక్టర్ సురేష్ బాబు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు, జూలై 18 : గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎస్బిఎం స్టేట్ డైరెక్టర్ సురేష్ బాబు అన్నారు. శనివారం ములుగు మండలం లోని ఇంచర్ల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్ బి ఎం స్టేట్ డైరెక్టర్ సురేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్విని యోగం చేసుకొని చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేసుకోవాలని, గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సహజ వనరులను స్థానిక ఆదాయ మార్గాలను గుర్తించి గ్రామపంచాయతీ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని, గ్రామపంచాయతీ ఆర్థికంగా బలోపేతం అయితేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. గ్రామంలో ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు ఇంటి వద్దనే చెత్తను వేరు చేసే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని చెత్త సేకరణ సమయంలో తడి చెత్త, పొడి చెత్త,ప్లాస్టిక్ వ్యర్థాలు వేరువేరుగా సేకరించి పారావేయాలని తెలిపారు.

# 50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, జూలై 18 : రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలోని గోదావరిఖని-2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నిల్వ చేసిన 50 క్వింటాళ్ల ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని కమీషనరేట్ టాస్క్‌ఫోర్స్, నార్కోటిక్ బృందాలు శనివారం స్వాధీనం చేసుకున్నాయి. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు యైటింక్లైన్ కాలనీలోని సంతోష్‌నగర్‌లో ఆకస్మిక దాడులు నిర్వహించగా, సుమారు 50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభ్యమయ్యాయి. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు రూ. 2.25 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన మోతె కనుకయ్య (25)ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని, స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యంతో పాటు తదుపరి చట్టపరమైన చర్యల కోసం గోదావరిఖని-2 టౌన్ పోలీస్ స్టేషన్ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు వెల్లడించారు.

# పిల్లల బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రులే బాటలు వేయాలి

**- చదువుతో పాటు క్రీడలపైనా ప్రోత్సహించాలి: కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి**

**-పాత పాల్వంచ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, జూలై 18 : విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని, పిల్లలను క్రమశిక్షణతో పెంచి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అన్నారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాత పాల్వంచలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు క్రీడలు, క్రమశిక్షణ, మంచి విలువల పట్ల ఆసక్తి పెంపొందించాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం నాణ్యమైన యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, క్రీడా మైదానాలు వంటి అనేక సౌకర్యాలు కల్పిస్తోందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని అన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను కుటుంబ సభ్యులుగా భావించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు (జీవీ), ప్రధానోపాధ్యాయురాలు పద్మలత, ఉపాధ్యాయులు బి. రాజు, కే. శాంతకుమారి, కాల్వ సుందరమ్మ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆదిలక్ష్మి, జి. గౌరీ, గ్రామస్తులు బూసి శ్రీను, యాటా నాని, కోడూరి లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

# మహాముత్తారం ప్రభుత్వ ఆస్పత్రిలో 24 గంటల వైద్య సేవలు కల్పించాలి

**- సీజనల్ వ్యాధులు, పాముకాట్లతో ఏజెన్సీ ప్రజలు ఇబ్బందులు.**

**- స్పందించకపోతే ఉధృత ఆందోళనలు తప్పవు: తెలంగాణ ప్రజా ఫ్రంట్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాటారం, జూలై 18 : మహాదేవ్‌పూర్ మండలం మహాముత్తారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి, ఏజెన్సీ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న వైద్య సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయని, రైతులు, కూలీలు రాత్రి వేళల్లో పాముకాటు, తేలు కాటుకు గురైనప్పుడు అత్యవసర వైద్య సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో 24 గంటల పాటు వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల ఏజెన్సీ ప్రాంత ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని అన్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించిన ఆయన, ప్రభుత్వం వెంటనే స్పందించి ఆస్పత్రిలో రౌండ్ ది క్లాక్ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు రామగిరి రాజు పాల్గొన్నారు.

# మద్దులపల్లిలో గుడుంబాపై ఉక్కుపాదం

**- అమ్మితే రూ.10 వేల జరిమానా-సమాచారం అందిస్తే రూ.1,000 గిఫ్ట్**

**- గుడుంబా రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: సర్పంచ్ సరిత**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాటారం, జూలై 18 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో గుడుంబా తయారీ, విక్రయాల నిర్మూలనకు గ్రామపంచాయతీ పాలకవర్గం కఠిన చర్యలు చేపట్టింది. గ్రామాన్ని గుడుంబా రహిత ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో శనివారం సర్పంచ్ ఎల్బుల సరిత, ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి, గ్రామ కార్యదర్శి స్వాతి, వార్డు సభ్యులు గ్రామంలోని కిరాణా, బెల్ట్ షాపులు తదితర దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి వ్యాపారులకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. గ్రామంలో ఎవరైనా గుడుంబా తయారు చేసినా లేదా విక్రయించినా చట్టపరమైన చర్యలతో పాటు రూ. 10 వేల జరిమానా విధిస్తామని పంచాయతీ స్పష్టం చేసింది. అలాగే గుడుంబా విక్రయాలపై ఫోటోలు లేదా పక్కా ఆధారాలతో సమాచారం అందించిన వారికి రూ. 1,000 నగదు బహుమతి అందజేస్తామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ప్రకటించింది. గ్రామంలో మద్యం, గుడుంబా అక్రమ విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రజల సహకారం అవసరమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ ఎల్బుల సరిత తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తేజస్విని, దేవిక, శ్రావణి, వెంకటేష్, మనక్కతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# శ్రీనివాసగిరిలో ఘనంగా వనమహోత్సవం

**- ఐదు వేల మొక్కల నాటే కార్యక్రమానికి శ్రీకారం**

**- ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పాల్వంచ, జూలై 18 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచ-దమ్మపేట ప్రధాన రహదారిపై ఉన్న శ్రీనివాసగిరి (గుట్ట)లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థాన ఆవరణలో శనివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసగిరి భక్త సమాజ మండలి, శ్రీ వేంకటేశ్వర స్వామి సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఈ రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా మొత్తం ఐదు వేల మొక్కలను నాటేందుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. గతంలో వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసేవని, ప్రస్తుతం వాతావరణ మార్పులతో వర్షపాతం తగ్గిపోతున్న నేపథ్యంలో మొక్కల పెంపకం అత్యంత అవసరమైందన్నారు. ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణకు సేవా ట్రస్ట్ చేపట్టిన ఈ కార్యక్రమం ఆదర్శనీయమని ప్రశంసించారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No . 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com